www.andhrajyothy.com
వెల (Price) : Rs. 8.00
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం
సంపుటి (Volume) : 21
సంచిక (Issue) : 349
ఆదివారం | 17-3-2024
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి రా. 9.54 తదుపరి నవమి; నక్షత్రం: మృగశిర సా. 4.48 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: రా.1.41-3.22; దుర్ముహూర్తం: సా.4.47-5.35; అమృతఘడియలు: ఉ.7.44-9.23; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.26; సూర్యాస్తమయం: 6.23
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మోగింది భేరి

సార్వత్రిక శంఖారావం.. 7 దశల్లో లోక్‌సభ ఎన్నికల పోలింగ్

నాలుగో దశలో ఏపీ అసెంబ్లీకి, తెలంగాణకు మే 13న ఒకే రోజు

- 2 రాష్ట్రాల్లో ఏప్రిల్ 18 నుంచి నామినేషన్లు
- ఒడిసా, మరో రెండు రాష్ట్రాలకూ పోలింగ్
- జూన్ 1న చివరి దశ.. 4న లెక్కింపు
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం
- కోడ్ కఠినంగా అమలు చేస్తామని వెల్లడి
- 85 దాటిన వృద్ధులకు ఇంటి వద్దే ఓటు
- లోక్‌సభ తర్వాత కశ్మీరు అసెంబ్లీ ఎన్నికలు
- కంటోన్మెంట్‌కు మే 13నే ఉప ఎన్నిక

తెలుగు రాష్ట్రాల్లో మండుటెండల్లో పోలింగ్


ఎన్నికల షెడ్యూల్‌ను వెల్లడిస్తున్న సీఈసీ రాజీవ్‌కుమార్ (మధ్యలో). చిత్రంలో కమిషనర్లు జ్ఞానేశ్‌కుమార్, సుఖ్‌బీర్ సంధూ

న్యూఢిల్లీ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ఎన్నికల ప్రక్రియకు తెరలేచింది. లోక్‌సభ, ఆంధ్రప్రదేశ్, మరో మూడు శాసనసభల ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. రెండు నెలల పాటు సుదీర్ఘంగా సాగే ఎన్నికల వివరాలను ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మొత్తం ఏడు దశల్లో సాగే ఈ ఎన్నికల్లో దేశంలోని మొత్తం 543 లోక్‌సభ స్థానాలకు, ఆంధ్రప్రదేశ్, ఒడిసా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కింలలోని అన్ని శాసనసభ స్థానాలకు, వివిధ రాష్ట్రాల్లో ఖాళీ అయిన 26 శాసనసభ

మిగతా 12వ పేజీలో...

లోక్‌సభ ఎన్నికలు 2024

దశలు	పోలింగ్ తేదీ	సీట్లు
1	ఏప్రిల్ 19	102
2	ఏప్రిల్ 26	89
3	మే 07	94
4	మే 13	96
5	మే 20	49
6	మే 25	57
7	జూన్ 01	57

ఫలితాలు జూన్ 4

ఎన్నికలకు మేం సిద్ధం

- పదేళ్లలో దేశాన్ని మలుపు తిప్పాం
- ప్రజల ముందుకెళ్లి ఓటు అడుగుతాం
- విపక్షాలకు నిందలు వేయడమే పని
- వారికి ఓ విధానం, లక్ష్యమంటూ లేవు
- షెడ్యూల్ వచ్చాక మోదీ ట్వీట్

ఇదే చివరి అవకాశం

- నియంతృత్వం బారి నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి: ఖర్గే

12

అవినీతిపరులను వదలం



నాగర్‌కర్నూల్ సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ; హాజరైన ప్రజలు

- వారి భరతం పట్టి.. ప్రజాధనాన్ని కక్కిస్తాం
- ఇందుకు తెలంగాణ ప్రజల మద్దతు కావాలి
- కాంగ్రెస్‌ది 2జీ, బీఆర్ఎస్‌ది ప్రాజెక్టుల స్కాం
- కేంద్రంలో మేం మళ్లీ వస్తే ఇక్కడ కాంగ్రెస్‌ను ఇష్టారాజ్యంగా వ్యవహరించనివ్వం
- తెలంగాణ కలలను బీఆర్ఎస్, కాంగ్రెస్ చిదిమేశాయి.. రాష్ట్రం నలిగిపోతోంది
- అవినీతిని ఇతర రాష్ట్రాలకు విస్తరించాయి
- దళిత డిప్యూటీ సీఎంను అవమానిస్తున్నారు
- నాగర్‌కర్నూల్ సభలో ప్రధాని మోదీ

నాగర్‌కర్నూల్/మహబూబ్‌నగర్/హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ మరోసారి కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. ఆ రెండూ కుటుంబ పార్టీలు అని, కుటుంబ పాలనలో అవినీతి భాగస్వామ్యం బలంగా ఉంటుందని అన్నారు. 70 ఏళ్ల దేశాన్ని పాలించిన కాంగ్రెస్, పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ఆర్థిక విధ్వంసం సృష్టించాయని ఆరోపించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ 2జీ కుంభకోణం చేస్తే.. ఇక్కడ బీఆర్ఎస్ సాగునీటి ప్రాజెక్టుల్లో అవినీతికి పాల్పడిందన్నారు. రెండు పార్టీలు అక్రమ దందాలకు, భూ మాఫియాకు మద్దతిస్తున్నాయని ధ్వజమెత్తారు. వీరి అక్రమాలు రాష్ట్ర సరిహద్దులు కూడా దాటుతున్నాయన్నారు. బీఆర్ఎస్ ఇతర రాష్ట్రాలకు వెళ్లి అత్యంత అవినీతిమయమైన పార్టీలతో కలిసిందని, ఆ నిజాలు ఇప్పుడు బయటికొస్తున్నాయని చెప్పారు. అవినీతిపరులను ఏ ఒక్కరినీ వదలబోమని, వారి భరతం పట్టి ప్రజాధనాన్ని కక్కిస్తామని

మిగతా 3వ పేజీలో...

కవిత అరెస్టు.. ఎన్నికల డ్రామా

- అవినీతిపై చర్యల పేరిట బీజేపీ, సానుభూతితో బీఆర్ఎస్ ఓట్ల వేట
- అరెస్టుపై కేసీఆర్ స్పందించరా?
- కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు కుట్ర
- మా సర్కార్‌ను పడగొట్టాలని అనుకుంటే నేను నిలబెడతా
- ఇబ్బంది వస్తే మద్దతిస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారు
- వంద రోజుల పాలన సంతృప్తికరం
- లోక్‌సభ ఎన్నికలు రెఫరెండం
- మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): "బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టు ఒక డ్రామా. ఇది ముమ్మాటికీ ఎన్నికల స్టంటే. ఢిల్లీ నుంచి ఈడీ అధికారులు వచ్చి కూతురిని అరెస్టు చేసి తీసుకెళ్తుంటే.. బాధ్యత గల తండ్రిగా కేసీఆర్ ఎందుకు స్పందించలేదు?" అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అరెస్టును ఎందుకు ఖండించలేదు? అని నిలదీశారు. బయటకు వచ్చి ప్రజలకు వివరణ ఎందుకు ఇవ్వలేదని అన్నారు. రాష్ట్రంలోనే ఉన్న ప్రధాని

మిగతా 2వ పేజీలో...

37 కార్పొరేషన్లకు చైర్మన్‌ల నియామకం

పర్యాటకానికి రమేశ్‌రెడ్డి.. టీజీఐఐసీకి నిర్మలా జగ్గారెడ్డి 14

కవితే కీలక కుట్రదారు

- ఆమె మనీలాండరింగ్‌కు పాల్పడ్డారు.. అరెస్టు చేసే అధికారం ఉంది
- స్కాంలో ప్రధాన లబ్ధిదారు.. కవితకు వ్యతిరేకంగా 13 సాక్ష్యాలు
- పైసా పెట్టుబడి లేకుండా మద్యం వ్యాపారంలో భాగస్వామి
- హోల్‌సేల్ మార్జిన్ పెరిగేట్లు చేసి భారీ లాభాలకు పునాది వేశారు
- 30% చాలదని 45% వాటా అడిగారు.. విచారణలో సహకరించలే
- అరెస్టుకు వెళితే కొందరి గలాభా.. ఫోన్లు ఫార్మాట్ చేసి ఇచ్చారు
- తప్పుడు సమాచారంతో సుప్రీం కోర్టులో పిటిషన్: ఈడీ
- కవిత భర్త అనిల్‌కూ పిలుపు.. సోమవారం రావాలంటూ తాఖీదులు


ఈడీ కస్టడీకి వెళ్తున్న కవిత

న్యూఢిల్లీ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం ప్రధాన పాత్రధారుల్లో(కింగ్‌పిన్) కవిత ఒకరని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రకటించింది. కుంభకోణంలో కీలక కుట్రదారని, ప్రధాన లబ్ధిదారని పేర్కొంది. ఆమె నుంచి వివరాలు సేకరించడానికి పది రోజుల కస్టడీకి ఇవ్వాలని ఢిల్లీలోని ఈడీ ప్రత్యేక న్యాయస్థానాన్ని కోరింది. ఈ మేరకు శనివారం వాదనల సందర్భంగా ఆమెను ఎందుకు కస్టడీకి

మిగతా 13వ పేజీలో...

ఈడీ కస్టడీకి కవిత

- ఏడు రోజుల కస్టడీకి కోర్టు అనుమతి.. రోజూ కుటుంబ సభ్యులు, న్యాయవాదులు కలవొచ్చు
- ఇంటి భోజనం తెప్పించుకోవచ్చు.. అక్రమంగా అరెస్టు చేశారు.. న్యాయపోరాటం చేస్తా: కవిత

13

కేసీఆర్.. కర్మఫలం!

తెలంగాణ నా అడ్డా అని గర్జించిన కేసీఆర్ కుటుంబాన్ని ఇప్పుడు కష్టాలు వెంటాడుతున్నాయి. అదేమిటోగానీ ప్రత్యేక రాష్ట్రాల కోసం ఉద్యమించి అధికారంలోకి వచ్చిన పలువురు నేతలు కేసుల్లో ఇరుక్కున్నారు.

ఇప్పుడు బీఆర్ఎస్ వంతు వచ్చింది. కొట్లాడి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రాలను సొంత జాగీర్లు చేసుకొని పాడి ఆవులుగా మార్చుకొనే ప్రయత్నం చేయడమే ఈ అనర్థాలకు కారణం కాదా? డబ్బు సంపాదనకు అలవాటు పడిన నేతలను, అధికారులను, సమాజం కూడా ఒక స్థాయి వరకే మన్నిస్తుంది. ఇప్పుడు కవిత విషయంలో కూడా జరుగుతున్నది ఇదే.

4

తొలి ఐదేళ్లు పెద్దగా ఆరోపణలు లేకుండా పని చేసిన కేసీఆర్ కూడా రెండవ పర్యాయం రెవెన్యూ తదితర విషయాలలో అడ్డగోలుగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలోనే కవిత రాష్ట్ర సరిహద్దులు దాటి ఢిల్లీ వరకు వెళ్లారు. లిక్కర్ కుంభకోణంలో ఇరుక్కున్నారు. కవిత అరెస్టు సందర్భంగా అక్కడి పరిస్థితులను గమనిస్తే కేసీఆర్ కుటుంబం ఒంటరి అయినట్టుగా భావించాల్సి ఉంటుంది.

రాష్ట్రంలోనే కాదు జాతీయ స్థాయిలో కూడా కేసీఆర్‌కు ఇప్పుడు సంఘీభావం ప్రకటించే వారు కనిపించడం లేదు. తాము శాశ్వతంగా అధికారంలోనే ఉంటామని విర్రవీగే నాయకులకు, వారి కుటుంబ సభ్యులకు కవిత ఉదంతం ఒక హెచ్చరిక. మొత్తమ్మీద తెలంగాణ ప్రస్తుత సీఎం రేవంత్ మహర్జాతకుడనే చెప్పాలి. ఈ అరెస్టు ఏదో అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగి ఉంటే కాంగ్రెస్‌కు మెజారిటీ లభించి ఉండేది కాదు. రేవంత్ సీఎం అయి ఉండేవారు కారు. కవిత అరెస్టును కేసీఆర్ అండ్ కో ఎంతవరకు ఉపయోగించుకొని ఉండేవారో తెలియదు గానీ బీఆర్ఎస్‌తో తమకు అవగాహన లేదని చెప్పుకొనే మహదావకాశం బీజేపీకి దక్కేది.


కొత్త పలుకు

అదను చూసి దెబ్బ కొట్టాలని అంటారు. కవితను అరెస్టు చేయడం కూడా ఇప్పుడు బీజేపీకి మేలు చేయకపోవచ్చునన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇప్పుడు ఈ అరెస్టు కేసీఆర్ అండ్ కోకు ఉపయోగపడే అవకాశం ఉందని కూడా అంటున్నారు. మోదీ రోడ్ షో జరుగుతున్న సమయంలోనే కవిత అరెస్టు జరగడం కాకతాళీయం కాకపోవచ్చు. బీఆర్ఎస్‌తో తమకు ఏ అవగాహనా లేదని తెలంగాణ సమాజానికి స్పష్టమైన సంకేతం ఇవ్వడం కోసమే కేంద్ర పెద్దలు ఈ సమయాన్ని ఎంచుకున్నారని చెబుతున్నారు.

స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత తెలంగాణ రాజకీయాలను కలుషితం చేయడంతో పాటు అవినీతిమయం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. ఆయన పుణ్యమా అని ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్న వాళ్లు అధికారం లేకుండా, డబ్బు లేకుండా ఉండలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. అధికారంలో ఉన్నప్పుడు కన్నూ మిన్నూ కానకుండా వ్యవహరించిన ఫలితాన్ని కేసీఆర్ అండ్ కో ఇప్పుడు అనుభవిస్తున్నారు. కవితను అరెస్టు చేసి ఢిల్లీ తీసుకుపోయినా తెలంగాణ ప్రజలు రోడ్ల మీదకు రాలేదు.

బీఎస్పీకి ఆర్ఎస్ ప్రవీణ్ గుడ్‌బై



- బీఆర్ఎస్‌తో పొత్తును బీజేపీ భగ్నం చేసింది
- ఎమ్మెల్సీ కవిత అరెస్టు అందులో భాగమే
- బహుజన వాదాన్ని గుండెల్లో దాచుకుంటా
- బీజేపీ కుట్రలకు భయపడను: ప్రవీణ్ ట్వీట్
- కేసీఆర్‌తో భేటీ.. నేడో రేపో బీఆర్ఎస్‌లోకి

2

ప్రతిమ మల్టీప్లెక్స్‌లో..

రూ. 6.67 కోట్లు పట్టివేత



- బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్ బంధువులది ఈ మల్టీప్లెక్స్
- ఎన్నికల్లో పంపిణీకే దాచారన్న ప్రత్యర్థి పార్టీలు

13

కాంగ్రెస్ పాలనకు 70-80 మార్కులు వేస్తా

- పేకమేడ కంటే వేగంగా బీఆర్ఎస్ కూలిపోతోంది
- ఎమ్మెల్సీ కవిత అరెస్టు ఎన్నికల స్టంట్: కూనంనేని

ఖమ్మం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వంద రోజుల కాంగ్రెస్ పాలనకు 70 నుంచి 80మార్కులు వేస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు పేర్కొన్నారు. మిగిలిన హామీలు కూడా అమలు చేస్తే వంద మార్కులు ఇస్తానని పేర్కొన్నారు. ఖమ్మంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో నిర్బంధమే తప్ప ప్రజాస్వామ్యం లేదన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పేక మేడ కంటే వేగంగా కూలిపోతోందని అన్నారు. సరిగ్గా షెడ్యూల్ వెలువడే ముందు రోజు ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం ఎన్నికల స్టంటేనని అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల వేళ కేసీఆర్‌కు, మోదీకి ఒప్పందం కుదిరిందన్న ప్రచారంతో బీజేపీకి ఓట్లు రాలేదని, అందువల్లే ఇప్పుడు కవితను అరెస్టు చేశారన్న ప్రచారం జరుగుతోందన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రావాలంటే కాంగ్రెస్ పార్టీ వామపక్షాలను కలుపుకొని పోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో తమకు ఏదో ఒక స్థానం కేటాయించకపోతే.. వామపక్షాలు కలిసి పోటీ చేయడమా? కాంగ్రెస్‌కు మద్దతివ్వాలా? అన్నదానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభల ప్రారంభోత్సవంలో కూనంనేని మాట్లాడుతూ కార్మిక సంక్షేమంలో బీజేపీ, కాంగ్రెస్‌ది ఒకే విధానమని విమర్శించారు. అందువల్ల కార్మికులు నూతన పంథాలో పోరాటానికి సిద్ధం కావాలని సూచించారు. కార్మికుల సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కార్మికుల వ్యతిరేకతను ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య

పూడూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటలు దిగుబడి రాకపోవడంతో అప్పులు తీర్చే మార్గంలేక ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలో జరిగింది. కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన రైతు కుర్వ రాజు(28) ఆరెకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. పంట పెట్టుబడి కోసం రూ.3 లక్షలు అప్పు చేయగా, వడ్డీతో కలిపి అది రూ.5 లక్షలు అయింది. ఇదే సమయంలో పంటలు సరిగా పండక దిగుబడి రాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది శనివారం పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు.

తిరుమలేశుడి సేవలో కంచి పీఠాధిపతి

తిరుమల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి శనివారం ఉదయం నైవేద్య విరామ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సనాతన ధర్మంపై అందరికీ ఆసక్తి కలిగించడంతో పాటు నైతిక విలువలనూ పెంపొందించేలా అనుగ్రహించాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

కోడ్ నేపథ్యంలో సిఫారసు లేఖల స్వీకరణ రద్దు

తిరుమల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో తిరుమలలో వసతి, శ్రీవారి దర్శనానికి సంబంధించి సిఫారసు లేఖల స్వీకరణను రద్దు చేసినట్టు టీటీడీ శనివారం ఓ ప్రకటన ద్వారా తెలిపింది. స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకు, వారి కుటుంబ సభ్యులకు నిర్దేశించిన విధి విధానాల మేరకు దర్శనం, వసతి కల్పిస్తామని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఏ రకమైన వసతి, దర్శనాలకు సిఫారసులు తీసుకోబోమని తెలిపింది. వీఐపీలు, భక్తులు విషయాన్ని గమనించి టీటీడీకి సహకరించాలని కోరింది.

ధాన్యం సత్వరమే కొనుగోలు చేయాలి

- నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో రైతుల రాస్తారోకో
- రోడ్డుపై ట్రాక్టర్లు అడ్డుగా పెట్టి నిరసన

మిర్యాలగూడ రూరల్, వేములపల్లి మార్చి 16: కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా మిల్లర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారని నల్లగొండ జిల్లాలో రైతులు నిరసనకు దిగారు. మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామ పరిధిలోని కోదాడ- జడ్చర్ల రహదారిపై, వేములపల్లి మండలం శెట్టిపాలెంలోని నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై ట్రాక్టర్లు అడ్డుగా పెట్టి రాస్తారోకో చేశారు. తక్షణమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం ట్రాక్టర్లను తీసుకొచ్చి ఉదయం నుంచి వేచి చూసినప్పటికీ ఎంతకూ మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము విసుగు చెంది తక్కువ ధరకు విక్రయించుకునేలా కుట్ర చేస్తున్నారన్నారు. కోతల సమయంలో క్వింటా ధాన్యం రూ.2,600 నుంచి రూ.2,700కు కొనుగోలు చేసిన మిల్లర్లు, కోతలు ఊపందుకోవడంతో క్వింటాకు రూ.2,300 నుంచి రూ.2,400 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసేవరకు రాస్తారోకో చేస్తామని రైతులు రోడ్డుపైనే బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. మిల్లర్లు ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసేలా చూస్తామని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

కోడేరు ఎంపీవోను చెప్పుతో కొట్టిన ఎంపీపీ

కోడేరు, మార్చి 16 : వర్క్ ఆర్డర్ విషయంలో తలెత్తిన వివాదంలో.. ఎంపీవోను మహిళా ఎంపీపీ చెప్పుతో కొట్టడం చర్చనీయాంశమైంది. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల పరిషత్ కార్యాలయంలో ఈ ఘటన జరిగింది. ఎంపీడీవో, ఎంపీవో తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిషత్ పంచాయతీ అధికారి(ఎంపీవో) శ్రావణ్ కుమార్‌ను మండల అధ్యక్షురాలు కొండా రాధా సుధాకర్‌రెడ్డి శనివారం తన చాంబర్‌కు పిలిపించారు. ఎత్తం గ్రామానికి చెందిన ఎంపీటీసీ నిధులు వర్క్ ఆర్డర్ ఎందుకు ఇచ్చారని.. తాను పని ఆపేయమని చెప్పాను కదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారిద్దరి మధ్య మాటామాట పెరిగింది. ఎంపీడీవో బాలచందర్ సృజన ముందే ఎంపీపీ రాధ తన కాలి చెప్పుతో ఎంపీవో శ్రావణ్‌కుమార్‌పై దాడి చేశారు. తనపై దాడి చేసిన ఎంపీపీని శిక్షించాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రధాని మోదీకి ఓట్ల మీదే యావ: మల్లు రవి

న్యూఢిల్లీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీకి ఓట్లే మీదే యావ అని.. నాగర్‌కర్నూల్ సభలో ఆయన ఇచ్చిన ఉపన్యాసంలో పసలేదని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి విమర్శించారు. గత పదేళ్లలో రాష్ట్రానికి బీజేపీ సర్కారు చేసిందేమి లేదని ఆరోపించారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విభజన హామీలను కేంద్రం ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. మోదీ పాలనలో నిత్యావసరాల రేట్లు భారీగా పెరిగాయన్నారు. ఎన్నికల కోసమే ముచ్చట్లు చెబుతారు కానీ ప్రజల కోసం ఏమీ చేయబోరని ఎద్దేవా చేశారు. నల్లధనం తీసుకొచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పిన మోదీ.. రూ.1,500 కూడా వేయలేదన్నారు.

గోవర్ధనగిరిధారిగా నృసింహస్వామి

- సింహ వాహనంపై స్వామివారి ఊరేగింపు
- యాదాద్రిలో ఘనంగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు



యాదగిరిగుట్ట, మార్చి 16: యాదాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు గోవర్ధన గిరిధారిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఓ చేతిలో పిల్లనగ్రోవి, మరో చేతితో గోవర్ధన పర్వతాన్ని ఎత్తిపట్టుకున్న దృశ్యాన్ని చూసి భక్తులు పరవశించిపోయారు. అలంకార సేవలో భాగంగా నృసింహస్వామిని గోవర్ధనగిరిధారిగా అలంకరించిన వేదపండితులు స్వామివారిని చతుర్వేద పారాయణాలు, భక్తుల గోవిందనామస్మరణల మధ్య ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. తర్వాత ప్రధానాలయ తూర్పు రాజగోపురం ముందు వేదికపై అధిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రివేళ లక్ష్మీ నృసింహస్వామి సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాలు 58

- వీటిలో ఏపీలో ఒకటి, తెలంగాణలో రెండు: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 16: దేశంలో ప్రత్యేక ఎస్ఆర్ఈ నిధుల పథకం పరిధిలోకి వచ్చే వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాల సంఖ్య 72 నుంచి 58కి తగ్గింది. ఎల్‌డబ్ల్యూఈ ప్రభావం ఎక్కువగా ఉన్న 10 రాష్ట్రాలతో కేంద్ర హోంశాఖ సమగ్ర సమీక్ష అనంతరం ఈ జిల్లాల సంఖ్యను సవరించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. కొత్త వర్గీకరణ ప్రకారం ఎల్‌డబ్ల్యూఈ ప్రభావిత జిల్లాల్లో (38)- ఛత్తీస్‌గఢ్‌లో 15, ఒడిసా 7, జార్ఖండ్ 5, మధ్యప్రదేశ్ 3, కేరళ, తెలంగాణ, మహారాష్ట్రల్లో రెండు చొప్పున, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్‌లలో ఒక్కొక్కటి చొప్పున జిల్లాలు ఉన్నాయి. ఇందులో తీవ్ర ప్రభావం ఉన్న జిల్లాలు 12 ఉన్నట్లు తాజా సమీక్షలో తేలింది.

కవిత అరెస్టు.. ఎన్నికల డ్రామా

(మొదటి పేజీ తరువాయి)



మీడియాతో మాట్లాడుతున్న సీఎం రేవంత్; చిత్రంలో మంత్రులు పొన్నం, సురేఖ; సలహాదారులు షబ్బీర్, నరేందర్‌రెడ్డి

మోదీ కూడా ఈ విషయమై ఒక్క మాటా మాట్లాడలేదని పేర్కొన్నారు. వీరి మౌనాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించారు. "కొన్నేళ్ల నుంచి కొనసాగుతోన్న ధారావాహిక.. నిన్నటి అరెస్టుతో పతాకస్థాయికి చేరింది. అవినీతిపై చర్యలు తీసుకున్నామన్న చాంపియన్‌షిప్‌తో ఓట్లు పొందాలని బీజేపీ.. అన్యాయంగా ఆడబిడ్డను అరెస్టు చేశారన్న సానుభూతితో ఓట్లు సంపాదించాలని బీఆర్ఎస్ చూస్తున్నాయి. రాజకీయంగా కాంగ్రెస్‌ను దొంగ దెబ్బ తీయాలని ఆ రెండు పార్టీలు కుట్రకు పాల్పడుతున్నాయి. ఇన్ని రోజులుగా మద్యం కుంభకోణం కేసులో ఎంతోమందిని అరెస్టు చేసి... కవితను అరెస్ట్ చేయకపోవడం, సరిగ్గా ఎన్నికల షెడ్యూల్‌కు ఒక రోజు ముందు అరెస్టు చేయడం దేనికి సంకేతమో తెలియట్లేదా? 2022లో మొదలైన డ్రామా 2024 మార్చి ఎన్నికల నోటిఫికేషన్‌కు ఒక రోజు ముందు వరకు తీసుకెళ్లడాన్ని తెలంగాణ ప్రజలు గమనించడం లేదని అనుకుంటున్నారా?" అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రతి సారీ ఈడీ ముందు వచ్చి.. ఆ తర్వాత మోదీ వస్తారన్న అపవాదు ఉండేదని, కానీ నిన్న ఈడీ, మోదీ కలిసే వచ్చారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన నేపథ్యంలో పలువురు మంత్రులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 12 సీట్లు గెలుస్తుందని అన్ని సర్వేలు చెబుతున్నాయని, ఇప్పటికైనా మోదీ, కేసీఆర్ తమ డ్రామాలను కట్టిపెట్టాలని సూచించారు.



మోదీవి చౌకబారు విమర్శలు

రాష్ట్ర ప్రభుత్వంపై చౌకబారు విమర్శలు చేయడం ప్రధాని మోదీ స్థాయికి తగదని సీఎం రేవంత్ హితవు పలికారు. తెలంగాణను అవమానించిన మోదీకి ఆ పదం పలికే అర్హతే లేదని అన్నారు. విభజన హామీలు ఎందుకు నెరవేర్చలేదో, మెట్రో విస్తరణకు ఎందుకు అనుమతి ఇవ్వలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పుకొని ఓట్లు అడగాలని సూచించారు. కేసీఆర్ హయాంలో జరిగిన అవినీతిపై ఎందుకు విచారణ చేపట్టలేదో.. బీజేపీ నాయకులు సమాధానం చెప్పగలరా? అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి రాగానే కాళేశ్వరంపై న్యాయ విచారణ చేయిస్తున్నామని, వారు ఇచ్చే నివేదికల ఆధారంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈడీ, సీబీఐలు.. మోదీకి ఫ్రంటల్ ఆర్గనైజేషన్స్ అని విమర్శించారు. దళితుడు పార్టీ అధ్యక్షుడైతే కొన్ని రోజులు కూడా బీజేపీ తట్టుకోలేకపోయిందన్నారు. బంగారు లక్ష్మణ్ కుటుంబాన్ని బీజేపీ రోడ్డుపై పడేసిందని, ఆయన కుమార్తె తన దగ్గరకు వచ్చి అనేక విషయాలు చెప్పుకొందని తెలిపారు. తమ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడబోదని, అక్రమాలకు పాల్పడిన వారిని మాత్రం వదలబోదని హెచ్చరించారు.

కేసీఆర్‌కు అహంకారం తగ్గలేదు

రాష్ట్రంలో సర్కారును పడగొట్టాలని ఆలోచన చేస్తే.. వాళ్ల నిద్ర లేచేలోగా పక్కన ఎవరూ ఉండరని, వారికి బట్టలు కూడా మిగలవని రేవంత్ హెచ్చరించారు. వాళ్లు పడగొట్టాలని అనుకుంటే.. తాను నిలబెట్టే ప్రయత్నం చేస్తానని, ఈ విషయంలో దేనికైనా సిద్ధమేనని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వాన్ని పడగొట్టే ఆలోచన ఉంటే.. తేదీ, సమయం నిర్ణయించుకోవాలని సవాల్ విసిరారు. "మా ప్రభుత్వం పడిపోతుందని బీఆర్ఎస్, బీజేపీ చెబుతున్నాయి. ఆ రెండు పార్టీలు కలిసినా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సంఖ్యాబలం లేదు. వారిద్దరూ కలసి కుట్ర చేస్తే తప్ప వారనుకున్న కార్యాచరణ అమలు కాదు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత వారి ప్రభుత్వం వస్తుందని చెబుతున్నట్లు నన్ను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చెప్పారు. కానీ, మీ ప్రభుత్వానికి ఇబ్బంది వస్తే మద్దతిచ్చేందుకు సిద్ధమని వారు చెబుతున్నారు. పదేళ్లుగా ఆ పార్టీలో ఉండి కేసీఆర్‌ను టీవీల్లో చూడడమే తప్ప నేరుగా కలిసి తమ బాధను చెప్పుకొనే అవకాశమే దక్కలేదని వారు బాధపడ్డారు" అని సీఎం వెల్లడించారు. తాము తలుచుకుంటే బీఆర్ఎస్‌లో ఆ నలుగురు తప్ప.. ఐదో మనిషే ఉండరని హెచ్చరించారు. కానీ, తాము పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం లేదని, పాలనపైనే దృష్టి పెట్టామని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికలు తమ పాలనకు రిఫరెండంగా భావిస్తామన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభం ఉన్న కేసీఆర్.. నల్లగొండ సభలో తనపై చేసిన వ్యాఖ్యలను ఎలా సమర్థించుకుంటారని రేవంత్ ప్రశ్నించారు. కేసీఆర్‌కు ఇంకా అహంకారం తగ్గలేదని ధ్వజమెత్తారు. ప్రస్తుతం కారు షెడ్డుకుపోయిందని, డ్రైవర్‌కు యాక్సిడెంట్ అయిందని ఎద్దేవా చేశారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం

రాష్ట్రంలో వంద రోజుల పాలన.. సంతృప్తి ఇచ్చిందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఎన్నికల ముందు తాము ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని మరోసారి స్పష్టం చేశారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తున్నామని తెలిపారు. రూ.500కే సిలిండర్ పథకంలో భాగంగా 8 లక్షల మందికి నగదు బదిలీ చేశామని, గృహజ్యోతి కింద 37 లక్షల కుటుంబాలకు జీరో కరెంటు బిల్లులు ఇచ్చామని గుర్తు చేశారు. 3 నెలల్లోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన మొదటి రోజు నుంచే ఆరు గ్యారంటీల అమలుపై దృష్టి పెట్టామని వెల్లడించారు. పదేళ్ల పాలనలో వందేళ్లకు సరిపడా విధ్వంసాన్ని కేసీఆర్ సృష్టించారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో పడిన చిక్కుముడులను ఒక్కొక్కటిగా విప్పుతున్నామని చెప్పుకొచ్చారు. నిషేధిత ప్రాంతంగా ఉన్న ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చామన్నారు. ప్రజలు సచివాలయానికి వచ్చి సమస్యలు చెప్పుకొనే స్వేచ్ఛ కల్పించామన్నారు. బీఆర్ఎస్ నిషేధించిన ధర్నా చౌక్‌లో అదే పార్టీ ధర్నా చేసుకొనే అవకాశం కల్పించామన్నారు. ప్రజలకు మరింత మంచి చేసేందుకు ప్రజా సంఘాలు, మత పెద్దలతో సమావేశమై సలహాలు తీసుకున్నామని వివరించారు.



విభజన హామీల సాధనకు కృషి

పొరుగు రాష్ట్రాలతో గిల్లికజ్జాలు పెట్టుకోవడం లేదని, ఏపీతో ఉన్న విభజన హామీలు సాధించుకోవడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. అవసరమైతే రాష్ట్ర ప్రజల కోసం సీఎంగా ఒక మెట్టు దిగడానికైనా తాను సిద్ధమేనన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలను నెలకొల్పేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్ అభివృద్ధిపై స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కార్యాచరణ చేపట్టామని తెలిపారు. మంత్రులంతా కష్టపడి పని జేస్తున్నారని, ఎమ్మెల్యేలు బాధ్యతతో వ్యవహరిస్తున్నారని అభినందించారు.



గ్రూప్-1 పోస్టులకు 4.03 లక్షల దరఖాస్తులు

- ఒక్కో పోస్టుకు 715 మంది!
- ముగిసిన దరఖాస్తుల ప్రక్రియ

హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 563 గ్రూప్-1 పోస్టులకు 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్టు శనివారం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటించింది. ఈ లెక్కన ఒక్కో పోస్టుకు సగటున 715 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు శనివారంతో గడువు ముగిసింది. ఇంతకు ముందు ఈ నెల 14వ తేదీ వరకు గ్రూప్-1 పోస్టులకు దరఖాస్తు చేసుకునే అవకాశమిచ్చారు. తర్వాత ఈ గడువును ఈ నెల 16వ తేదీ సాయంత్ర 5 గంటల వరకు పొడిగించారు. దీంతో దరఖాస్తులు పెరిగే అవకాశం ఏర్పడింది. గతంలో 503 పోస్టులతో గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల కాగా... ఆ తర్వాత మరో 60 పోస్టులను పెంచి మొత్తం 563 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. గతంలో గ్రూప్-1 పోస్టులకు 3.8 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. ఈసారి ఆ సంఖ్య 4.03 లక్షలకు పెరిగింది. దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఈ నెల 23న ఉదయం 10 గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 5 గంటల దాకా www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో ఎడిట్ ఆప్షన్‌ను వినియోగించుకోవచ్చని కమిషన్ తెలిపింది. కాగా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను జూన్ 9న, మెయిన్ పరీక్షలను అక్టోబరు 21 నుంచి నిర్వహించాలని కమిషన్ ఇంతకు ముందే నిర్ణయించింది.

ఏఈఈ అభ్యర్థులకు వెబ్ ఆప్షన్లు

వివిధ శాఖల్లోని ఇంజనీరింగ్ విభాగాల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) పోస్టుల కోసం ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థులు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో ఈ నెల 23వ తేదీ దాకా వెబ్‌ఆప్షన్లు సమర్పించాలని కమిషన్ కోరింది.

హలో జగ్గా..! అంతా బాగేనా!?

ముంబై వీధిలో జగ్గారెడ్డికి రాహుల్ పలకరింత



హైదరాబాద్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): "హలో జగ్గా!? సబ్‌కుచ్ ఠీక్ హై!?" - ముంబై వీధుల్లో.. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ నుంచి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి అందుకున్న ఆత్మీయ పలకరింపు ఇది. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా రాహుల్‌గాంధీ ప్రస్తుతం ముంబైలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ యాత్రలో పాలుపంచుకునేందుకు శనివారం జగ్గారెడ్డి ముంబై వెళ్లారు. ముంబైలోని ఓ వీధి నుంచి వెళుతున్న రాహుల్ కాన్వాయికి స్వాగతం పలికేందుకు స్థానిక నేతలు నిలుచుని ఉన్నారు. అయితే వారిలో ఒకడిగా ఉన్న జగ్గారెడ్డిని గుర్తుపట్టిన రాహుల్‌గాంధీ.. దగ్గరకు పిలుచుకుని "హలో జగ్గా.. అంతా బాగేనా!?" అని పలకరిస్తూ కరచాలనం చేశారు. పలకరింపునకు పులకరించిన జగ్గారెడ్డి.. అంతా బాగేనంటూ సమాధానం ఇచ్చారు. ఆ తర్వాత జగ్గారెడ్డి.. రాహుల్ కాన్వాయ్ వెంట కొంత దూరం పరుగులు తీశారు.



పసునూరి దయాకర్‌కు కండువా కప్పుతున్న ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి కొండా సురేఖ

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎంపీ పసునూరి

- కండువా కప్పి ఆహ్వానించిన కొండా సురేఖ

హైదరాబాద్/హనుమకొండ సిటీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ పసునూరి దయాకర్ మంత్రి కొండా సురేఖ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు జిల్లాకు చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం గాంధీభవన్‌లో కొండా సురేఖ, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వరంగల్ టికెట్‌ను కేసీఆర్ తనకు కేటాయించక పోవడంతో అసంతృప్తితో ఉన్న పసునూరి.. శుక్రవారమే సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సంగతి తెలిసిందే. పసునూరి చేరిక తర్వాత కొండా సురేఖ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నుంచి చాలా మంది కాంగ్రెస్‌లోకి రావడానికి సిద్ధపడ్డా.. కేసీఆర్ వారిని బెదిరించి రానివ్వకుండా ఆపారన్నారు. బీఆర్ఎస్ హయాంలో సమస్య వస్తే ప్రజలకు ఎక్కడికి వెళ్లాలో తెలిసేది కాదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్యులకు అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. పసునూరి మాట్లాడుతూ.. గత 23 ఏళ్లుగా ఉద్యమ కార్యకర్తగా ఉన్న తాను రెండు సార్లు ఎంపీగా గెలిచానన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్న తీరును చూసి కాంగ్రెస్ పార్టీకి ఆకర్షితుడయ్యానన్నారు. ఉద్యమంతో ఏ మాత్రం సంబంధం లేని కడియం శ్రీహరి కూతురుకు ఎంపీ టికెట్‌ను కేసీఆర్ ఇచ్చారని ఆవేదన చెందారు. ఇక నుంచి కాంగ్రెస్‌లో తాను స్వేచ్ఛ గలిగిన కార్యకర్తగా పని చేస్తానన్నారు. ఇటు వరంగల్ పశ్చిమ నియోజవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతితో పాటు ఆమె భర్త పుల్లా భాస్కర్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఎలిగంటి రాములు, గుంటి రజిత శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ మర్రి జనార్దన్ పటేల్ కూడా కాంగ్రెస్‌లో చేరారు. అంతకుముందు వారు సీఎంను కలిశారు.

కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యాలకు కారకులను గుర్తించండి

- జస్టిస్ చంద్రఘోష్ కమిటీని కోరిన సర్కారు
- జూన్ 30లోపు నివేదిక ఇవ్వాలని వినతి

హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాల్లో చోటుచేసుకున్న నిర్లక్ష్యం, అవకతవకలు, ప్లానింగ్, డిజైన్‌లలో లోపాలపై విచారణ జరిపి బ్యారేజీల వైఫల్యానికి కారకులను గుర్తించాలని జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలోని న్యాయ విచారణ కమిటీని ప్రభుత్వం కోరింది. ఈ మేరకు కమిటీని వేస్తూ ఈ నెల 14న గెజిట్ జారీ చేసింది. ఏడు అంశాలతో విచారణ విధివిధానాలు రూపొందించారు. ఈ అంశాల ఆధారంగా విచారణ జరిపి దోషులను గుర్తించి ప్రభుత్వానికి జూన్ 30వ తేదీలోపు నివేదిక అందించాలని కోరారు.

విచారణ విధివిధానాలు...

- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంతో పాటు ప్లానింగ్, డిజైనింగ్‌లో లోపాలు, అవకతవకలు, నిర్లక్ష్యంపై విచారణ చేపట్టాలి.
- కాంట్రాక్టర్లకు పని అప్పగింత, పనుల అమలు తీరు, అవకతవకలు, ఆర్థిక క్రమశిక్షణ పాటించకుండా కాంట్రాక్టర్లకు పనుల అప్పగింతకు కారకులను గుర్తించాలి.
- మూడు బ్యారేజీల్లో ఆపరేషన్ మెయింటెనెన్స్‌లో నిర్లక్ష్యంతో పాటు వాటికి బాధ్యులైన వారు, బ్యారేజీలు దెబ్బతినడానికి గల కారణాలను తేల్చాలి.
- క్వాలిటీ కంట్రోల్, పర్యవేక్షణ కోణంలో నిర్లక్ష్యం, కాంట్రాక్టర్లు/ఏజెన్సీలు, అధికారులు తప్పిదాలపై విచారించాలి.
- నిబంధనలకు విరుద్ధంగా పనులు పూర్తిచేయడానికి పొడిగింపులు, పనులు పూర్తయినట్లు కాంట్రాక్టర్లకు సర్టిఫికెట్లు ఇవ్వడం, గడువుకన్నా/పనులు/డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ పూర్తికాకుండానే బ్యాంకు గ్యారంటీలను విడుదల చేయడం, కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరించడం వంటి అంశాల్లో బాధ్యులైన వారిని గుర్తించాలి.
- కమిషన్ పైన పేర్కొన్న అన్ని అంశాల్లో లోపాలకు బాధ్యులను గుర్తించి, దానివల్ల ఖజానాపై పడిన ఆర్థిక భారం, ఆర్థిక నష్టాలు, తప్పులకు బాధ్యులైన అధికారులు, ఏజెన్సీల పాత్రను నిగ్గుతేల్చాలి.
- ఇతర అంశాలు ఏమైనా ప్రభుత్వం రిఫర్ చేస్తే వాటిపై విచారణ చేయాలి.

బీఎస్పీకి ఆర్ఎస్ ప్రవీణ్ గుడ్ బై

- బహుజన వాదాన్ని గుండెల్లో దాచుకుంటా
- బీజేపీ కుట్రలకు భయపడను: ప్రవీణ్ ట్వీట్
- కేసీఆర్‌తో భేటీ.. నేడో రేపో బీఆర్ఎస్‌లోకి



హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఆ పార్టీని వీడుతున్నట్లు ఎక్స్ వేదికగా శనివారం ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీఆర్ఎస్-బీఎస్పీ మధ్య కుదిరిన పొత్తు విఫలం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నానని ఆయన వెల్లడించారు. రెండు పార్టీల మధ్య పొత్తును బీజేపీ భగ్నం చేసిందని తెలిపారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టు అందులో భాగమే అని పేర్కొన్నారు. బీజేపీ కుట్రలకు భయపడి తాను నమ్ముకున్న విలువలకు తిలోదకాలు ఇవ్వలేనని, తన రాజకీయ ప్రస్థానాన్ని ఆపలేనని ప్రకటించారు. పొత్తు ఒప్పందంలో భాగంగా ఎన్ని ఒడిదుడుకులొచ్చినా ముందుకు సాగాల్సిందేనని, కష్ట సుఖాలు పంచుకోవాల్సిందేనని.. ఇదే తాను నమ్మిన నిజమైన ధర్మం అని స్పష్టం చేశారు. చివరి వరకు బహుజన వాదాన్ని గుండెల్లో పదిలంగా దాచుకుంటానని స్వేరోలకు హామీ ఇచ్చారు. తనను నమ్ముకున్న వారికి అండగా నిలుస్తానని ట్వీట్ చేశారు. పార్టీకి రాజీనామా చేసిన అనంతరం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో భేటీ అయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఎస్పీ-బీఆర్ఎస్ మధ్య పొత్తు విఫలం కావడంతో కీలక నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తన భవిష్యత్తు కార్యాచరణను త్వరలోనే వెల్లడిస్తానని ప్రకటించారు. ప్రవీణ్ కుమార్ ఒకటి రెండు రోజుల్లో బీఆర్ఎస్‌లో చేరతారని సమాచారం.

ఎంపీ స్థానాల్లో ఒంటరిగా పోటీ: మంద ప్రభాకర్

లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాల్లో బీఎస్పీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ కేంద్ర సమన్వయకర్త మంద ప్రభాకర్ తెలిపారు. బీఆర్ఎస్-బీఎస్పీ మధ్య పొత్తు కుదిరినా.. పార్టీ ఆశించిన స్థానాలను బీఆర్ఎస్ ఇవ్వకపోవడంతో పొత్తును కొనసాగించడానికి బీఎస్పీ అధినేత్రి మాయావతి అంగీకరించలేదని తెలిపారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పార్టీని వీడుతున్నట్లు ప్రకటించడం బాధాకరమని పేర్కొన్నారు. ఆయన నిర్ణయం పార్టీ శ్రేణులను తీవ్రంగా బాధించిందని తెలిపారు.

నేను పార్టీ మారడం లేదు!: దానం నాగేందర్

బంజారాహిల్స్ మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తాను పార్టీ మారడం లేదని ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు. తాను కాంగ్రెస్‌లో చేరి, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయబోతున్నట్లు వస్తున్న వార్తలను శనివారం ఆయన ఖండించారు. తన ఖైరతాబాద్ నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసినట్లు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నానని వెల్లడించారు.




నాగర్‌కర్నూల్‌లో జరిగిన బీజేపీ విజయ సంకల్ప సభలో ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, హాజరైన నాయకులు, కార్యకర్తలు

అవినీతిపరులను వదలం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. అందుకు తెలంగాణ ప్రజల సహకారం కావాలన్నారు. శనివారం నాగర్ కర్నూల్‌లో బీజేపీ నిర్వహించిన విజయ సంకల్ప సభలో మోదీ పాల్గొని మాట్లాడారు. "గత పదేళ్లలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్యలో తెలంగాణ నలిగిపోయింది. రెండు పార్టీలు రాష్ట్ర ప్రజలు కన్న కలలను కూల్చాయి. గత పదేళ్లు రాష్ట్రాన్ని బీఆర్ఎస్ లూటీ చేస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ సిద్ధమవుతోంది. రాష్ట్రాన్ని నాశనం చేసేందుకు ఐదేళ్లు చాలు. మేము కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తే ఇక్కడ కాంగ్రెస్‌ను ఇష్టారాజ్యంగా వ్యవహరించనివ్వం" అని ప్రధాని మోదీ అన్నారు. దేశానికి తెలంగాణను 'గేట్‌వే ఆఫ్ సౌత్'గా చెబుతారని పేర్కొన్నారు. "గత పదేళ్లలో రాష్ట్రానికి సహకరించాం. మీకు సేవ చేయాలంటే ఇక్కడ బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి. మీ ఆశయాలను నెరవేర్చేందుకు నేను రాత్రింబవళ్లు కష్టపడతాను" అని మోదీ చెప్పారు.

లూటీ తప్ప కాంగ్రెస్ ఏమీ చేయదు..

ఏడు దశాబ్దాల్లో కాంగ్రెస్ లూటీ తప్ప దేశానికి ఏమీ చేయలేదని, తెలంగాణను కూడా అభివృద్ధి చేయదని మోదీ అన్నారు. గతంలో గరీబీ హటావో అని కాంగ్రెస్ నినాదం ఇస్తే.. పేదరికం తగ్గిందా? అని ప్రశ్నించారు. పదేళ్ల క్రితం బీజేపీ ప్రభుత్వం రావడంతో పేదలకు బ్యాంకు ఖాతాలు వచ్చాయని, మరుగుదొడ్లు, తాగునీరు, ఇళ్లు, వ్యాక్సినేషన్ వచ్చిందని తెలిపారు. తొలిసారి అనేక గ్రామాలు విద్యుత్తును చూశాయని, 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటికి వచ్చారని, ఇలాంటి మార్పు తెలంగాణలోనూ రావాలని అన్నారు. "మీ ఓట్లతో కుటుంబం కోసం బ్యాంకు బ్యాలెన్స్ పెంచుకోను. 140 కోట్ల మంది ప్రజలే నా కుటుంబం. ఒక్కరోజు కూడా నేను నా కోసం ఉపయోగించుకోలేదు. దేశ ప్రజల కోసమే కష్టపడుతున్నాను. మోదీ చెప్పాడంటే చేసి చూపిస్తాడు. ఆర్టికల్ 370ని రద్దు చేస్తామని, అయోధ్యలో రామమందిరం నిర్మిస్తామని, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పాం. చేసి చూపించాం. ఇది మోదీ గ్యారంటీ" అని ప్రధాని మోదీ అన్నారు. తెలంగాణలో పేదల కోసం కోటి మందికి బ్యాంకు ఖాతాలు తెరిచామని, ఏడాదికి రూ.20 నామమాత్ర ప్రీమియంతో కోటి మందికి బీమా కల్పించామని చెప్పారు. 67 లక్షల మంది చిరుద్యోగులకు ముద్రా రుణాలు అందించామని, 80 లక్షల మందికి ఆయుష్మాన్ భారత్ పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో మాదిగ కులస్తుల అభివృద్ధి కోసం ప్రణాళిక రచిస్తున్నామన్నారు.

దళిత ఉప ముఖ్యమంత్రిని అవమానించారు..

గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలతో ఎక్కువ లబ్ధి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు, మహిళలకు చేకూరిందని ప్రధాని తెలిపారు. ఈ పథకాలను ఎక్కువగా కాంగ్రెస్, బీఆర్ఎస్ లాంటి అవినీతి, కుటుంబ పార్టీలు వ్యతిరేకించాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను రెండు పార్టీలూ అవమానించాయని ఆరోపించారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను ఓడించేందుకు, ఎస్టీ సామాజికవర్గానికి చెందిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును ఓడించేందుకు ప్రయత్నించారని మోదీ ధ్వజమెత్తారు. దేశానికి కొత్త రాజ్యాంగం అవసరముందని కేసీఆర్ చెప్పడం అంబేడ్కర్‌ను అవమానించడం కాదా? అని ప్రశ్నించారు. తెలంగాణకు దళితుడిని తొలి ముఖ్యమంత్రిని చేస్తామన్న కేసీఆర్ హామీని నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. దళితబంధు పథకంతో దళితులను మోసం చేశారని, వారి కళ్లలో దుమ్ము కొట్టేందుకే ఈ పథకం తెచ్చారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కూడా దళితుల పట్ల వివక్ష అలాగే కొనసాగుతోందని విమర్శించారు. ఇటీవలే రాష్ట్రంలోని ఓ ఆలయంలో ఉన్నత వర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలను పైన కూర్చోబెట్టి.. దళితుడైన ఉప ముఖ్యమంత్రిని కింద కూర్చోబెట్టి అవమానించారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌పై ప్రజల్లో తీవ్రమైన ఆగ్రహం ఉందని, అందుకే గత ఎన్నికల్లో వారికి ఈ దుస్థితి పట్టిందని అన్నారు. ప్రజల అభిమానం చూస్తుంటే రాష్ట్రంలో బీజేపీకి రెండంకెల సంఖ్యలో ఎంపీ స్థానాలు, కేంద్రంలో మూడోసారి మోదీ సర్కార్ రావడం ఖాయం అనిపిస్తోందన్నారు. బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబం తెలంగాణను సర్వనాశనం చేసిందే కాకుండా బీరు, బ్రాండీ వ్యాపారంతో పక్క రాష్ట్రాల్లో కూడా అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. గ్యారెంటీల పేరుతో గారడీ చేసిన కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను వంచించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహబూబ్‌నగర్ అభ్యర్థి డీకే అరుణ, ఎంపీ పోతుగంటి రాములు, నాగర్‌కర్నూల్, నల్లగొండ బీజేపీ అభ్యర్థులు భరత్‌ప్రసాద్, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ సభ ఊహించిన దాని కంటే ఎక్కువగా విజయవంతమైంది. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నల్లగొండ లోక్‌సభ స్థానాలకు సంబంధించి ఈ సభ నిర్వహించారు. హాజరైన వారిలో 20 నుంచి 30 ఏళ్ల వయసున్న యువకులు అధికంగా ఉండటం, మోదీ ప్రసంగం పట్ల వారు స్పందించిన తీరుతో ప్రధాని సంతోషం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్‌కు అరూరి రమేశ్ రాజీనామా

నేడు బీజేపీలో చేరనున్న మాజీ ఎమ్మెల్యే



రాంనగర్, మార్చి 16: బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పార్టీకి రాజీనామా చేశారు. శనివారం రాజీనామా లేఖను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పంపారు. పార్టీలో అవకాశాలు కల్పించిన కేసీఆర్‌కు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు, మాజీ మంత్రి హరీశ్‌రావు అరూరి ధన్యవాదాలు తెలిపారు. తనకు సహకరించిన ప్రతీ ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అరూరి రమేశ్ 2012లో బీఆర్ఎస్‌లో చేరి 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. గత నవంబరులో జరిగిన శాసనసభ ఎన్నికల్లో మూడోసారి బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన ఆయన కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో ఓటమి చెందారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేయాలని సిద్ధమైనప్పటికీ పార్టీ నుంచి ప్రతికూల సంకేతాలు రావడంతో మనస్తాపం చెందారు. ఈ క్రమంలో బీఆర్ఎస్‌ను వీడాలని నిర్ణయించుకున్న ఆయన పార్టీకి రాజీనామా చేశారు. ఆదివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో రమేశ్ బీజేపీలో చేరనున్నారు. ఆయనను వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించే అవకాశం ఉంది.



దేవాదాయ కమిషనర్‌గా హనుమంతరావు

» అనిల్‌కుమార్ స్థానంలో అదనపు బాధ్యతలు

హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖ కమిషనర్‌గా సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతరావు శనివారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. విశ్రాంత ఐఏఎస్ వి. అనిల్ కుమార్ బీఆర్ఎస్ ప్రభుత్వంలో దేవాదాయశాఖ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత విశ్రాంత అధికారులు పదవులకు రాజీనామా చేసిన క్రమంలోనే అనిల్ కుమార్ కూడా రాజీనామా సమర్పించారు. ప్రభుత్వం ఆయన రాజీనామాను ఆమోదించింది. కాగా, దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న 2656 మంది అర్చక, ఉద్యోగుల వేతనాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు రూ.46.81 కోట్లను మంజూరు చేస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏఎస్ఆర్టీయూ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా వీసీ సజ్జనార్

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్స్ (ఏఎస్ఆర్టీయూ) స్టాండింగ్ కమిటీ నూతన చైర్మన్‌గా టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ ఎన్నికయ్యారు. న్యూఢిల్లీలోని ఇండియా హబిటెంట్ సెంటర్‌లో జరిగిన ఏఎస్ఆర్టీయూ 54వ సర్వసభ్య సమావేశంలో కమిటీ నూతన చైర్మన్‌గా సజ్జనార్‌ను దేశంలోని ఆర్టీసీ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ పదవిలో సజ్జనార్ ఏడాదిపాటు ఉంటారు. ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా సజ్జనార్ పేర్కొన్నారు. కాగా స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా టీఎస్ఆర్టీసీ చీఫ్ మెకానిక్ ఇంజనీర్ (సీఎంఈ) రఘునాథరావు ఎన్నికయ్యారు.

విద్యుత్తు సంస్థల్లో నియామకాలకూ వయోపరిమితి మరో రెండేళ్లకు పెంపు

విద్యుత్తు సంస్థల్లో నియామకాలకు సంబంధించి వయో పరిమితిని సడలిస్తూ తెలంగాణ ట్రాన్స్‌కో నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం కొలువులకు 44 ఏళ్లుగా వయోపరిమితి ఉండగా.. దాన్ని సడలిస్తూ 46 ఏళ్లకు చేర్చింది. ఈ మేరకు ట్రాన్స్‌కో సీఎండీ ఎస్ఏఎం రిజ్వీ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ ఎం) విభాగాల్లో మినహా అన్ని విభాగాల్లో రిక్రూట్‌మెంట్‌కు ఈ సడలింపు వర్తించనుంది. ఈ మినహాయింపు 2024 ఫిబ్రవరి 8 నుంచి 2026 ఫిబ్రవరి 7వ తేదీ దాకా అమలులో ఉండనుంది.

జీరో బిల్లు జారీకి ముందే సబ్సిడీ ఇవ్వాలి

» తెలంగాణ ఈఆర్‌సీ ఉత్తర్వులు

గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లులు జారీ చేయడానికి ముందే ప్రభుత్వం డిస్కమ్‌లకు అవసరమైన సబ్సిడీని అందించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(టీఎస్ఈఆర్‌సీ) పేర్కొంది. ఈ మేరకు శనివారం ఈఆర్‌సీ చైర్మన్ టి.శ్రీరంగారావు, సభ్యుడు ఎండీ మనోహర్‌రాజు, బండారు కృష్ణయ్యలు ఉత్తర్వులు ఇచ్చారు. రాష్ట్రంలో గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లదాకా విద్యుత్తును వాడే వినియోగదారులకు జీరో బిల్లులు జారీ చేస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వం సబ్సిడీ ముందస్తుగా చెల్లించకుంటే జీరో బిల్లులు జారీ చేయడానికి వీల్లేదని ఈఆర్‌సీ స్పష్టం చేసింది.

యాదాద్రి ఆలయ ఈవోగా భాస్కర్‌రావు

» ప్రభుత్వం ఉత్తర్వులు.. వెంటనే బాధ్యతల స్వీకరణ

యాదాద్రి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా ఈ నెల 11న ఆలయంలో తలెత్తిన ప్రొటోకాల్ వివాదం ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఈవో) పదవికి ఎసరు తెచ్చింది. అప్పటి ఈవో రామకృష్ణారావును ఆ పదవి నుంచి తప్పించారు. ఆయన స్థానంలో భాస్కర్‌రావును ప్రభుత్వం ఈవోగా నియమించింది. భాస్కర్‌రావును ఈవోగా నియమిస్తూ ఈ నెల 14వ తేదీనే ప్రభుత్వం రెవెన్యూ శాఖ నుంచి దేవాదాయశాఖకు డిప్యుటేషన్ ఉత్తర్వులు జారీచేసింది. తాజాగా దేవాదాయ శాఖ భాస్కర్‌రావు ను ఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. శనివారం సాయంత్రం ఆయన యాదగిరిగుట్టలో బాధ్యతలను స్వీకరించారు.

చెరువుల భూవివాదాలను వేగంగా పరిష్కరించాలి

వివాదాల్లేకుండా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల నిర్ధారణ.. హైకోర్టుకు ప్రత్యేక కమిటీ నివేదిక

హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చెరువులకు సంబంధించిన భూవివాదాలను వేగంగా పరిష్కరించేందుకు హైకోర్టులో గ్రీన్ ట్రిబ్యునల్ లేదా ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేయాలని హైకోర్టు నియమించిన ప్రత్యేక కమిటీ తన నివేదికలో స్పష్టం చేసింది. చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్), బఫర్‌జోన్‌లను శాస్త్రీయంగా నిర్ధారిస్తూ భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు లేకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొంది. డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్, రెవెన్యూశాఖ జీపీ శ్రీకాంత్‌రెడ్డితో కూడిన ఈ కమిటీ.. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని 13 చెరువులను పరిశీలించి.. అక్కడి సమస్యలను గుర్తించి, తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ హైకోర్టుకు నివేదిక సమర్పించింది. చెరువుల ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంటూ 2007లో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది. హైకోర్టు ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు ఆయా చెరువుల ఆక్రమణల తొలగింపు, అభివృద్ధికి తీసుకున్న చర్యలపై సంయుక్త నివేదిక సమర్పించారు. జీహెచ్ఎంసీ, ఆయా జిల్లాల కలెక్టర్లు తీసుకున్న చర్యలు.. సౌకర్యాల ఏర్పాటుపై తనిఖీ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల న్యాయవాదులతో హైకోర్టు ఇటీవల కమిటీని నియమించిన విషయం తెలిసిందే.! ఈ కమిటీ ఒక రోజు అధికారులతో సమావేశాలు నిర్వహించి.. మూడు రోజులపాటు 13 చెరువులను పరిశీలించింది. ఇందులో దుర్గంచెరువు(మాదాపూర్), సున్నంచెరువు(అల్లాపూర్), మేడికుంట(నానక్‌రాంగూడ), గోసాయికుంట(గౌలిదొడ్డి), పెద్దచెరువు(నల్లగండ్ల), పెద్దచెరువు(గంగారాం), మద్దెలకుంట(బైరామల్‌గూడ), నల్లచెరువు(ఉప్పల్), పెద్దచెరువు(పీర్జాదీగూడ), అంబీర్‌చెరువు(కూకట్‌పల్లి), చిన్నదామరచెరువు(దుండిగల్), చిన్నరాయుని చెరువు(అల్వాల్), బోయిన్ చెరువు(హస్మత్‌పేట్) ఉన్నాయి. ఈ కమిటీ నివేదిక ఆధారంగా హైకోర్టు తదుపరి విచారణ చేపట్టే అవకాశముంది.

కమిటీ సిఫార్సుల్లో ముఖ్యాంశాలు..

- పెండింగ్ భూవివాదాలను వేగంగా పరిష్కరించడానికి గ్రీన్ ట్రిబ్యునల్ లేదా ప్రత్యేక బెంచ్ ఏర్పాటుచేయాలి
- శాస్త్రీయ పద్ధతిలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను నిర్ధారిస్తూ ప్రాథమిక, తుది నోటిఫికేషన్‌లు జారీచేయాలి
- చెరువుల్లో డంపింగ్,ల్యాండ్ ఫిల్లింగ్ లేకుండా చూడాలి
- చెరువుల్లో కలుషితాలను వదిలేవారికి, ఆక్రమణలకు పాల్పడేవారికి భారీ జరిమానాలు విధించాలి. ఈ చర్యలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక విభాగం ఉండాలి



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

కేసీఆర్... కర్మఫలం!

పదేళ్ల క్రితం తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు 'తెలంగాణ బాపు'గా కొంతకాలం పాటు పిలిపించుకున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఈ విధంగా అరెస్టు చేసి ఢిల్లీకి తీసుకుపోతారని ఆనాడు ఎవరైనా ఊహించారా? కవిత అరెస్టు న్యాయమా? అన్యాయమా? అన్న విషయం పక్కన పెడితే ఈ దుస్థితికి ఆమె స్వయంకృతాపరాధమే కారణం. పదేళ్లపాటు తండ్రి కేసీఆర్ ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించిన తెలంగాణ రాష్ట్రంలో సంపాదించుకోవడానికి అవకాశాలే లేనట్టుగా, సంపాదించుకున్నది చాలదు అన్నట్టుగా ఆమె ఏకంగా దేశ రాజధాని ఢిల్లీలో లిక్కర్ వ్యాపారంలోకి కూడా చొరబడ్డారు. ఫలితమే ఈ అరెస్ట్. కవిత అరెస్టు అన్యాయం, అక్రమం, అప్రజాస్వామికం అని కేటీఆర్, హరీశ్‌రావు వంటి వారు గగ్గోలు పెట్టడం గురివింద సామెతను గుర్తుకుతెస్తున్నది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఓటుకు నోటు కేసులో అరెస్టు చేసి జైలుకు పంపలేదా? ఎమ్మెల్సీ రాజ్యసభ ఎన్నికల సందర్భంగా గతంలో అనేక సందర్భాలలో శాసనసభ్యులకు, ఇతరులకు డబ్బు ముట్టజెప్పడం జరిగింది. అంతేకాదు తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన పలువురు శాసనసభ్యులకు భారీ మొత్తాల్లో డబ్బు ఆశ చూపి బీఆర్ఎస్‌లో చేర్చుకోవడం నిజం కాదా? అయినా రేవంత్ రెడ్డి మాత్రమే కనీవినీ ఎరుగని నేరానికి పాల్పడినట్టుగా ప్రచారం చేసి కొన్ని నెలల పాటు జైలులో నిర్బంధించారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కూడా ఈ కేసుతో ముడి పెట్టారు. ఈడీ అధికారులు ఉద్దేశపూర్వకంగానే కవితకు న్యాయస్థానాలలో ఉపశమనం లభించకుండా శుక్రవారం నాడు అరెస్టు చేశారని కేటీఆర్ ఆరోపిస్తున్నారు గానీ తాము అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారో మరచిపోతే ఎలా? ఒక్కగానొక్క కూతురు పెళ్లి ఘనంగా నిర్వహించుకొనే అవకాశం రేవంత్ రెడ్డికి ఇవ్వలేదే? ఎనిమిది గంటలకు మించి పెరోల్‌పై బయట ఉండకూడదని కోర్టులో బలంగా వాదించలేదా? అందుకే కర్మ మనల్ని వదలదని అంటారు. ఒకప్పుడు తెలంగాణ నా అడ్డా అని గర్జించిన కేసీఆర్ కుటుంబాన్ని ఇప్పుడు తెలంగాణలోనే కష్టాలు వెంటాడుతున్నాయి. అదేమిటోగానీ ప్రత్యేక రాష్ట్రాల కోసం ఉద్యమించి ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన పలువురు నాయకులు కేసుల్లో ఇరుక్కున్నారు. జార్ఖండ్ రాష్ట్రం కోసం పోరాడిన శిబూ సోరెన్ జైలుకు కూడా వెళ్లారు. నిన్నటి వరకూ ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన కుమారుడు హేమంత్ సోరెన్ కూడా ప్రస్తుతం జైల్లో ఉన్నారు. జేఎంఎం ముడుపుల కేసులో నాటి ప్రధాని పీవీ నరసింహారావు కూడా కోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చింది. ఇప్పుడు భారత రాష్ట్ర సమితి వంతు వచ్చింది. కొట్లాడి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రాలను సొంత జాగీర్లు చేసుకొని పాడి ఆవులుగా మార్చుకొనే ప్రయత్నం చేయడమే ఈ అనర్థాలకు కారణం కాదా? ఆశకు అంతు ఉండాలి. డబ్బు సంపాదనకు అలవాటు పడిన రాజకీయ నాయకులు, అధికారులను.. సమాజం కూడా ఒక స్థాయి వరకే మన్నిస్తుంది. అత్యాశకు పోయినప్పుడే ఇలాంటి తిప్పలు వస్తాయి. ఇప్పుడు కవిత విషయంలో కూడా జరుగుతున్నది ఇదే. 2014 నుంచి నిన్న మొన్నటి వరకు అధికారంలో కొనసాగిన కల్వకుంట్ల కుటుంబం అడుగడుగునా అధికార దర్పం ప్రదర్శించింది. డబ్బు సంపాదనకు అలవాటు పడింది. తొలి ఐదేళ్లు పెద్దగా ఆరోపణలు లేకుండా పనిచేసిన కేసీఆర్ కూడా రెండవ పర్యాయం రెవెన్యూ తదితర విషయాలలో అడ్డగోలుగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలోనే కవిత రాష్ట్ర సరిహద్దులు దాటి ఢిల్లీ వరకు వెళ్లారు. లిక్కర్ కుంభకోణంలో ఇరుక్కున్నారు. ఈ కేసులో అరెస్టు కావడమే అవమానం అనుకుంటే ఒక మహిళ అయి ఉండీ లిక్కర్ వ్యాపారంలో వేలు పెట్టడం వల్ల కవితకు సానుభూతి కూడా దక్కక పోవచ్చు. కవిత అరెస్టు సందర్భంగా అక్కడి పరిస్థితులను గమనిస్తే కేసీఆర్ కుటుంబం ఒంటరి అయినట్టుగా భావించాల్సి ఉంటుంది. ఇది జరుగుతున్న సమయంలోనే కొంతమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడానికి మంతనాలు జరిపారు. కర్మ ఫలాన్ని అనుభవించి తీరాల్సిందే అంటే ఇదే. అగ్రనేతలలో కేటీఆర్, హరీశ్‌రావు మాత్రమే కవిత ఇంటికి వెళ్లారు. తాను ఇప్పటికీ అధికారంలో ఉన్నట్టుగా భావిస్తున్నారేమో తెలియదు గానీ ఈడీ అధికారులతో కేటీఆర్ అభ్యంతరకరంగా వ్యవహరించారు. సహనం నశించిన ఒక మహిళా అధికారి 'ఇతడిని కూడా అరెస్టు చేయండి' అనడాన్ని మనం విన్నాం. రాష్ట్రంలోనే కాదు జాతీయ స్థాయిలో కూడా కేసీఆర్‌కు ఇప్పుడు సంఘీభావం ప్రకటించే వారు కనిపించడం లేదు. తాము శాశ్వతంగా అధికారంలోనే ఉంటామని విర్రవీగే నాయకులకు, వారి కుటుంబ సభ్యులకు కవిత ఉదంతం ఒక హెచ్చరిక. మొత్తమ్మీద తెలంగాణ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహర్జాతకుడనే చెప్పాలి. ఈ అరెస్టు ఏదో శాసనసభ ఎన్నికలకు ముందు జరిగి ఉంటే కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ లభించి ఉండేది కాదు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయి ఉండేవారు కారు. కవిత అరెస్టును కేసీఆర్ అండ్ కో ఎంత వరకు ఉపయోగించుకొని ఉండేవారో తెలియదు గానీ బీఆర్ఎస్‌తో తమకు అవగాహన లేదని చెప్పుకొనే మహదావకాశం భారతీయ జనతా పార్టీకి దక్కేది. ఈ రెండు పార్టీల మధ్య లాలూచీ ఉందన్న అభిప్రాయాన్ని తొలగించగలిగి ఉంటే శాసనసభ ఎన్నికల్లో బీజేపీ మెరుగైన ఫలితాలు సాధించి ఉండేది. అలా జరగలేదు కనుకే కాంగ్రెస్ లాభపడగలిగింది. అదను చూసి దెబ్బ కొట్టాలని అంటారు. కవితను అరెస్టు చేయడం కూడా ఇప్పుడు బీజేపీకి మేలు చేయకపోవచ్చునన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇప్పుడు ఈ అరెస్టు కేసీఆర్ అండ్ కోకు ఉపయోగపడే అవకాశం ఉందని కూడా అంటున్నారు. శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయిన నాటి నుంచి కేసీఆర్‌కు కష్టాలు మొదలయ్యాయి. ఫాంహౌజ్‌లో జారిపడి తుంటి విరగ్గొట్టుకున్నారు. మరోవైపు పార్టీ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు పక్క చూపులు చూడటం మొదలెట్టారు. దీంతో సరిగ్గా ఊపిరి తీసుకోలేని పరిస్థితికి కేసీఆర్ చేరుకున్నారు. ఈ నేపథ్యంలో అనూహ్యంగా ఢిల్లీ నుంచి వచ్చిన ఈడీ అధికారులు కవితను అరెస్టు చేయడం కేసీఆర్‌కు కొత్త ఊపిరి పోసినట్టే. నగరంలో ప్రధాని నరేంద్ర మోదీ రోడ్ షో జరుగుతున్న సమయంలోనే కవిత అరెస్టు జరగడం కాకతాళీయం కాకపోవచ్చు. బీఆర్ఎస్‌తో తమకు ఎటువంటి అవగాహనా లేదని తెలంగాణ సమాజానికి స్పష్టమైన సంకేతం ఇవ్వడం కోసమే కేంద్ర పెద్దలు ఈ సమయాన్ని ఎంచుకున్నారని చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ కూడా వెలువడింది. లిక్కర్ కుంభకోణంలో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేసే క్రమంలో తొలి మెట్టుగా కవిత అరెస్టు జరిగిందన్న అభిప్రాయం కూడా ఉంది. అయితే కేజ్రీవాల్‌కు బెయిల్ లభించింది. ఇండియా కూటమిలో కేజ్రీవాల్ కీలకంగా ఉన్న విషయం విదితమే.

ఎదుర్కోగల మొనగాడేడీ?

మరోవైపు ఎలక్టోరల్ బాండ్ల వివరాలు బయట పెట్టాల్సి రావడం కూడా కేంద్ర పెద్దలకు చికాకు కలిగిస్తోంది. అనేక కేసులలో విచారణ ఎదుర్కొంటున్న లాటరీ కింగ్ మార్టిన్ కూడా భారీ మొత్తంలో ఎలక్టోరల్ బాండ్స్ కొనుగోలు చేయడం, మరికొన్ని కంపెనీలు తమ వార్షిక లాభాలను మించి బాండ్లు కొనడం, సీబీఐ, ఈడీ దాడుల తర్వాత మరికొన్ని కంపెనీలు బాండ్లు కొనడం వంటి అంశాలు ఇప్పుడు వెలుగులోకి వచ్చాయి. జాతీయ స్థాయిలో ఈ అంశం చర్చనీయాంశం అయింది. నిజానికి ఈ బాండ్ల వ్యవహారం లోక్‌సభ ఎన్నికలకు ముందు బయటపడటం కేంద్ర పెద్దలను ఆత్మరక్షణలో పడేయాలి. అయితే ఒకప్పుడు బోఫోర్స్ తరహాలో ప్రతిపక్షాలు అన్నీ ఏకమై కేంద్ర ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టగల పరిస్థితి ఇప్పుడు లేదు. రాష్ట్రాలలో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలతో పాటు మరికొన్ని రాష్ట్రాలలో బలంగా ఉన్న ప్రాంతీయ పార్టీలు కూడా ప్రధాని మోదీని ధిక్కరించే పరిస్థితి లేదు. కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా బలహీనపడింది. ప్రజలు కూడా ఎలక్టోరల్ బాండ్స్ వంటి అంశాలకు పెద్దగా ప్రాధాన్యం ఇస్తారని భావించలేం. బోఫోర్స్ వ్యవహారానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలతో ప్రజలు కూడా స్వరం కలిపారు. జాతి జాగృతమై నాటి ప్రధాని రాజీవ్ గాంధీని ఓడించింది. ఇప్పుడు ఉత్తరాది ప్రజలు జైశ్రీరాం స్మరణతో తన్మయత్వం చెందుతున్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా సొంత రాష్ట్రానికే పరిమితం అవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలను కూడగట్టే నాయకుడే లేకుండా పోయారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఒక్కరే ఇంకా కేంద్రానికి వ్యతిరేకంగా గొంతెత్తుతున్నారు. తెలంగాణ రాష్ట్ర సమితిని జాతీయ పార్టీగా ప్రకటించి, పార్టీ పేరును కూడా భారత రాష్ట్ర సమితిగా మార్చుకున్న కేసీఆర్ కూడా సొంత రాష్ట్రంలోనే ఓడిపోయారు. ప్రజలు అత్యాశకు పోయి తనను ఓడించారని, తనను గెలిపించి ఉంటే జాతీయ స్థాయిలో అగ్గి పెట్టి ఉండేవాడినని కేసీఆర్ తాజాగా కరీంనగర్‌లో చెప్పుకొన్నారు గానీ ఆయనకు అంత సీన్ లేదు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత భారతీయ జనతా పార్టీతో పొత్తు కోసం కేసీఆర్ అనేక మార్గాల్లో ప్రయత్నించారు. అయితే శాసనసభ ఎన్నికల ముందు జరిగిన తప్పు రిపీట్ కాకూడదన్న ఉద్దేశంతో బీజేపీ పెద్దలు పొత్తు ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ఈ క్రమంలోనే అదను కాకపోయినా కవిత అరెస్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎన్నికల షెడ్యూల్ కూడా వెలువడినందున ఇప్పుడు తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల పోరు రసవత్తరంగా మారబోతోంది. లోక్‌సభకు పోటీ చేయగల అభ్యర్థులు సొంత పార్టీలో లేకపోవడంతో ఇటు కాంగ్రెస్, అటు బీజేపీ కూడా భారత రాష్ట్ర సమితికి చెందిన నాయకులను ఎగరేసుకుపోతున్నాయి. నిన్నటి వరకు కాంగ్రెస్–బీజేపీని ఖాళీ చేశానని సంబరపడిన కేసీఆర్.. ఇప్పుడు సొంత పార్టీ ఖాళీ అవుతున్నప్పటికీ గుడ్లప్పగించి చూడాల్సిన పరిస్థితి. వంద రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కిటకిటలాడింది. ఇప్పుడు సిట్టింగ్ ఎంపీలు కూడా కేసీఆర్‌కు బై బై చెబుతూ కాంగ్రెస్–బీజేపీ తరఫున పోటీ చేయబోతున్నారు. రాజకీయ పార్టీలకు ఈ పరిణామం ఒక గుణపాఠంగా ఉంటుంది. ప్రజా విశ్వాసం కోల్పోయినప్పుడు మంద బలం ఎంతగా ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఓటమి తప్పదని శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు రుజువు చేశారు. చతురంగ బలాలు ఉన్నప్పటికీ ఓటమి నుంచి కేసీఆర్ తప్పించుకోలేకపోయారు. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తరఫున గెలిచిన శాసనసభ్యులలో పలువురు మహా నాయకులేమీ కాదు. ప్రజా ఆకాంక్షలను, మనోభావాలను గుర్తించకుండా అధికారాన్ని చలాయిస్తే కేసీఆర్ కుటుంబానికి ప్రస్తుతం ఎదురవుతున్న చేదు అనుభవాలే కాచుకొని ఉంటాయి. శాసనసభలో ప్రతిపక్షాలకు మిగిలిన కొద్ది మంది సభ్యులు కూడా గొంతు ఎత్తలేని పరిస్థితిని కల్పించిన కేసీఆర్ విజయగర్వంతో విర్రవీగారు. కేసీఆర్ తరహాలో ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా శాసనసభలో సంఖ్యాపరంగా పార్టీ బలం పెంచుకొనే పనిలో నిమగ్నమయ్యారు. లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడే నాటికి పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉంది. అయితే ఈ చేరికలు ప్రభుత్వ సుస్థిరతకు మాత్రమే ఉపయోగపడతాయి. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయలేవు.

అరెస్టుతో ఎవరికి లాభం?

తాజా సమాచారం ప్రకారం తెలంగాణలో భారతీయ జనతా పార్టీ పుంజుకుంటోంది. ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీకి ఆందోళన కలిగించే అంశమే. శాసనసభ ఎన్నికల సందర్భంగా బీజేపీ అతి విశ్వాసంతో ఉండటంతో పాటు వ్యూహాత్మక తప్పిదాలు కూడా చేసింది. ఫలితంగా కాంగ్రెస్ విజయం సాధించింది. ఇప్పుడు కవిత అరెస్టు ప్రభావం ప్రజలపై కనిపించకపోతే మాత్రం లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనితీరు పట్ల ప్రజలు సంతృప్తిగానే ఉన్నారు. అయితే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన వారిలో కొంత మంది మాత్రం లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలన్న ఆలోచన చేస్తున్నారట. దీనికి తోడు ప్రధాని మోదీ ప్రభావం ఉండనే ఉంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒకవైపు, ప్రజా బలాన్ని పెంచుకుంటున్న బీజేపీ మరోవైపూ మోహరించి ఉన్నందున కేసీఆర్ పార్టీ పరిస్థితి ఏమిటి? అనే సందేహం సహజంగానే కలుగుతుంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందని, ప్రజలంతా తమ పాలనను గుర్తుచేసుకుంటున్నారని భ్రమపడుతున్న కేసీఆర్ ఆత్మవంచన చేసుకుంటున్నారు. గాలిలో మేడలు కట్టకూడదు. కేటీఆర్ వ్యాఖ్యలు, వ్యవహార శైలిని గమనిస్తున్న వారు కూడా ఆయనలో అహంభావం ఛాయలు ఇంకా తొలగిపోలేదని భావిస్తున్నారు. కవిత అరెస్టు నేపథ్యంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై నెటిజన్లు చలోక్తులు విసురుతున్నారు. గురివింద సామెతను గుర్తుచేస్తున్నారు. చంద్రబాబును అరెస్టు చేసి జైల్లో పెట్టినప్పుడు హైదరాబాద్‌లో ధర్నాలు చేసిన వారిని ఉద్దేశించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ కవితను ఢిల్లీకి తీసుకుపోయారు కనుక అక్కడ ధర్నాలు చేసుకోండని ఎగతాళి చేస్తున్నారు. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత తెలంగాణ రాజకీయాలను కలుషితం చేయడంతో పాటు అవినీతి మయం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. ఆయన పుణ్యమా అని ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్న వాళ్లు అధికారం లేకుండా, డబ్బు లేకుండా ఉండలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవా అని అంటారు. అధికారంలో ఉన్నప్పుడు కన్నూ మిన్నూ కానకుండా వ్యవహరించిన ఫలితాన్ని కేసీఆర్ అండ్ కో ఇప్పుడు అనుభవిస్తున్నారు. కవితను అరెస్టు చేసి ఢిల్లీ తీసుకుపోయినా తెలంగాణ ప్రజలు రోడ్ల మీదకు రాలేదు. పార్టీ పేరు మార్చుకోవడం ద్వారా తెలంగాణతో తనకు ఉన్న అనుబంధాన్ని కూడా కేసీఆర్ తెంచుకున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వాన్ని విమర్శించిన వారిని తెలంగాణ ద్రోహులుగా చిత్రించి తెలంగాణ వాదాన్ని దుర్వినియోగం చేశారు. ఇప్పుడు సొంత బిడ్డను అరెస్టు చేసి తీసుకు వెళ్లిన ఈడీ అధికారులను తెలంగాణ ద్రోహులని నిందించగలరా? ఈడీ అధికారులు తమ వెంట ఢిల్లీకి తీసుకుపోతున్నప్పుడు కవిత భావోద్వేగం చెందినప్పటికీ తెలంగాణ సమాజం చడీ చప్పుడూ ఎందుకు లేకుండా పోయిందో కేసీఆర్ కుటుంబం ఆత్మపరిశీలన చేసుకోవాలి.

తెలంగాణ అంటే కల్వకుంట్ల కుటుంబం కాదని గ్రహించాలి. ఉద్యమ సమయంలో తమ ఆకాంక్షను నెరవేర్చగలిగే నాయకుడ్ని కేసీఆర్‌లో చూశారు. అధికారంలోకి వచ్చాక ఆయనలోని నియంతను, ఫ్యూడల్‌నూ చూశారు. కుటుంబ సభ్యుల దర్పాన్ని, అధికార దుర్వినియోగాన్ని గమనించారు. ఫలితంగా కేసీఆర్ ఇప్పుడు ఒంటరి వారయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కవిత అరెస్టును ఆపడానికి ప్రయత్నించి ఉండకపోతే అధికారం కోల్పోవాల్సిన పరిస్థితి ఎదురయ్యేది కాదన్న అభిప్రాయం కూడా ఉంది. ఇప్పుడు అటు అధికారం కోల్పోయారు, ఇటు కుమార్తె అరెస్టును నిలువరించలేకపోయారు. తోటకూర కాడలు దొంగిలించిన నాడే మందలించి ఉంటే.. అన్నట్టుగా కుటుంబ సభ్యులను ప్రారంభంలోనే కట్టడి చేసి ఉంటే కేసీఆర్‌కు ప్రస్తుత దుస్థితి దాపురించి ఉండేది కాదు. తెలంగాణ సమాజాన్ని తాను మాత్రమే కాచి వడపోశానని చెప్పుకొనే కేసీఆర్, తెలంగాణ ప్రజలకు ఆత్మగౌరవం అత్యంత ప్రధానం అన్న వాస్తవం ఎందుకు గ్రహించలేకపోయారో? ఇప్పటికైనా మించిపోయింది ఏమీ లేదు. తనలోని అహాన్ని విడనాడి ఆత్మపరిశీలన చేసుకుంటూ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించగలిగితే ప్రజలు మళ్లీ ఆయనను ఆదరించే అవకాశం లేకపోలేదు. ఫ్లోటింగ్ నాయకులను చూసి మురుసుకొనే వారికి కేసీఆర్ ఒక ఉదాహరణగా నిలుస్తారు. స్టెరాయిడ్స్ వాడితే తాత్కాలికంగా ఉత్తేజం వస్తుంది. ఫ్లోటింగ్ నాయకులు కూడా అదే విధంగా పనికొస్తారు. ప్రజలతో మమేకం అవుతూ సంస్థాపరంగా పార్టీ బలోపేతంపై దృష్టి పెడితే ఎన్ని ఒడిదుడుకులనైనా ఎదుర్కోవచ్చు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఇందుకు ఉదాహరణ. కేసీఆర్ కూడా ఒకప్పుడు చంద్రబాబు అనుచరుడే కనుక ఆయనను చూసి నేర్చుకొనే ప్రయత్నం చేస్తే ఈ దుస్థితి నుంచి బయటపడవచ్చు. పడి లేచిన వాడే అసలైన రాజకీయ గండరగండడుగా గుర్తింపు పొందుతాడు. టక్కు టమార గజకర్ణ గోకర్ణ విద్యలతో చీమలు పెట్టిన పుట్టలో పాములా దూరి కబళించినంత మాత్రాన రాజకీయ గండరగండడు కాలేరు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్ని సీట్లు గెలుస్తారన్న విషయం పక్కన పెడితే ఓట్ల పరంగానైనా ద్వితీయ స్థానంలో నిలబడగలిగితే కేసీఆర్ నిలదొక్కుకొనే అవకాశం ఉంటుంది.

ప్చ్.. అమెరికాలోనూ కొరతేనా?


ఈ విషయం అలా ఉంచితే బలమైన యువ నాయకుల కొరత వర్ధమాన దేశాలనే కాదు– ప్రపంచానికే పెద్దన్నగా చలామణి అవుతూ వచ్చిన అమెరికాకు కూడా తప్పడం లేదు. ఇప్పుడు ఆ దేశంలో కూడా కొత్త తరం నాయకులు రావడం లేదు. ఫలితంగా రాబోయే ఎన్నికల్లో కూడా రిపబ్లికన్ పార్టీ, డెమోక్రటిక్ పార్టీల తరఫున డొనాల్డ్ ట్రంప్, జో బైడెన్‌లే మళ్లీ అధ్యక్ష పీఠం కోసం తలపడబోతున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ వయసు 81 సంవత్సరాలు. ట్రంప్ వయసు 77 సంవత్సరాలు. మాజీ అధ్యక్షుడైన ట్రంప్ పై అనేక ఆరోపణలు రావడం, కోర్టుల్లో విచారణ జరగడం, జరిమానా విధించడం జరిగింది. అరెస్టు కూడా అయ్యారు. అయినా రిపబ్లికన్ పార్టీకి ఆయన అభ్యర్థిత్వమే దిక్కయింది. అంటే ట్రంప్ వంటి వ్యక్తితో పోటీపడగల నాయకుడే రిపబ్లికన్ పార్టీలో లేరన్న మాట. శారీరకంగా అనేక రుగ్మతలు ఎదుర్కొంటున్న ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్‌ను మించిన నాయకుడు డెమోక్రటిక్ పార్టీలో లేకుండా పోవడం ఏమిటి? దీన్నిబట్టి అమెరికా వంటి అగ్రరాజ్యం కూడా నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్న మాట. చెట్టులేని చోట ఆముదం చెట్టే మహావృక్షం అని అమెరికన్లు కూడా సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి అన్న మాట!

అసెంబ్లీ ఎన్నికలకు ముందు కవిత అరెస్టును ఆపడానికి ప్రయత్నించి ఉండకపోతే అధికారం కోల్పోవాల్సిన పరిస్థితి ఎదురయ్యేది కాదన్న అభిప్రాయం కూడా ఉంది. ఇప్పుడు అటు అధికారం కోల్పోయారు, ఇటు కుమార్తె అరెస్టును నిలువరించలేక పోయారు. తోటకూర కాడలు దొంగిలించిన నాడే మందలించి ఉంటే.. అన్నట్టుగా కుటుంబ సభ్యులను ప్రారంభంలోనే కట్టడి చేసి ఉంటే కేసీఆర్‌కు ప్రస్తుత దుస్థితి దాపురించి ఉండేది కాదు. తెలంగాణ సమాజాన్ని తాను మాత్రమే కాచి వడపోశానని చెప్పుకొనే కేసీఆర్, తెలంగాణ ప్రజలకు ఆత్మగౌరవం అత్యంత ప్రధానం అన్న వాస్తవం ఎందుకు గ్రహించలేక పోయారో? ఇప్పటికైనా మించిపోయింది ఏమీ లేదు. తనలోని అహాన్ని విడనాడి ఆత్మపరిశీలన చేసుకుంటూ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించ గలిగితే ప్రజలు మళ్లీ ఆయనను ఆదరించే అవకాశం లేకపోలేదు. ప్రజలతో మమేకం అవుతూ సంస్థాపరంగా పార్టీ బలోపేతంపై దృష్టి పెడితే ఎన్ని ఒడిదుడుకులనైనా ఎదుర్కోవచ్చు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఇందుకు ఉదాహరణ.

పడి లేచిన వాడే అసలైన రాజకీయ గండరగండడుగా గుర్తింపు పొందుతాడు. టక్కు టమార గజకర్ణ గోకర్ణ విద్యలతో చీమలు పెట్టిన పుట్టలో పాములా దూరి కబళించినంత మాత్రాన రాజకీయ గండరగండడు కాలేరు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్ని సీట్లు గెలుస్తారన్న విషయం పక్కన పెడితే ఓట్ల పరంగానైనా ద్వితీయ స్థానంలో నిలబడగలిగితే కేసీఆర్ నిలదొక్కుకొనే అవకాశం ఉంటుంది.

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల పోరు రసవత్తరంగా మారబోతోంది. లోక్‌సభకు పోటీ చేయగల అభ్యర్థులు సొంత పార్టీలో లేకపోవడంతో ఇటు కాంగ్రెస్, అటు బీజేపీ కూడా భారత రాష్ట్ర సమితికి చెందిన నాయకులను ఎగరేసుకుపోతున్నాయి. నిన్నటి వరకు కాంగ్రెస్–బీజేపీని ఖాళీ చేశానని సంబరపడిన కేసీఆర్.. ఇప్పుడు సొంత పార్టీ ఖాళీ అవుతున్నప్పటికీ గుడ్లప్పగించి చూడాల్సిన పరిస్థితి. వంద రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కిటకిటలాడింది. ఇప్పుడు సిట్టింగ్ ఎంపీలు కూడా కేసీఆర్‌కు బై బై చెబుతూ కాంగ్రెస్–బీజేపీ తరఫున పోటీ చేయబోతున్నారు. రాజకీయ పార్టీలకు ఈ పరిణామం ఒక గుణపాఠంగా ఉంటుంది. ప్రజా విశ్వాసం కోల్పోయినప్పుడు మంద బలం ఎంతగా ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఓటమి తప్పదని శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు రుజువు చేశారు. చతురంగ బలాలు ఉన్నప్పటికీ ఓటమి నుంచి కేసీఆర్ తప్పించుకోలేక పోయారు. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తరఫున గెలిచిన శాసనసభ్యులలో పలువురు మహా నాయకులేమీ కాదు. ప్రజా ఆకాంక్షలను, మనోభావాలను గుర్తించకుండా అధికారాన్ని చలాయిస్తే కేసీఆర్ కుటుంబానికి ప్రస్తుతం ఎదురవుతున్న చేదు అనుభవాలే కాచుకొని ఉంటాయి.

కవిత అరెస్టు న్యాయమా? అన్యాయమా? అన్న విషయం పక్కన పెడితే ఈ దుస్థితికి ఆమె స్వయంకృతాపరాధమే కారణం. పదేళ్లపాటు తండ్రి కేసీఆర్ ఏకఛత్రాధిపత్యంగా పాలించిన తెలంగాణ రాష్ట్రంలో సంపాదించుకోవడానికి అవకాశాలే లేనట్టుగా, సంపాదించుకున్నది చాలదు అన్నట్టుగా ఆమె ఏకంగా దేశ రాజధాని ఢిల్లీలో లిక్కర్ వ్యాపారంలోకి కూడా చొరబడ్డారు. ఫలితమే ఈ అరెస్ట్. కవిత అరెస్టు అన్యాయం, అక్రమం, అప్రజాస్వామికం అని కేటీఆర్, హరీశ్‌రావు వంటి వారు గగ్గోలు పెట్టడం గురివింద సామెతను గుర్తుకుతెస్తున్నది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఓటుకు నోటు కేసులో అరెస్టు చేసి జైలుకు పంపలేదా? ఎమ్మెల్సీ, రాజ్యసభ ఎన్నికల సందర్భంగా గతంలో అనేక సందర్భాలలో శాసన సభ్యులకు, ఇతరులకు డబ్బు ముట్టజెప్పడం జరిగింది. అంతేకాదు తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన పలువురు శాసనసభ్యులకు భారీ మొత్తాల్లో డబ్బు ఆశ చూపి బీఆర్ఎస్‌లో చేర్చుకోవడం నిజం కాదా?



మాండలికంలో మొగలాయి

నామిని కంప్లీట్లీ, అబ్సల్యూట్లీ ఒరిజినల్. ఇంగ్లీషు సాహిత్యమో, రావి శాస్త్రో, కేశవ రెడ్డో, పతంజలో.... మరే ఇతర ప్రభావమూ లేకుండా ఒక సొంత వాక్యాన్ని, ఒక సొంత స్టైల్‌నీ, తనే డిస్కవర్ చేసిన సొంత నేరేటివ్‌ని అక్షరాల్లో పలికించిన 'మొగలాయి' నామిని. రాయలసీమ మాండలికం అనే కల్తీ లేని వెన్నెల విత్తనాలను రాష్ట్రమంతటా వెదజల్లితే, అవి మన పెరట్లో రంగురంగుల సీతాకోకచిలుకలై ఎగిరి, యాస పువ్వులై విరబూశాయి. అక్షరాలను ఆవిర్లు ఎగజిమ్మే అన్నం మెతుకులుగా మార్చగలిగే నామిని, పచ్చనాకు సాక్షిగా మాండలికానికి అమ్మ.



ఎవర్నయినా ఎందుకు తలుచుకుంటాం?
ఎవర్నయినా ఎందుకు గుర్తు పెట్టుకుంటాం?
ఎప్పుడో 40 ఏళ్ళ క్రితం రాసిన మాటలు ఇప్పుడు గుర్తొచ్చినా ఎందుకు మురిసిపోతాం?
తెలతెలవారుతుండగా పొలం గట్ల మీద నడుస్తున్నట్టు,
పొయ్యి మీద అన్నం ఉడుకుతున్నట్టు,
పొలిమేరలో నించుని చంద్రోదయాన్ని చూస్తున్నట్టు..
ఎవరైతే రాయగలుగుతారో వాళ్ళని ఎలా మరిచిపోతాం?
కంకుల మీద వాలిన పిచ్చికలు పలకరించినట్టు,
పిల్లలు... చెట్టు కొమ్మకి కట్టిన ఉయ్యాలలూగుతున్నట్టు,
రైతు కూలీ రెండు చేతులతో పంట కాల్వలో నీళ్ళు తాగుతున్నట్టు....
అంత సహజంగా, సమ్మోహనంగా రాయడం సాధ్యమేనా?
నామినిని తలుచుకోవడం అందుకే.

నామిని సుబ్రహ్మణ్య నాయుడు మాకు బాగా తెలిసినవాడని గొప్పగా చెప్పుకోవడమూ అందుకే.

నామిని రాసేవి కేవలం అక్షరాలు కావు. అవి మేలు రకం విత్తనాలు. వాక్యాలు కావవి, రాగులూ, సజ్జలూ, జొన్న రాశులు. తాటాకు గుడిసె ముందు చింకి చాప పరిచి, నిండు జీవితాన్ని ఎండబెడతాడు. నిరాశ నిండిన బతుకు నీడల మీద నుంచి నామిని నడిచి వెళిపోతుంటాడు. పల్లెటూరి పేదరికాన్ని, తిండి గింజలు లేని వేదనని దయతో, ప్రేమతో, అపేక్షతో చూస్తాడు. ఆ నిత్యజీవన వేదనలోని విషాద సంగీతాన్ని చెవివొగ్గి మరీ వింటాడు. ఆ చీకటిని కూడా వెలిగించగలిగే చిరునవ్వు వెనుక దాగిన హాస్యాన్నీ ఒడిసి పట్టుకుంటాడు. వాటిని కథలుగా రాస్తాడు.

గోగాకు పూరు బిండితో సద్ది తాగినట్టు,
ఆదివారం మాంసం కూరతో ఆబగా తిన్నట్టు,
నులక మంచమ్మీద నాన్న పక్కన సుఖంగా నిద్ర పోతున్నట్టు..

అలవోకగా రాసుకుంటూ పోతాడు. ఆ కుశాలను, మనేదను మనకి కానుకగా యిచ్చి వెళతాడు. అందుకే, నామిని కంప్లీట్లీ, అబ్సల్యూట్లీ ఒరిజినల్. ఇంగ్లీషు సాహిత్యమో, రావి శాస్త్రో, కేశవ రెడ్డో, పతంజలో... మరే ఇతర ప్రభావమూ లేకుండా ఒక సొంత వాక్యాన్ని, ఒక సొంత స్టైల్‌నీ, తనే డిస్కవర్ చేసిన సొంత నేరేటివ్‌ని అక్షరాల్లో పలికించిన 'మొగలాయి' నామిని.

రాయలసీమ మాండలికం అనే కల్తీ లేని వెన్నెల విత్తనాలను రాష్ట్రమంతటా వెదజల్లితే, అవి మన పెరట్లో రంగురంగుల సీతాకోకచిలుకలై ఎగిరి, యాస పువ్వులై విరబూశాయి. సువాసనలు పంచి యిచ్చాయి. ఆ యాసకు వుండే సొగసునీ, తూగునీ, మాధుర్యాన్ని మనలో నింపుతూనే, ఆ వ్యక్తీకరణలోని శక్తితో గుండెను చీల్చి వేయడం అనే రహస్య విద్యలో ఆరితేరినవాడు నామిని. అక్షరాలను ఆవిర్లు ఎగజిమ్మే అన్నం మెతుకులుగా మార్చగలిగే నామిని, పచ్చనాకు సాక్షిగా మాండలికానికి అమ్మ.

అసలు నామిని అంటేనే ఒక ఉద్యానవనం.

నామిని అంటే ఒక పునరుజ్జీవనం.

మరో మాట లేదు... ప్రపంచస్థాయి రచయిత, ఆధునిక తెలుగు సాహిత్యంలో అగ్రతాంబూలం అందుకోవడానికి అర్హుడు.

నామిని రాసే చిత్తూరు జిల్లా భాష నుడికారంలో ఒక సౌందర్యం, జీవసుగంధం ఉంటాయి. కథ చెప్పడంలో నామినిది ఒక ప్రత్యేకమైన నేరేటివ్ టెక్నిక్. దూరం నుంచి చూస్తున్న ప్రేక్షకుడి లాగానే నిరపేక్షగా కథ నడిపిస్తాడు. ఆ శిల్పచాతుర్యం మనల్ని చకితుల్ని చేస్తుంది. ఎక్కడా తొణకడు. మెలోడ్రామాకు పాల్పడడు. పాఠకుణ్ణి ఇంప్రెస్ చేసే వేషాలు వేయడు. కేవలం వాక్యనిర్మాణ నైపుణ్యం మాత్రమే కాదు, నిస్సంకోచంగా భయమూ బెరుకూ లేకుండా చెపుతాడు. అతని చూపుతో, అభివ్యక్తితో అనంతమైన ఊహా శక్తితో ఒక అపూర్వమైన అనుభవానికి ద్వారాలు తెరుస్తాడు. ఉత్తమాభిరుచికి కొత్త దారులు పరుస్తాడు.

ఒక ఇస్మత్ చుగ్తాయి, సాదత్ హసన్ మంటోలా సాహసి నామిని. గుడిపాటి వెంకటచలంలా తిరుగుబాటుదారుడు.

ఆఫ్రికన్ ఆకలి అయినా, లాటిన్ అమెరికా నెత్తురయినా, మిట్టూరు కన్నీళ్లయినా పేదవాడి వేదన ఒక్కటే. బాధితుడి నిస్సహాయతా ఒక్కటే.

వడపోసిన జీవితానుభవసారాన్ని తేలిక మాటలతో సులభంగా, సూటిగా చెప్పడం అంత తేలికేమి కాదు. పైగా, పరిమళభరితమైన ఒక ప్రాంతీయ మాండలికానికి ఉత్తమ సాహిత్య గౌరవం యిచ్చి, తాను ముందుండి ఆ మహోద్యమాన్ని నడిపించిన లిటరరీ విజనరీ నామిని. పూట గడవని సామాన్య జనం యాసలోని రసపారవశ్యాన్ని అనుభవించి, ఆ పలుకుబడి మాధుర్యంతో మన దోసిలి నింపినవాడు. సహజసుందరమైన యాసలోని ఆత్మసౌందర్యాన్ని తెలుగు పాఠకుల గుండెల్లోకి వొంపినవాడు.

అలనాటి గురజాడ వెంకట అప్పారావుకీ, మన కాలం వీరుడు నామిని సుబ్రహ్మణ్యం నాయుడికీ మధ్య 75 సంవత్సరాల అంతరం వుంది... వుందా? లేదేమో!

'నాకు మానవ సమాజం పట్ల మహత్తరమైన బాధ్యత వున్నది. నాది ప్రజా ఉద్యమం. దానిని ఎవరిని సంతోషపెట్టడానికీ వదులుకోలేను' అని స్పష్టంగా చెప్పారు గురజాడ. ఈ మాట నామినికి కూడా నూరు శాతం వర్తిస్తుంది.

కన్యాశుల్కం ఒక మహత్తరమైన నాటకం.

నామిని 'మూలింటామె' ఒక మహా కావ్యం.

వాడుక భాష అంటే భావవ్యక్తీకరణకు ప్రజలు వాడే పదజాలం. ప్రజలంటే మనమూ మనమిత్రపుత్ర బృందాలే అయినా, ఒక ప్రాంతం వాళ్ళు వాడే ముతక మాటల మూటలు మనకు దొరకవు. కోస్తా, ఉత్తరాంధ్ర యాసలో గొప్ప సాహిత్య సృష్టి జరిగినా, రాయలసీమ అనగానే ఏడుకొండలవాడిలాగా నామిని సుబ్రహ్మణ్య నాయుడు సాక్షాత్కరిస్తాడు. కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో అనేకమంది రచయితలు మాండలికాన్ని పండించినా, ఆ ప్రాంతపు మాటల్ని ఇంత పదునుగా, ఇంత చురుగ్గా, ఇంత లాఘవంగా రికార్డు చేసి, పాత్రల చేత పలికించిన వారు లేరు. మునికన్నడి మాట ఐనా, మూలింటామె దిగులైనా, మిట్టూరోడి మనేద అయినా, జీవ భాషగా ప్రవహించే యాసలోని సప్తస్వరాలనూ మన నరాల తీగలపై పలికించే తీవ్రతకు పాఠకులు దిమ్మతిరిగి సొమ్మసిల్లి పడిపోతారు. ఎండలో, వానలో, వెన్నెల్లో తడిచిన నాణ్యమైన మిట్టూరు మట్టిని తెలుగు సాహిత్యాకాశం అంచులదాకా విసిరినవాడు, జాను తెలుగుయాసను త్రికరణశుద్ధిగా జాతికి అంకితం చేసినవాడు నామిని ఒక్కడే! ఒక పాప, ఒక బాబు– నిద్రపోతున్న ఇద్దరు చిన్న పిల్లలు, ఆడ చందమామలా, మగ చందమామలా వున్నారని రాయడం తెలుగులో మరో రచయితకు సాధ్యం అయ్యే పనేనా?

అమ్మానాన్న చేసుకున్న పుణ్యం కావొచ్చేమో గానీ, సాక్షాత్తూ ఆ వెంకటేశ్వర స్వామి, ఏడు కొండలూ దిగి వచ్చి తెలుగు సాహితీ లోకానికి ఇచ్చిన అమూల్యమైన, అమృతతుల్యమైన కానుక నామిని సుబ్రహ్మణ్యం నాయుడు.

ఇందుకే అమరరాజా వారి రాజన్న ట్రస్ట్ నామినిని 'మాండలిక బ్రహ్మ' అంటోంది.

• తాడి ప్రకాష్

(నేడు తిరుపతిలో సుప్రసిద్ధ రచయిత నామిని సుబ్రహ్మణ్యం నాయుడుకు రాజన్న ఫౌండేషన్ వారిచే 'మాండలిక బ్రహ్మ' అవార్డు ప్రదానం)



ఏసీబీ కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం


- వరంగల్, హనుమకొండ కోర్టుల ముందంజ
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే
- ఏసీబీ, హనుమకొండ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల ప్రారంభం

7

'లోక్‌సభ'కు సై

మోగిన పార్లమెంట్ ఎన్నికల నగారా

- షెడ్యూల్ ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం
- ఉమ్మడి జిల్లాలో వరంగల్, మహబూబాబాద్ స్థానాలు
- గెలుపే ధ్యేయంగా ప్రచార పర్వంలోకి ప్రధాన పార్టీలు



(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పార్లమెంట్ ఎన్నికలకు ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు శనివారం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో రాజకీయపార్టీలు లోక్‌సభ సమరానికి సై అంటున్నాయి. దేశవ్యాప్తంగా ఏడు దశల్లో ఎన్నికలు జరగనుండగా.. నాలుగో దశలో మే 13న రాష్ట్రంలోని అన్నిపార్లమెంట్ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాలకు కూడా ఎన్నికలు నిర్వహించేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది. ఇప్పటికే ఓటరు జాబితాలను సిద్ధం చేయగా.. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులకు, అభ్యర్థుల సమగ్ర వివరాల కోసం ఎన్నికల సంఘం ప్రత్యేక యాప్‌లను కూడా విడుదల చేసింది. మరోవైపు షెడ్యూల్ ప్రకటనతోనే శనివారం నుంచి అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసే దిశగా అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఇక పార్లమెంట్ ఎన్నికలపై గంపెడాశలు పెట్టుకున్న ప్రధాన పార్టీలు, అభ్యర్థులు ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు వ్యూహరచన చేసుకుంటున్నారు. శనివారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రభుత్వ పథకాల అమలుకు, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు బ్రేక్ పడింది. కోడ్ ముగిసే వరకు అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఉండదు.

విస్తృత ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక కీలకమైన ప్రాంతాలు, జిల్లాల సరిహద్దుల్లో పోలీసులు తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లితే, దానికి సంబంధించిన ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. ఇక వరంగల్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 1,893 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా.. అత్యధికంగా పాలకుర్తి నియోజకవర్గంలో 294 కేంద్రాలు, స్టేషన్‌ఘనపూర్ పరిధిలో 290 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో 1,783 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా ములుగులో అత్యధికంగా 209, మహబూబాబాద్‌లో 184 పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించనున్నారు. దివ్యాంగులు, గర్భిణులు సులువుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా, ఓటరు ఫెలిసిటేషన్ సెంటర్, హెల్ప్ డెస్క్, సిగ్నేజ్, షెడ్, తగిన వెలుగు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే అభ్యర్థికి సంబంధించిన మొత్తం సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుగా 'నో యువర్ క్యాండిడేట్..' యాప్ ద్వారా తెలుసుకునే అవకాశం కల్పించారు. అలాగే ఎన్నికల్లో జరిగే అవకతవకలపై సీ వి జిల్ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయవచ్చు.

ఎన్నికల ప్రక్రియ కొనసాగనుందిలా..

కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 18న గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. అదే రోజు నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 26వ తేదీన నామినేషన్ల పరిశీలన, 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. మే 13వ తేదీన రాష్ట్రంలోని అన్ని స్థానాలతో పాటు వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలకు పోలింగ్ జరుగుతుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఇక వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి వరంగల్ కలెక్టర్, మహబూబాబాద్ స్థానానికి మహబూబాబాద్ కలెక్టర్ ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారు. అభ్యర్థుల నామినేషన్లను కూడా కలెక్టరేట్లలోనే స్వీకరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

'మానుకోట'లో పొలిటికల్ హీట్

మహబూబాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికలకు నగారా మోగడంతో మహబూబాబాద్ (మానుకోట) పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పొలిటికల్ హీట్ మొదలైంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇప్పటికే ఖరారవడంతో వారు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. తమ అనుచరగణాన్ని కూడగట్టుకుని.. ప్రచార పర్వంలోకి దిగేతందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం.. మే 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నాటికి దాదాపు 57 రోజుల వ్యవధి ఉండగా.. ఈ సమయాన్ని సక్రమంగా వినియోగించుకుని తమ సత్తా చాటాలని అభ్యర్థులు వ్యూహరచన చేసుకుంటున్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం..

మిగతా 7వ పేజీలో..

వరంగల్ అభ్యర్థులను తేల్చని కాంగ్రెస్, బీజేపీ

లోక్‌సభ ఎన్నికల నగారా మోగడంతో ఉమ్మడిజిల్లాలో రాజకీయం వేడెక్కుతోంది. ఇప్పటికే మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ తమ అభ్యర్థులను ఖరారు చేయడంతో వారు ప్రజాక్షేత్రంలోకి దిగారు. ఇక వరంగల్ లోక్‌సభ స్థానానికి బీఆర్‌ఎస్ తన అభ్యర్థిగా కడియం కావ్య పేరును ప్రకటించగా.. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులెవరే ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆయా పార్టీల కేడర్ అయోమయానికి గురవుతోంది. మే 13న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అభ్యర్థుల ప్రకటన విషయంలో కాంగ్రెస్, బీజేపీ మరికొంత సమయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. అయితే బీజేపీలోకి మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను ఆదివారం చేర్చుకుని, అభ్యర్థిగా ప్రకటిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇక కాంగ్రెస్‌లోనే 50మందికి పైగా ఆశవాహులు ఉండటంతో వారిలో ఎవరిని ఎంపిక చేస్తారనే ఉత్కంఠ ఆ పార్టీ కేడర్‌లో కనిపిస్తోంది.

వరంగల్‌లో 18,16,429మంది, మానుకోటలో 15,26,998 ఓటర్లు



వరంగల్ లోక్‌సభ పరిధిలో 7 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. గత నెల 8వ తేదీ వరకు నమోదైన మొత్తం ఓటర్లు 18,16,429మంది. వీరిలో మహిళలు 9,23,510మంది కాగా, పురుషులు 8,92,527 మంది ఉన్నారు. 392 మంది ఇతరులు ఉన్నారు. వరంగల్ ఎంపీ స్థానంలో పురుషుల కంటే మహిళలు 30,983 మంది అధికంగా ఉన్నారు. అలాగే మహబూబాబాద్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో మొత్తం 15,26,998 మంది ఓటర్లుండగా వీరిలో మహిళలు 7,81,339 మంది, పురుషులు 7,45,554 మంది, 105 మంది ఇతరులున్నారు. ఇక్కడ కూడా మహిళ ఓటర్లు 35,785 మంది అధికంగా ఉన్నారు. కాగా, వరంగల్ పార్లమెంట్ పరిధిలో 2019కంటే ఓటర్లు భారీగా పెరిగారు. 2019లో 15,78,335మంది ఉంటే ఈసారి 18,16,429మంది ఉన్నారు. ఈ ఐదేళ్లలో 2,38,094 మంది ఓటర్లు పెరిగారు. అలాగే మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో 2019లో 13,36,286 మంది ఉంటే ఈసారి 15,26,998 ఓటర్లున్నారు. గత ఐదేళ్లలో 1,90,712మంది పెరిగారు. తుదిజాబితా నాటి ఈ సంఖ్య ఇంకా పెరుగుతుందని అంచనా.

వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధి ఓట్లు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
స్టేషన్‌ఘనపూర్	1,24,659	1,27,948	01	2,52,608
పాలకుర్తి	1,26,256	1,28,533	13	2,54,802
పరకాల	1,08,156	1,14,105	02	2,22,263
వరంగల్ పశ్చిమ	1,38,594	1,43,095	14	2,81,703
వరంగల్ తూర్పు	1,24,707	1,31,428	339	2,56,474
వర్ధన్నపేట	1,33,524	1,38,514	17	2,72,055
భూపాలపల్లి	1,36,631	1,39,887	06	2,76,524
మొత్తం	8,92,527	9,23,510	392	18,16,429


మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధి ఓట్లు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
డోర్నకల్	1,08,931	1,13,165	07	2,22,103
మహబూబాబాద్	1,26,290	1,31,449	47	2,57,786
నర్సంపేట	1,14,891	1,20,104	09	2,35,004
ములుగు	1,13,413	1,18,935	26	2,32,374
పినపాక	99,608	1,03,525	05	2,03,138
ఇల్లందు	1,09,632	1,14,818	04	2,24,454
భద్రాచలం	72,789	79,343	07	1,52,139
మొత్తం	7,45,554	7,81,339	105	15,26,998

ఐదేళ్లలో పెరిగిన ఓటర్లు..

పార్లమెంట్ స్థానం	2019	2024	పెరిగిన ఓట్లు
వరంగల్	15,78,335	18,16,429	2,38,094
మహబూబాబాద్	13,36,286	15,26,998	1,90,712

శనివారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 34.0°C | కనిష్ఠం : 23.5°C



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : ఆదివారం సా : 6.32 గం..
సహర్ : సోమవారం ఉ : 5.00 గం..

బీఆర్‌ఎస్‌కు అరూరి రాజీనామా



రాంనగర్, మార్చి 16: బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షు డు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పార్టీకి రాజీనామా చేశారు. శనివారం రాజీనామా లేఖను బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు పంపారు. పార్టీలో అవకాశాలు కల్పించిన కేసీఆర్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు అరూరి ధన్యవాదాలు తెలిపారు. తనకు సహకరించిన ప్రతీ ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా, అరూరి రమేశ్ 2012లో బీఆర్‌ఎస్‌లో చేరి 2014, 2018 ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సా ధించారు. గత నవంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో మూడోసారి బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన అరూరి రమేశ్ కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో ఓటమి చెందారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేయాలని సిద్ధమైనప్పటికీ పార్టీ నుంచి ప్రతికూల సంకేతాలు రావడంతో మనస్తాపం చెంది పార్టీని వీడాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే రమేశ్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు.

నేడు బీజేపీలోకి..

బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన అరూరి రమేశ్ ఆదివారం బీజేపీలో చేరనున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరనున్నారు. బీజేపీలో చేరనున్న అరూరిని వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించే అవకాశం ఉంది. పార్టీ సభ్యత్వంతో పాటు ఎంపీ అభ్యర్థిగా బీఫామ్ ఇచ్చే అవకాశాలున్నట్లు తెలిసింది. మొత్తంగా వారంరోజులుగా జరుగుతున్న అరూరి ఎపిసోడ్‌కు ఆదివారం తెరపడే అవకాశం ఉంది.

ఓటరు చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ కలెక్టరేట్, మార్చి16: రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల్లో ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేసే విధంగా స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమా లను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో లోక్‌సభ ఎన్నికలు- 2024పై స్వీప్ కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన వివిధశాఖల అధికారులతో శనివారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వీప్ కార్యక్రమాలలో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలన్నారు. విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన తదితర పోటీలను నిర్వహించాలన్నారు. ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్ల, జిల్లా పంచాయతీ అధికారి, స్వీప్ నోడల్ ఆఫీసర్ రమాకాంత్, డీఆర్డీఓ నాగ పద్మజ, డీఈఓ అబ్దుల్ హైతో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీ దయాకర్

- కండువా కప్పి ఆహ్వానించిన మహేశ్‌కుమార్ గౌడ్
- నాయిని ఆధ్వర్యంలో ఇద్దరు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కూడా..
- పుల్లా భాస్కర్ దంపతులు సహా మరికొందరి చేరిక



గాంధీభవన్‌లో ఎంపీ పసునూరి దయాకర్‌కు కాంగ్రెస్ కండువా కప్పుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, చిత్రంలో మంత్రి కొండా సురేఖ, తదితరులు

హనుమకొండ సిటీ, మార్చి 16: వరంగల్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఒక్కొక్కరిగా పార్టీని వీడుతున్నారు. కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. ఇటీవలే కొద్ది రోజులుగా చేరికల ప్రస్థానం కొనసాగుతోంది. బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరు కార్పొరేటర్లతోపాటు మరి కొందరు నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోగా.. శనివారం బీఆర్‌ఎస్‌కు చెందిన వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ కాంగ్రెస్ కండువాను ధరించారు. వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో శుక్రవారమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. శనివారం మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీని దయాకర్ కలిశారు. అనంతరం గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమా ర్‌గౌడ్ కాంగ్రెస్ కండువాను కప్పి పసునూరి దయాకర్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ ఆశావహుడు జన్ను పరంజ్యోతి, నవీన్‌రాజ్, కేడల పద్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాయిని ఆధ్వర్యంలో..

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతితోపాటు ఆమె భర్త పుల్లా భాస్కర్, బీఆర్‌ఎస్‌కు చెందిన 61వ డివిజన్ కార్పొరేటర్ ఎలిగంటి రాములు, 54వ డివిజన్ కార్పొరేటర్ గుంటి రజిత శ్రీనివాస్ కూడా కాంగ్రెస్ గూటికి చేరారు. మాజీ కార్పొరేటర్ మర్రి జనార్దన్ పటేల్ కూడా రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన అనంతరం పార్టీలో చేరారు. వీరితో పాటు పశ్చిమకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు సమద్, కోన శ్రీకర్ తదితరులు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ఆ తదుపరి పార్టీలోకి రాజేందర్‌రెడ్డి కండువాలను కప్పి ఆహ్వా నించారు. ఇప్పటికే బీఆర్‌ఎస్‌లోని పశ్చిమకు చెందిన ఆరుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరగా, తాజాగా ఇద్దరి కార్పొరేటర్ల చేరికతో ఈ సంఖ్య 8కి చేరింది. ఇక బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు ముఖ్య నాయకులు కూడా ఆ పార్టీని వీడడంతో పశ్చిమలో బీఆర్‌ఎస్‌కు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోదీ

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయభాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య
- ఎమ్మెల్సీ కవిత అరెస్టు నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా నిరసనలు



నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నేతలు

రాంనగర్, మార్చి 16: ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న మోదీ సర్కార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కల్వకుంట్ల కవిత అరెస్టును నిరసిస్తూ శనివారం జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. హనుమకొండలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో పాటు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. హనుమకొండ జిల్లా పార్టీ కార్యాలయం నుంచి కాళోజీ జంక్షన్ వరకు ర్యాలీగా వచ్చి నిరసన తెలిపారు. మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కవిత అరెస్టును ఖండించారు. కవిత అరెస్టును ఖండించారు. ఈ సందర్భంగా వినయభాస్కర్, సారయ్య మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ మనోధైర్యాన్ని దెబ్బతీసేందుకు తమపార్టీపై మోదీ సర్కార్ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, నేతలు నాగుర్ల వెంకటేశ్వర్లు, సుందర్‌రాజ్, మర్రి యాదవరెడ్డి, తాళ్లపల్లి జనార్దన్‌గౌడ్, కడియం కావ్య, సోదా కిరణ్, లోహిత రాజ్, అశోక్‌యాదవ్, విజయలక్ష్మీ, పులి రజనీకాంత్, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రపంచానికి నూతన ఆవిష్కరణలు అందించాలి

▸▸ ఎస్సార్ వర్సిటీ స్నాతకోత్సవంలో న్యాక్ చైర్మన్ అనిల్ సహస్ర బుద్ధే

హసన్‌పర్తి, మార్చి 16 : యువ ఇంజనీర్లు ప్రపంచానికి నూతన ఆవిష్కరణలను అందించాలని ఎగ్జిక్యూటివ్ కమిటీ నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిడేషన్ చైర్మన్ అనిల్ సహస్ర బుద్ధే అన్నారు. హసన్‌పర్తి మండలం అనంతసాగర్ వద్దగల ఎస్సార్ యూనివర్సిటీలో శనివారం ప్రథమ స్నాతకోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువ ఇంజనీర్లు సాంకేతిక పరిజ్ఞానంతో సమస్యలను పరిష్కరించే వారిగా ఉండి, నూతన ఆవిష్కరణలకు తోడ్పడాలన్నారు. యూనివర్సిటీ కల్పించే సదుపాయాలతో అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కృత్రిమ మేధస్సు, మెషిన్ లర్నింగ్, డ్రోన్స్, రోబోటిక్స్, క్వాంటం కంప్యూటింగ్ సాంకేతికతతో ప్రపంచం ముందుకు వెళుతుందన్నారు. భారతదేశం సైన్స్ అండ్ టెక్నాలజీలో మార్గదర్శిగా నిలిచిందన్నారు. అందుకు నిదర్శనం చంద్రయాన్, ఆదిత్య మిషన్, థోరియం రియాక్టర్లు, వందేభారత్ రైళ్లు నిదర్శనమన్నారు. ఎన్ఈటీఎఫ్, పీఎంకేవీవై, ఎన్ఏడీసీ, ఎన్ఎస్ఎం వంటివి ఏర్పాటు చేయడం ద్వారా సాంకేతిక నైపుణ్యాలు అందుతున్నాయని పేర్కొన్నారు. యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎనగందుల వరదారెడ్డి మాట్లాడుతూ.. 45ఏళ్లుగా విద్యారంగంలో సేవలందిస్తున్నట్లు తెలిపారు. 2002లో ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించి, ఎన్ఏఏసీ, ఎన్‌బీఏ, యూజీసీ అక్రిడియేషన్స్ పొంది, 2023లో జాతీయ స్థాయిలో 98వ స్థానం సాధించి, నూతన ఆవిష్కరణలతో జాతీయ స్థాయిలో అటల్ ర్యాంకింగ్‌లో ప్రథమ స్థానం పొందినట్లు పేర్కొన్నారు. సినీ గేయ రచయిత చంద్రబోస్ మాట్లాడుతూ.. ఆర్ఆర్ఆర్ చిత్రం ద్వారా ఆస్కార్ అవార్డు రావడం, ఎస్సార్ వర్సిటీ ద్వారా గౌరవ డాక్టరేట్ రావడం జీవితంలో మరిచిపోలేనివన్నారు. చదువు నేర్చుకున్న గురువుతోనే డాక్టరేట్ అందుకోవడం సంతోషదాయకమన్నారు. అనంతరం చంద్రబోస్‌కు గౌరవ డాక్టరేట్ పట్టాను, విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రో చాన్స్‌లర్ ఎనగందుల మధుకర్‌రెడ్డి, వైస్ చాన్స్‌లర్ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, కన్వోకేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ సీవీగురురావు, డీన్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిల్ సహస్ర బుద్ధే







లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం

- తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే
- ఏసీబీ, హనుమకొండ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల ప్రారంభం

వరంగల్ లీగల్, మార్చి 16 : లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం సాధ్యమవుతుందని, ఇందులో వరంగల్, హనుమకొండ జిల్లా కోర్టులు ముందున్నాయని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే ప్రశంసించారు. శనివారం వరంగల్, హనుమకొండ కోర్టుల సముదాయంలో కొత్తగా ఏర్పాటు చేసిన అవినీతి నిరో ధక వరంగల్ ప్రత్యేక కోర్టు (ఏసీబీ), హనుమకొండ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఈ-సేవా కేంద్రం, రికార్డుల డిజిటలైజేషన్ కేంద్రాన్ని జస్టిస్ అలోక్ అరాథే ప్రారంభించారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శనివా రం జరిగిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా మొత్తం 3,43,182 కేసులు పరిష్కారంకాగా, వరంగల్ కోర్టు పరిధిలో 4713, హనుమకొండ జిల్లా కోర్టు పరిధిలో 3,501 కేసులు పరిష్కారమయ్యాన్నారు. లోక్‌అదాలత్ ద్వారా ఈ రెండు కోర్టుల పరిధిలో అత్యధికంగా కేసులు పరిష్కారం కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కేసుల సత్వర కృషి చేసినందుకు జ్యుడీషియల్ సిబ్బందిని ప్రధాన న్యాయమూర్తి అభినందించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు కలిసికట్టుగా కృషి చేసినందు వల్లనే ఇది సాధ్యమైందన్నారు.



హనుమకొండ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే

న్యాయవ్యవస్థ అంకితభావంతో అర్థవం తమైన పాత్రపోషించడం ద్వారానే సమాజంలో వెలుగులను నింపగలుగు తామని జస్టిస్ అలోక్ అరాథే అన్నారు. కేసుల పరిష్కారంలో న్యాయమూ ర్తులు, న్యాయవాదుల పరస్పర సహకారం కీలక మైందన్నారు. ఉభయులు పరస్పర సహకారం, సమన్వయంతోనే కేసులు సత్వరం పరిష్కారం అవుతా యన్నారు. వరంగల్ కోర్టు సముదాయంలో శనివారం ప్రారంభమైన ఈ-సేవా కేంద్రం ఎంతో ఉపయుక్తమైందని అన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద తెలంగాణ రాష్ట్రంలో మొదటి సారి దీనిని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. దీని కొనసాగిం పుగా ఈనెల 23న నల్లగొండ జిల్లాలో కూడా ఈ-సేవా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఈ-సేవా కేంద్రాన్ని న్యాయవాదులు సద్విని యోగం చేసుకోవడం ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ-సేవా కేంద్రం ద్వారా హైకోర్టు వరకు రావలసిన అవసరం లేకుండా ఇక్కడి నుంచే కేసులను దాఖలు చేయడంతో పాటు ఆన్‌లైన్‌లో వాదనలు వినిపించే అవకాశం ఉందన్నారు. కోర్టు ప్రాంగణంలో కొత్తగా అందుబాటులోకి తీసుకువచ్చిన డిజిటల్ కేంద్రం సౌకర్యాన్ని ప్రస్తావిస్తూ కేసులకు సంబంధించిన దస్తావేజులు కాలక్రమంలో దెబ్బతింటున్న దృష్ట్యా వాటిని శాశ్వతంగా భద్రపరిచేందుకు డిజిటైజేషన్ ఎంతో ఉపయోగపడుతుందని, ఈ సౌకర్యం వరంగల్ జిల్లా కోర్టు సముదాయంలో అందుబాటులోకి వచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు. దీనిని న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని జస్టిస్ అలోక్ అరాథే కోరారు. బార్ అసోసియేషన్ల ప్రతినిధులు తన దృష్టికి తెచ్చిన జిల్లా కోర్టు సముదాయంలోని సమస్యల ను, డిమాండ్లను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

జిల్లా పోర్టు పోలియో జడ్జి, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ జె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. జూనియర్ న్యాయవాదులకు వర్క్‌షాపులను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిమెంట్ల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. హైకోర్టు జడ్జి జస్టిస్ నామవరపు రాజేశ్వర్ రావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఐదుకోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, హనుమకొండ, వరంగల్ జిల్లాల వ్యాప్తంగా కూడా 30వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు చిత్తశుద్ధితో కేసుల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. వరంగల్ జిల్లాతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. హైకోర్టు మరో జడ్జి జస్టిస్ టి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. కోర్టు సముదాయంలో కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఈ-సేవా కేంద్రం ద్వా రా న్యాయవాదులు తమ కేసుల దస్తావేజులను ఉచితంగా స్కాన్ చేసుకోవచ్చునని తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రధాన న్యాయమూర్తి

తొలుత హనుమకొండ జిల్లా ప్రధాన జడ్జి ఎం.క్రిష్ణమూర్తి స్వాగతోపన్యాసం చేశారు. వరంగల్, హనుమకొండ కోర్టు సముదాయం ప్రాముఖ్యత, ఓరుగల్లు జిల్లా చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. వరంగల్ జిల్లా జడ్జి కోక రాధాదేవి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. తొలుత జస్టిస్ అరాధే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు వై.శ్యాంసుందర్ రెడ్డి, ఈ.అనంద్ మోహన్, రాష్ట్ర బార్‌కౌన్సిల్ సభ్యులు భైరపాక జయాకర్, దుస్సా జనార్దన్, హైకోర్టు రిజిస్ట్రార్ నందికొండ నర్సింగరావు, ఉభయ జిల్లాల అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆహూతులతో కోర్టు ప్రాంగణం కిటకిటలాడింది. కార్యక్రమం ఆద్యంతం అహ్లాదకర వాతావరణంలో జరిగింది.

అంతకుముందు పది కోర్టుల భవన సముదాయం ముందుగల కాకతీయ కళాతోరణం ఎదుట జిల్లా న్యాయమూర్తులు, అదనపు న్యాయమూర్తులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధేతో కలిసి గ్రూప్ ఫొటోలు దిగారు. సమావేశం అనంతరం బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ముఖ్య అతిథులను సత్కరించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరాధే శనివారం రాత్రి ఇక్కడే బస చేస్తారు. ఆదివారం హనుమకొండలోని వేయి స్తంభాలగుడి, భద్రకాళి దేవాలయం, ములుగులోని రామప్ప గుడిని సందర్శిస్తారు. కాగా, ఆదివారం నర్సంపేటలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును జిల్లా పోర్టు పోలియో జడ్జి జిస్టస్ కె.లక్ష్మణ్ ప్రారంభిస్తారు.

లోక్ అదాలత్‌లో 8,214 కేసుల పరిష్కారం

హనుమకొండ జిల్లాలో 3,501, వరంగల్ జిల్లాలో 4,713

వరంగల్ లీగల్, మార్చి 16 : జాతీయ రాష్ట్ర న్యాయ సేవా సంస్థల ఆదేశాల మేరకు శనివారం జిల్లా కోర్టు సముదాయంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 8,214 కేసులను పరిష్కరించినట్టు వరంగల్, హనుమకొండ జిల్లా జడ్జిలు కె.రాధాదేవి, ఎం.క్రిష్ణమూర్తి తెలిపారు. వరంగల్ జిల్లాలో తొమ్మిది బెంచీలు ఏర్పాటుచేసి 49 సివిల్ కేసులు, 28 రోడ్డు ప్రమాద బీమా కేసులు పరిష్కరించి బాధితులకు రూ.కోటి 40లక్షల 92వేల 176 నష్టపరిహారం చెల్లించారు. 4,164 క్రిమినల్ కేసులు, 5 ప్రీలిటిగేషన్ కేసులు, 13 బీఎస్ఎన్ఎల్ కేసులు పరిష్కరించినట్టు తెలిపారు. హనుమకొండ జిల్లా పరిధిలో 39 సివిల్ కేసులు, 24 మోటారు ప్రమాద బీమా కేసులు పరిష్కరించి బాధితులకు రూ.1,13,75,000 నష్టపరిహారం అందించినట్టు న్యాయమూర్తులు తెలిపారు. 3455 క్రిమినల్ కేసులు, 7 బీఎస్ఎన్ఎల్ కేసులు కూడా పరిష్కరించారు.

అంతకుముందు ఉదయం 10.30 గంటలకు న్యాయసేవా సంస్థ భవన్‌లో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని హనుమకొండ, వరంగల్ జిల్లా జడ్జిలు ప్రారంభించారు. హనుమకొండ జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి ఉపేందర్ రావు, వరంగల్ జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి సాయికుమార్, హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్, అదనపు జిల్లా జడ్జిలు, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు ఎలుకుర్తి ఆనంద్ మోహన్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, న్యాయవాదులు, వివిధ బ్యాంకు ఇన్సూరెన్స్ అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.



లోక్‌అదాలత్‌ను ప్రారంభిస్తున్న వరంగల్ జిల్లా జడ్జి రాధాదేవి

'మానుకోట'లో పొలిటికల్ హీట్

(5వ పేజీ తరువాయి)

ములుగు మొదలుకుని నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు, పినపాక, భద్రాచలం వరకు మొత్తం ఏడు ఏజెన్సీ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉంది. అయితే ప్రచార వ్యవధికాలానికి ఒకట్రెండురోజుల ముందే ఆయా నియోజకవర్గాలను చుట్టి రావడంతో పాటు అన్ని వర్గాల ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేసేందుకు నేతలు సమాయత్తమవుతున్నారు. తమ పార్టీల అగ్రనేతల సభలు, రోడ్‌షోల నిర్వహణకు కసరత్తు చేసుకుంటున్నారు. ముందస్తుగానే అసెంబ్లీ నియోజవర్గాల వారీగా పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక సమావేశాలను నిర్వహిస్తున్నారు. తొలుత పార్టీ టికెట్ ఖరారు చేసుకున్న సిట్టింగ్ బీఆర్ఎస్ ఎంపీ మాలోతు కవిత తన తండ్రి, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ సొంత నియోజకవర్గంలోని మరిపెడ నుంచి ప్రచారం ఆరంభించారు. కాంగ్రెస్ రెండవ జాబితాలో చోటు దక్కించుకున్న కేంద్రమాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ రెండ్రోజుల కిందట మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధి భద్రాచలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమానికి హాజరై తన ప్రచార పర్వానికి అక్కడి నుంచే శ్రీకారం చుట్టారు. తాజాగా బీజేపీ అభ్యర్థి, మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్ నర్సంపేట నియోజకవర్గం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టి గూడూరు మీదుగా డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో శనివారం పర్యటించారు. అయితే ఈ ముగ్గురు పార్లమెంట్ నియోజకవర్గానికి పాత ముఖాలే కావడంతో తమతమ హయాంలో చేసిన అభివృద్ధిని చెప్పుకోవడంతో పాటు పరిచయాలతో ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

కోడ్‌తో సామాన్యులకు సంకటమే..

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతోనే ఎన్నికల కోడ్ శనివారం నుంచే అమల్లోకి రావడం, సుమారు రెండునెలల పాటు ఈ కోడ్ అమల్లో ఉండనుండటంతో సామాన్యులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి. ఎవరైనా రూ.50వేల కంటే ఎక్కువ నగదుతో వెళ్లాల్సి వస్తే వాటికి సంబంధించిన సరైన ఆధారాలు చూపాలి. లేదంటే అధికారులు ఆ నగదును సీజ్ చేస్తారు. అయితే ప్రస్తుతం వివాహ శుభకార్యాల సమయం కావడం, ముఖ్యంగా ఏప్రిల్ 26 వరకు ఎక్కువ ముహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్లు, ఇతరత్రా శుభకార్యాలకు అవసరమైన బంగారం, దుస్తులు, ఇతర వస్తువులు ఖరీదు చేసేందుకు వధూవరుల బంధువర్గాలు ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. ఈ క్రమంలో అధిక మొత్తంలో నగదును తీసుకువెళ్లాల్సి ఉంటుంది. నగదు తీసుకువెళ్లకుండా ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేసే అవకాశాలున్నప్పటికీ ఆన్‌లైన్ విధానంలో చెల్లించే వాటి దుకాణాల వారు ట్రాన్సాక్షన్ చార్జీల పేరుతో వసూలు చేస్తుండటంతో చాలా మంది డబ్బు రూపంలోనే ఇచ్చేందుకు ఆసక్తి చూపుతుంటారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన వారికి డిజిటల్ చెల్లింపులపై అంతగా అవగాహన లేని వారు డబ్బును తీసుకెళుతుంటారు. అలాంటి వారికి ఎన్నికల కోడ్ తనిఖీలు కొంత సంకటంగా మారే అవకాశాలున్నాయి.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అధునాతన పద్ధతిలో

గర్భస్థ శిశువు తొలగింపు

వరంగల్ మెడికల్, మార్చి 16 : ఓ తల్లి గర్భంలో ముగ్గురు శిశువులు ఒకే అమ్నిమాటిక్ పొరతో కప్పబడి ఉండగా అత్యంత అధునాతన పద్ధతిలో ఒక శిశువును తొలగించినట్లు హనుమకొండలోని ఫీటల్ మెడిసిన్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ శిరీష శనివారం తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ.. వరంగల్‌లో మొట్టమొదటి సారిగా ఈవిధానంలో చికిత్స అందించామన్నారు. వరంగల్ శివనగర్ ప్రాంతానికి చెందిన 15 వారాల గర్భిణి గుగులోతు సంతోష (29) చికిత్స నిమిత్తం తమ వద్దకు వచ్చినట్లు తెలిపారు. ఈమె గర్భంలో ఒకే పొర కింద ముగ్గురు శిశువులున్నట్లు గుర్తించి పొటాషియం క్లోరైడ్ ఇంజనక్షన్‌తో ఒక శిశువును తొలగించే అవకాశం ఉన్నప్పటికీ అది సాధ్యం కాలేదన్నారు. కొన్ని ఇంజక్షన్లు ఇవ్వడం వల్ల ముగ్గురు శిశువులు చనిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కష్టమైన కేసులో ముంబై నుంచి ఓ ప్రత్యేకమైన లేజర్ మిషన్ తెప్పించి క్లిష్టమైన అరుదైన శస్త్రచికిత్సను హనుమకొండలో నిర్వహించామన్నారు. హైదరాబాద్ నగరంలో ఇలాంటి కేసులు ఒకటి రెండు మాత్రమే జరిగాయని తెలిపారు. హైదరాబాద్ నగరంలో 75వేల నుంచి రూ.90వేల వరకు ఖర్చు కానుండగా, హనుమకొండలో మాత్రం రూ.35వేలకే చికిత్స అందించామని తెలిపారు. ప్రస్తుతం గర్భిణితో పాటు ఇద్దరు శిశువులు క్షేమంగా ఉన్నట్లు ఫీటల్ మెడిసిన్ వైద్యురాలు డాక్టర్ శిరీష వెల్లడించారు.

కాంగ్రెస్ చేరికలు

జూలైవాడ, మార్చి 16: గ్రేటర్ 49వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎండి.సమద్ ఆ పార్టీకి రాజీనామా చేసి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుతోపాటు కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్‌లో చేరినట్లు సమద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అజీజ్‌ఖాన్, మాజీ కార్పొరేటర్ అబుబక్కర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న సమద్

ఎన్నికల నిబంధనలు పాటించండి

●బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ●ఎన్నికల నియమావళిపై అధికారులకు అవగాహన కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, మార్చి 16: లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే అధికారులు ఎన్నికల నిబంధనలు పాటించాలని బల్దియా కమిషనర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. శనివారం గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కౌన్సిల్ కార్యాలయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్)పై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ అధికారులకు పలు సూచనలు చేసి మాట్లాడారు.

ఎన్నికల కోడ్ ప్రకటించిన 24 గంటలలోపు బల్దియా నియోజకవర్గాల పరిధిలోని ప్రభుత్వ విశ్రాంత గృహాలు, పాఠశాలలు, విద్యాసంస్థలపై ఉన్న వివిధ పార్టీల జెండాలు, బ్యానర్లు, వాల్‌పోస్టర్లు, పెయింటింగ్‌లు వెంటనే తొలగించేందుకు అధికారులు అప్రమత్తం కావాలన్నారు. 48 గంటలలోపు పబ్లిక్ స్థలాల్లో ఉన్న వివిధ పార్టీకు చెందిన వాల్‌పెయింటింగ్స్‌పై అధికారులు సిబ్బందితో కలిసి సున్నాలు వేయించాలని సూచించారు. సీఎంహెచ్‌వో, శానిటరీ సూపర్‌వైజర్ల సమన్వయంతో గోడలపై రాతలను తొలగించాలని ఆదేశించారు. బిల్‌కలెక్టర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ జవాన్‌లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు ఒక యూనిట్‌గా ఏర్పడి ఎన్నికల విధులు నిర్వర్తించాలన్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని అన్నారు. వీరిపై అసిస్టెంట్ సిటీ ప్లానర్, డిప్యూటీ కమిషనర్‌ల పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. ఎన్నికల సమయంలో సమస్యలు ఎదురైతే ఉన్నతాధికారులకు సమాచారం చేరవేయాలని అన్నారు. బల్దియా పరిధిలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ రెండు మాసాల వరకు ఉంటుందని గుర్తు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఒక్క తూర్పు నియోజక వర్గం పరిధిలోనే 8వేల బ్యానర్లు తొలగించామని గుర్తు చేశారు. ఇంకా రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని, స్వాతంత్ర్య సమర యోధుల విగ్రహాలకు మినహాయింపు ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, సీఎంహెచ్‌వో రాజేశ్, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, డిప్యూటీ కమిషనర్ రవీందర్, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి

నగరంలో తక్షణమే హోర్డింగ్‌లు తొలగించాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

హనుమకొండ కలెక్టరేట్, మార్చి16: కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శనివారం వికాస్‌రాజ్ హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఎన్నికల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం నుంచే లోక్‌సభ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చినందున నగరాల్లో ఉన్న పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లు, వివిధ రకాల ప్రచార సామగ్రి తక్షణమే తొలగించాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఫిర్యాదుల కమిటీని వెంటనే పని ప్రారంభించేలా చూడాలని, నివేదికలను ఎప్పటికప్పుడు పంపించాలన్నారు. ఎన్నికలకు సంబంధించి తప్పని సరిగా రూపొందించే సామగ్రిపై దృష్టి సారించాలని, నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు

ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులందరూ పోస్టల్ బ్యా లెట్ సౌకర్యం ఉపయోగించుకునే విధంగా ముందు నుంచే చర్యలు చేపట్టాలని, ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి తక్షణమే స్పందించాలని, కంట్రోల్ రూమ్ ఏర్పాటుతో పాటు ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీంలు వెంటనే పని ప్రారంభించాలన్నారు. ఎన్నికల షెడ్యూల్‌తో పాటు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివరాలను మీడియాతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలని, సువిధ ద్వారా ఇచ్చే అన్ని అనుమతులకు తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. శాంతి భద్రతలు, పోలింగ్ సిబ్బందికి శిక్షణ, బందోబస్తు ప్రణాళిక, ఎన్నికల వెబ్ పోర్టల్ అప్‌డేట్ చేయడం, నగదు, మద్యం సీజ్ చేయడం, ఎన్నికల ప్రవర్తనా నియామవళి తప్పకుండా అమలు చేయడం, ఎన్నికలపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడం వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సిక్తా పట్నాయక్, అడిషనల్ కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్ రెడ్డి, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, డీఆర్‌ఓ వై.వీ గణేష్, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, జడ్పీ సీఈఓ విద్యాలత, డీఆర్‌డీఓ నాగ పద్మజతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్ష తత్కాల్ ఫీజు గడువు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 16: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షల తత్కాల్ ఫీజు గడువును ఈనెల 21 వరకు పొడిగించినట్లు ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులు వారి సమీపంలోని మీసేవా, టీఎస్‌ఆన్‌లైన కేంద్రాల్లో ఫీజు చెల్లించాలని ఆయన కోరారు. టెన్త్‌కు తత్కాల్ ఫీజు రూ.500తో పాటు ప్రతీ సబ్జెక్టుకు రూ. 100 చెల్లించాలని, ఇంటర్‌కు తత్కాల్ ఫీజుతో రూ.1000తో పాటు ఒక్కో సబ్జెక్టుకు రూ.150 చెల్లించాలని ఆయన పేర్కొన్నారు.

మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలి

మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 16: అన్ని రంగాల్లో మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని మేయర్ గుండు సుధారాణి మహిళలకు సూచించారు. శనివారం నగర పాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో వరంగల్ నగర పాలక సంస్థ, మెప్మా సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరైన ఈ కార్యక్రమానికి మేయర్ గుండు సుధారాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆకాశాన్నితాకే తత్వం, గుణం మహిళలకే ఉంటుందని చెప్పారు. గతంలో మహిళా దినోత్సవం సందర్భంగా హెల్త్ క్యాంపులు, క్యాన్సర్ పరీక్షలు నిర్వహించామని గుర్తు చేశారు. మహిళలకు దశలవారిగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మహిళా సదస్సులో వరంగల్ బల్దియాకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి అనేక వరాలు కురిపించారని గుర్తు చేశారు. ఇంకా సంక్షేమ పథకాల అమలులో స్వయం సహాయక మహిళా బృందాలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎస్‌హెచ్‌జీ బృందాల సభ్యురాళ్లు ఆర్థికంగా ఎదగాలని అన్నారు. మెప్మా విభాగం తరఫున అధికారులు సహకారం అందించాలన్నారు. ప్రభుత్వం ఏ సంక్షేమ పథకాన్ని ప్రవేశపెట్టినా అధికారులు తప్పకుండా అమలు చేయాలన్నారు.

గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. మహిళా దినోత్సవ ప్రధాన ఇతివృత్తం 'ఇన్వెస్ట్ ఇన్ ఉమెన్ ఆక్సిలరేట్ ప్రోగ్రెస్ ' అన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు మహిళా మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఇద్దరు కలెక్టర్లు ప్రావీణ్య, సిక్తాపట్నాయక్‌లతో పాటు మేయర్ గుండు సుధారాణి, కమిషనర్‌గా తాను విధుల్లో ఉండడం చాలా సంతోషంగా ఉందన్నారు. స్వయం సహాయక మహిళా బృందాలు పొదుపు పాటించి ఆర్థికంగా ఎదగాలని సూచించారు.



క్రీడాపోటీలలో పాల్గొన్న మహిళా కార్పొరేటర్లు

అనంతరం రెండు రోజులు పాటు మహిళా కార్పొరేటర్లకు, మహిళా ఉద్యోగులకు నిర్వహించిన వివిధ క్రీడాంశాలలో విజేతలుగా నిలిచిన వారికి మేయర్, కమిషనర్‌ల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పల్లం పద్మ, ముష్కమల్ల అరుణ, తూర్పాటి సులోచన, దివ్యారాణి, జక్కుల రజిత, జన్ను షిబారాణి, గుజ్జుల వసంత, ఓరుగంటి అరుణకుమారి, గుండు చందన, బస్వరాజు శిరీష, రామ తేజశ్వి, బోగి సువర్ణ, మానస, ఈదురు అరుణ, జలగం అనిత జేఏవో సరిత పాల్గొన్నారు.

వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, మార్చి 16: వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుని అనుకున్న లక్ష్యాలను అధిగమించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. వరంగల్ పోలీస్, టీఎంఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను అంబర్ కిషోర్ ఝా ప్రారంభించారు. జాబ్ మేళాలో 25 కంపెనీలు పాల్గొని హాజరైన యువతకు సంబంధించిన విద్యార్హతలు పరిశీలించి నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. యువత వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతిభ కనబరిచి అనుకున్న లక్ష్యాలను అధిగమించాలన్నారు. ప్రపంచంలోని ఎందరో మేధావులు, వ్యాపారస్తులు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎదిగినవారేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ, టీఎంఐ ఫౌండేషన్ చైర్మన్ మురళీధరన్, ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, తిరుమల్, ఇన్‌స్పెక్టర్లు సతీష్, సంజీవ్, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా జాబ్‌మేళాకు 1,349 మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా 655మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. 164 మంది ఉద్యోగం పొందారు.



మాట్లాడుతున్న అంబర్ కిషోర్ ఝా

ప్రభుత్వ స్థలంలో గుడిసెలు

అడ్డుకున్న పోలీసులు, సీపీఎం నాయకుల అరెస్ట్

బచ్చన్నపేట, మార్చి 16: పేదలకు ఇళ్లస్థలాలను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం చిన్నరామన్‌చర్ల రెవెన్యూ శివారు గోపాల్‌నగర్ గ్రామ సమీపంలో పేదలు సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేశారు. గతంలో వివాదాస్పదంగా ఉన్న 174 సర్వే నంబర్ భూమిని ఇటీవల ప్రభుత్వం స్వాధీనపర్చుకుంటున్నట్టు ప్రకటించగా, ఆ స్థలాన్ని ఇళ్ల స్థలాలకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు సీపీఎం, ప్రజాసంఘాలు శనివారం ఉదయం ఆ స్థలంలో గుడిసెలు వేస్తుండగా విషయం తెలుసుకున్న ఎస్ఐ సతీష్ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. గత పరిస్థితుల దృష్ట్యా సీఆర్‌పీఎఫ్ బలగాలను రప్పించారు. ఏసీపీ దామోదర్‌రెడ్డితో పాటు సీఐ సాయిరమణ, తహసీల్దార్ విశాలాక్షి, ఎస్ఐలు, మహిళా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయడం చట్ట విరుద్ధమని, వెంటనే గుడిసెలు తొలగించాలని ఆదేశించారు. ఇందుకు వారు ససేమిరా అనడంతో నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, లేదంటే ఇబ్బందులు ఎదురవుతాయని నచ్చజెప్పేందుకు యత్నించారు. అయినప్పటికీ అక్కడి నుంచి కదలకపోవటంతో నాయకులు సుంచు విజేందర్‌తో పాటు, రామగళ్ల అశోక్, మణి, కర్రె ఉదయ్, మరికొందరిని అదుపులోకి తీసుకునే యత్నంలో తోపులాట జరిగింది. కొందరికి స్వల్ప గాయాలయ్యాయి.



సీపీఎం నాయకులు, గుడిసెలు వేసిన వారితో మాట్లాడుతున్న ఏసీపీ

పోలీసుల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. మహిళలపై మగపోలీసులు దూసుకు రావటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినప్పటికీ సీపీఎం నాయకులను అరెస్ట్‌చేసి నర్మెట పీఎస్‌కు తరలించారు. కాగా, మహిళలు అక్కడే ఉండి గుడిసెలు వేస్తుండగా పోలీసులు జీపీ సిబ్బంది సహాయంతో వాటిని తొలగించి మహిళలను అక్కడినుంచి పంపించారు. అనంతరం సీపీఎం నాయకులను వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ ఆందోళనలో గోపాల్‌నగర్‌తో పాటు పలు గ్రామాల పేదలు పాల్గొన్నారు.

అధికారులు సమిష్టి కృషితో పనిచేయాలి

• గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే • బల్దియా అధికారులతో సమీక్ష సమావేశం

వరంగల్ కార్పొరేషన్, మార్చి 16: గ్రేటర్ వరంగల్ పరిధిలో నివసిస్తున్న ప్రజలకు సేవలందించేందుకు సంబంధిత అధికారులు సమిష్టి కృషితో పని చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలో శనివారం వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. పారిశుధ్యం, ఇంజనీరింగ్, మంచినీటి సరఫరా, పట్టణ ప్రణాళిక అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా ప్రణాళికా బద్ధంగా విడుదల చేసి నీరు అందని ప్రాంతాల్లో ట్యాంకుల ద్వారా ప్రజలకు నీటిని అందించాలని చెప్పారు. ఓకేజీలను ఎప్పటికప్పుడు కట్టడి చేయడంతో పాటు పైప్‌లైన్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అన్నారు. ప్రతీరోజు అన్ని డివిజన్‌లలో పారిశుధ్య పనులు నిర్వహించాలని అన్నారు. ఇంటింటి నుంచి స్వచ్ఛ ఆటోల ద్వారా తడి, పొడి చెత్త సేకరణతో పాటు డంపింగ్ యార్డ్‌లకు చెత్తను తరలించాలన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ఈ యేడు వార్షిక లెక్కలకు పక్షం రోజుల మాత్రమే ఉన్నందున పన్నుల సేకరణపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. 100 శాతం పన్నులు చెల్లించేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఆస్తి పన్నుతో పాటు నీటి, ట్రేడ్ లైసెన్స్ పన్నులు కూడా త్వరితగతిన సేకరించాలన్నారు. త్వరలో విభాగాల వారిగా అధికారులతో కూలంకషంగా చర్చిస్తామని, అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, ఎస్ఈ కృష్ణారావు, సీఎం హెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఉప కమిషనర్ రవీందర్, ఈఈలు శ్రీనివాస్, సంజయ్‌కుమార్, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, డీఎఫ్ఓ శంకర్‌లింగం, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యం

మడికొండ, మార్చి 16: కాజీపేట మండలం కడిపికొండలో రూ.10లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రాజారపు స్వామి, సట్ల సదానందంగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు నర్మెట వెంకటరమణ గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గంగుల శ్రీనివాస్‌రెడ్డి, కాజీపేట మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కట్కూరి రమేష్, నాయకులు సుధాకర్‌గౌడ్, బత్తిని విజ్జగిరిగౌడ్, నర్మెట వేణుగోపాల్, జక్కుల సదానందం, ఆకారపు శివాజీ, బస్కె రవి, నాగపురి రాజయ్య, రుద్రోజు సంపత్, కన్నెబోయిన శంకర్, నక్కల రాజు పాల్గొన్నారు.

రూ.3.70కోట్ల పనులకు శంకుస్థాపన

ఐనవోలు: మండల పరిధిలోని గ్రామాల్లో రూ.3.70 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు శనివారం శంకుస్థాపన చేశారు. కొండపర్తిలో రూ.8.70 లక్షలతో సీసీ రోడ్లు, పంథిని(చింత కుంట క్రాస్)లో రూ.2.90 కోట్ల బీటీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. సుమారు రూ.3.70 కోట్లతో చేపడుతున్న పనులను నాణ్యతగా నిర్మించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే సూచించారు. అంతర్గత సీసీ రోడ్లు, గ్రామాల మధ్య బీటీ రోడ్ల నిర్మాణంతో ప్రజల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. సకాలంలో పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కడిపికొండలో డ్రైయినేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

చెత్త కుప్పలో శిశువు

వరంగల్ క్రైం, మార్చి 16: చెత్త కుప్పలో మగ శిశువు మృతదేహం లభ్యమైన సంఘటన సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీస్‌స్టేషన్ పరిధిలోని సహకారనగర్‌లో శనివారం ఉదయం జుబేదా బేగం అనే శానిటరీ జవాన్ చెత్త ట్రాక్టర్లోకి ఎత్తే క్రమంలో రెండు మూడురోజుల మగ శిశువు మృతదేహం కనిపించింది. శిశువును కుక్కలు తినడంతోపాటు కాలు ఊడిపోయి వాసన వస్తుండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఈ విషయాన్ని సీఐ సత్యనారాయణరెడ్డి ధ్రువీకరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వేలేరు(ధర్మసాగర్) మార్చి 16: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నట్టు ఎస్ఐ.హరిత శుక్రవారం తెలిపారు. వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన శివరాత్రి కొంరయ్య, ఇదే గ్రామ శివారు నుంచి ఇసుక లోడుతో బయలుదేరాడు. శాలపల్లి వద్దకు రాగానే పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండటంతో కేసునమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

మైనారిటీలకు ఉచిత శిక్షణ

వడ్డెపల్లి, మార్చి 16: తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమశాఖ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో యూపీఎస్‌సీ- సీఎస్ఏటీ - 2025 పరీక్ష కోసం 2024 - 25 విద్యాసంవత్సరంలో మైనారిటీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్‌ను ఇవ్వనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి మేన శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు రిజర్వేషన్ల నిబంధనల ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33శాతం సీట్లు, అన్ని రిజర్వ్ కేటగిరిలలో వికలాంగులకు 5 శాతం సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్‌లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులందరూ ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపాదికన ఉంటుందని పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీ అభ్యర్థులు ఈ నెల 16 నుంచి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించబడుతాయని తెలిపారు. ఏప్రిల్ 12లోగా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. స్క్రీనింగ్ టెస్టు ఏప్రిల్ 28న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12. 30 గంటల వరకు జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు ఫోన్ నంబర్ 040-23236112లో సంప్రదించాలని మేన శ్రీను కోరారు.

దాణా మిషన్‌లో పడి బాలుడి మృతి

వేలేరు(ధర్మసాగర్), మార్చి 16 : పశువుల దాణా మిషన్‌లో పడి బాలుడు మృతి చెందిన ఘటన వేలేరు మండలం మద్యలగూడెంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై హరిత తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రంలోని బిషన్‌పూర్ గ్రామానికి చెందిన దిలీప్ పాశ్వాన్, అతడి భార్య రాధతో పాటు ఐదుగురు కుటుంబసభ్యులు బతుకుదెరువుకోసం మద్యలగూడెం గ్రామంలోని లక్ష్మీనర్సింహా కోళ్ల ఫామ్‌లో పనిచేయడానికి వచ్చారు. ఏడాదిగా ఇదే కోళ్ల ఫామ్‌లో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో రోజువారిగా దిలీప్ పాశ్వాన్ తన కొడుకు అభిరాజు (3)ను తీసుకొని కోళ్లకు దాణా పోస్తున్నాడు. అక్కడే ఉన్న దాణా మిషన్ మీద అభిరాజును కూర్చోబెట్టి పనిచేస్తున్నాడు.

మిషన్ మీద కూర్చున్న అభిరాజ్.. ప్రమాదవశాత్తు దాణా మిషన్‌లో పడి ఊపిరి ఆడక మృతిచెందాడు. కోళ్లకు దాణా పోసిన అనంతరం దిలీప్ వచ్చి చూడగా బాలుడు మృతి చెంది ఉండడాన్ని గమనించాడు. కన్నీరుమున్నీరుగా విలపించి కుటుంబసభ్యులు, చుట్టు పక్కల వారికి తెలుపడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి బాలుడి మృతదేహాన్ని ఎంజీఎంకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భద్రకాళి మాడవీధుల నిర్మాణం పనులు ప్రారంభం

వరంగల్ కల్చరల్, మార్చి 16: ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న శ్రీభద్రకాళి అమ్మవారి దేవాలయానికి మాడ వీధుల నిర్మాణం, రాజగోపురాల పనులను శనివారం పండితుల సూచనల మేరకు అభిజిత్ లగ్నంలో మధ్యాహ్నం 12 గంటలకు గణపతి పూజ, పుణ్యావచనం, వాస్తు మండల ఆరాధన జరిపి కాతాహుజనం శిలాన్యాసనం జరిపి పనులు ప్రారంభించారు. 'కుడా' పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, ఆలయ ఈవో శేష భారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషులు పూజ చేసి పనులు ప్రారంభించారు. భద్రకాళి శేషు మాట్లాడుతూ మూడు రోజుల క్రితం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చొరవతో హైదరాబాద్ సచివాలయంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ కమిషనర్ పలు ముఖ్య శాఖల కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేయబడిందని మాడ వీధుల నిర్మాణానికి ఉన్న చిక్కులన్నీ తొలిగిపోయాయన్నారు. దీంతో వెంటనే పనులు ప్రారంభించాల్సిందిగా మంత్రులు కొండా సురేఖ, శ్రీనివాస్‌రెడ్డిలు కుడా అధికారులను ఆదేశించినట్టు పేర్కొన్నారు. ఈ క్రమంలో శనివారం పనుల ప్రారంభ పూజలు జరిపినట్టు పేర్కొన్నారు.



మాడ వీధుల నిర్మాణం పనులను ప్రారంభిస్తున్న అధికారులు, అర్చకులు

వాస్తవంగా పశ్చిమ ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా పనులకు ప్రారంభించాల్సి ఉండగా ఎన్నికల నోటిఫికేషన్ వస్తే పనులు ప్రారంభించడానికి ఆలస్యమవుతుందన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులచే ప్రారంభించాల్సిందిగా మంత్రి, ఎమ్మెల్యేలు అధికారులకు ఆదేశించారు. భక్తుల జయజయ ధ్వనాల మధ్య పనులు ప్రారంభమయ్యాయి.

చైతన్యపురి శ్రీ వేంకటేశ్వరాలయంలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కాజీపేట టౌన్, మార్చి 16: కాజీపేట చైతన్యపురిలో వెలసిన శ్రీ వేంకటేశ్వరాలయంలో మార్చి 17 నుంచి 22 వరకు 22వ బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఈ బ్రహ్మోత్సవాలకు చైతన్యపురితో పాటు ప్రశాంత్‌నగర్, సిద్ధార్థనగర్, బ్యాంక్‌కా లనీ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ కార్యవర్గ అధ్యక్షుడిగా పంజాల అశోక్‌కుమార్, ఉపాధ్యక్షులుగా వెంకటమల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మేజర్ వడ్డెపల్లి నరేందర్, సహాయ కార్యదర్శులుగా తిరునగిరి దిలీప్‌కుమార్, శనిగరపు సుజాత, పెద్ది అశోక్‌కుమార్, గౌరవ సలహాదారులుగా డాక్టర్ రాచర్ల శంకరయ్య, వంగాల సత్యనారా యణరెడ్డి, ర్యావర్గ సభ్యులుగా రాచర్ల మదులత, పిట్ల వెంకటేశ్వర్లు, డాక్టర్ సాదు రవిచంద్ర, పెద్ది అంజనేయులు, మొగుళ్ళ శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల రాజన్నగౌడ్, శీలం సమ్మయ్య, ఎక్స్ అఫీషియో సభ్యులుగా బొడ్డ వీరయ్య, గుండపు రవీందర్, శనిగరపు రాజ్‌మోహన్‌లు వ్యవహరిస్తున్నారు.



విద్యుత్ దీపాలతో విరాజిల్లుతున్న శ్రీ వెంకటేశ్వరాలయం

రక్తదాన శిబిరం

కాజీపేట, మార్చి 16 : కాజీపేట ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ ఈఎల్ఎస్ కాజీపేట బ్రాంచి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రైల్వే కమ్యూనిటీ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. అసోసియేషన్ బ్రాంచ్ సెక్రటరీ కుర్సపల్లి రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, కాంగ్రెస్ జాతీయ నాయకురాలు గొట్టిముక్కల సాగరిక రమాకాంత్ ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేసి రక్తదాన శిబిరాన్ని పారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైల్వే నాయకులు ఇలాంటి సామాజిక కార్యక్రమలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రతీఒక్కరు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రైల్వేలో పనిచేస్తున్న మహిళల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అనంతరం 70 మంది రక్తదానం చేశారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అసోసియేషన్ సభ్యులు 80 మంది మహిళలకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌ఆర్ఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్ర యాదవరెడ్డి, ఏఐజీడీఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు, అసోసియేషన్ నాయకులు మాధవరావు, సంజీవ, విజయ్ కుమార్, కిషన్, రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.



మహిళలను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారావు

సుజనాదేవికి తెలుగు కీర్తి పురస్కారం

హనుమకొండ కల్చరల్, మార్చి 16: హనుమకొండకు చెందిన ప్రముఖ రచయిత్రి నామాని సుజనాదేవికి తెలుగు కీర్తి పురస్కారం వరించింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఈ నెల 21న ప్రదానం చేయనున్న తెలుగు కీర్తి పురస్కారాల జాబితాలో ఉత్తమ రచయిత్రి విభాగంలో నామాని సుజనాదేవికి పురస్కారం దక్కింది. ఈమె వృత్తిరిత్యా జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ)లో అధికారిగా పనిచేస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా కథలు, కవితలు, వ్యాసాలు, నవలలు తదితర సాహిత్య ప్రక్రియల్లో సుజనాదేవి చేస్తున్న కృషికి ఈ పురస్కారం ప్రకటించారు. ఈ సందర్భంగా సుజనాదేవి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఆరు కథా సంపుటాలు, మూడు కవిత సంపుటాలు, ఒక నవల వెలువరించారు. అంతేగాక సుజనాదేవి రాసిన నాలుగు నవలలు వారపత్రికల్లో సీరియల్‌గా రావడం గర్వకారణం. ఇప్పటి వరకు 325కు పైగా కథలు, కవితలు ప్రముఖ పత్రికల్లో ప్రచురించారు. ఇప్పటి వరకు 30కి పైగా పురస్కారాలు ఆమె అందుకున్నారు. కీర్తి పురస్కారం కింద రూ.5వేల నగదు, దుశ్శాలువా, జ్ఞాపిక బహుకరించనున్నారు.

'ఎన్నికల బాండ్ల' రద్దు తీర్పు హర్షణీయం

- పార్టీలకు విరాళాలను డిజిటల్ రూపంలో ఇవ్వాలి
- 2014 తర్వాత గో రక్షణ పేరుతో మూక దాడులు: జస్టిస్ సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల (ఎలక్టోరల్) బాండ్లను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు హర్షణీయమని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డి కొనియాడారు. దీనిని ఈ మధ్య కాలంలో దేశ అత్యున్నత న్యాయస్థానం నుంచి వెలువడిన గొప్ప తీర్పుగా అభివర్ణించారు. రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "ఫ్రీ అండ్ ఫెయిర్ ఎలక్షన్స్ ట్రాన్సపరెన్సీ ఇన్ ఎలక్టోరల్ బాండ్ స్కీమ్" అనే అంశంపై సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎలక్టోరల్ బాండ్లను ఎవరు ఎవరికెంతిచ్చారో అనే విషయాన్ని కూడా బహిర్గతం చేసే విధంగా ఈ కేసును సుప్రీం కోర్టు పూర్తిగా తన పరిధిలో విచారించాలని అభిప్రాయపడ్డారు. ఎన్నికల బాండ్ల రద్దు వల్ల నల్లధనం ప్రభావం పెరుగుతోందని అమిత్ షా అన్న మాటలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. అలా జరగకుండా ఉండాలంటే.. రాజకీయ పార్టీలకు విరాళాలను డిజిటల్ రూపంలో ఇచ్చేలా నిబంధనలు రూపొందించాలని సూచించారు. 2014 తర్వాత దేశంలో గో రక్షణ పేరుతో మూక దాడులు, 'బుల్డోజర్ జస్టిస్' లాంటి విపత్కర పరిణామాలను చూశామంటూ ఆందోళన వ్యక్తం చేశారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతుండగా సభలో "అంతా రామ మయం" కాలర్ రింగ్ టోన్ మోగగా "అవును! ఇప్పుడు దేశమంతా రామమయమే వినిపిస్తోంది" అంటూ ఆయన సందర్భానుసారంగా చమత్కరించారు. కార్పొరేటర్లు ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసేలా ఎన్నికల బాండ్ల విధానం ఉందని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె. వేణుగోపాల్ అన్నారు. ఎన్నికల బాండ్ల గుర్తింపు సంఖ్యలను కూడా ఎస్‌బీఐ బహిర్గతం చేయాలన్నారు. తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది జి. విద్యాసాగర్ సభాధ్యక్షత వహించారు.

తెలుగువాడిగా ఆంధ్రకు అండగా ఉంటా

భౌగోళికంగా రెండు రాష్ట్రాలుగా విడిపోయినా.. తెలుగువారికి అన్యాయం జరిగితే కలిసి పోరాడాలి

- విశాఖ ఉక్కు దరిదాపుల్లోకి కూడా ఎవరినీ రానివ్వం
- నీలం, ఎన్టీఆర్, వైఎస్ ఏలిన గడ్డ ఇది
- ఆంధ్రులకు అన్యాయం జరిగితే ఢిల్లీని వారు నిలదీశారు
- ఇప్పుడు అందరూ వంగి ఢిల్లీకి నమస్కారాలు చేసేవాళ్లే..
- విశాఖ 'ఉక్కు' సభలో సీఎం రేవంత్


విశాఖ సభలో షర్మిల, రేవంత్

విశాఖపట్నం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సాటి తెలుగువాడిగా ఏపీ ప్రజలకు తాను అండగా ఉంటానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఎప్పుడు ఏ కష్టం వచ్చినా, ఏమి కావాలన్నా తనను అడగాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల అండదండలు ఉన్నప్పటికీ ప్రశ్నించే గొంతుకలు మూగబోయాయన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, జగన్ పాలకులు కావాలనుకుంటున్నారే తప్ప.. ప్రశ్నించే గొంతుకలు కావాలనుకోవడం లేదని విమర్శించారు. ఏపీ నాయకులకు ప్రశ్నించే తత్వం లేనందునే ఈ రాష్ట్రం విడిపోయి పదేళ్లయినా పోలవరం పూర్తి కాలేదనీ, ప్రత్యేక హోదా రాలేదనీ, అమరావతి రాజధాని నిర్మాణం జరగలేదనీ అన్నారు. ఢిల్లీ వెళ్లి వంగి వంగి నమస్కారాలు పెట్టేవారున్నారు తప్ప ఏపీలో ప్రధాన మంత్రి మోదీని నిలదీసే నాయకులు ఎవరూ లేరని వ్యాఖ్యానించారు. శనివారం రాత్రి విశాఖ ఉక్కునగరంలోని తృష్ణా మైదానంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ న్యాయ సాధన సభకు రేవంత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భౌగోళికంగా రెండు రాష్ట్రాలుగా విడిపోయినా తెలుగు వారికి ఎక్కడ అన్యాయం జరిగినా అందరూ కలిసి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అదానీకి ప్రధాని మోదీ విక్రయిస్తుంటే పహిల్వాన్‌లమని చెప్పుకొంటున్న నాయకులు ప్రశ్నించడం లేదని విమర్శించారు. కలిసి పోరాడితే ఢిల్లీలో సుల్తాన్‌లు, జాగీరుదారులు, పాలకులు ఎవరైనా తల వంచాల్సిందేనన్నారు.

అందరూ మోదీ చంకెక్కేవారే..

"ఆంధ్రప్రదేశ్‌లో మోదీకి సొంత బలం, బలగం లేవు. ఇక్కడున్న ప్రాంతీయ పార్టీల నాయకులే ఆయనకు అన్నీ. బీజేపీ అంటే బాబు, జగన్, పవన్. వారిలో ఎవరు గెలిచినా ఢిల్లీ వెళ్లి మోదీ చంకెక్కుతారేగానీ, ఆయనను నిలదీసే పరిస్థితి ఉండదు. మోదీని ఆంధ్రప్రదేశ్ నుంచి నిలదీసే నాయకులు కావాలి" అని రేవంత్ అన్నారు. రాజశేఖర్‌రెడ్డి తన జీవితకాలంలో ఎన్నడూ బీజేపీతో అంట కాగలేదని, లౌకికవాద శక్తులకు అండగా ఉన్నారని తెలిపారు. ఇప్పుడు వైఎస్ వారసులమని చెప్పుకొంటున్న వ్యక్తులు మతోన్మాద శక్తులకు అండగా ఉంటున్నారని ఆరోపించారు. మణిపూర్‌లో మారణకాండపై ఇక్కడి పాలకుడు మౌనం పాటిస్తే, ఒక్క షర్మిల మాత్రమే ఆ విషయం ప్రస్తావించారని గుర్తు చేశారు. మోదీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గోధ్రాలో జరిగిన మారణకాండను నాడు ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిలదీశారని తెలిపారు. మతోన్మాద శక్తులకు వత్తాసు పలికే వ్యక్తులెవరూ వైఎస్ వారసులు కాబోరని, షర్మిలే వైఎస్ రాశేఖర్‌రెరెడ్డి వారసురాలని అన్నారు. "ఆంధ్రప్రదేశ్‌లో షర్మిల మడమ తిప్పని పోరాటాలు చేస్తారు. తప్పకుండా ఇక్కడ కాంగ్రెస్ జెండా పాతి తీరుతారు. భవిష్యత్తులో షర్మిల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అవుతారు" అని రేవంత్ వ్యాఖ్యానించారు. తెలంగాణలో అటు మోదీకీ, ఇటు కేడీలకూ చెక్ పెట్టామని తెలిపారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కేవలం 3,500 ఓట్లు వచ్చాయని, మోదీ, కేడీలు ఉన్నందున తెలంగాణలో కాంగ్రెస్ బతకడం కష్టమని అందరూ అనుకున్నారని, కానీ.. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో 65 స్థానాలు గెలుచుకున్నామని గుర్తు చేశారు. ఇదిలా ఉండగా.. సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం మహారాష్ట్రకు వెళ్తున్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన 'భారత్ జోడో న్యాయ్‌యాత్ర'కు రేవంత్ హాజరుకానున్నారు. ఇక ఈనెల 19న కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ ఢిల్లీలో సమావేశం కానుంది. ఆరోజే తెలంగాణలోని మిగిలిన అన్ని పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసే అవకాశం ఉంది.

ఏం సాధించారని 'సిద్ధం'?: షర్మిల

ఎన్నికలు వస్తున్న తరుణంలో జగన్ సిద్ధం అంటూ బయలుదేరారని, సీఎంగా ఏం సాధించారని చెప్పడానికి జనంలోకి వెళుతున్నారని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. 'సిద్ధం' అనే పదం కోసం రూ.600 కోట్లు ఖర్చు చేశారని, రాష్ట్రంలో ఎక్కడ చూసినా సిద్ధం పోస్టర్లు పెట్టారని, ఒక్కొక్క సభకు రూ.90 కోట్లు ఖర్చు చేశారని విమర్శించారు. ఇంతా చేసి ఆయన రాష్ట్రాన్ని సర్వనాశనం చేసినందుకు 'సిద్ధం' అంటూ బయలుదేరారా? అని నిలదీశారు. వచ్చే ఎన్నికల్లో మిమ్మల్ని ఇంటికి పంపేందుకు జనం సిద్ధంగా ఉన్నారు అని వ్యాఖ్యానించారు.



కవిత అరెస్టుపై బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

- జిల్లాల్లో రాస్తారోకోలు.. మోదీ దిష్టిబొమ్మల దహనం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆందోళనలు నిర్వహించారు. ప్రధాని మోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలుచోట్ల ధర్నాలు, రాస్తాలు చేశారు. వర్ధన్నపేటలో రాస్తారోకోలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు. బీజేపీ కుట్రపూరిత రాజకీయాలు చేస్తోందని ఆయన ఆరోపించారు. భూపాలపల్లిలో రాస్తారోకో చేస్తు న్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సహా పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో హైదరాబాద్-వరంగల్ హైవేపై నిర్వహించిన ధర్నాలో ఎమ్మెల్యే కడియం పాల్గొన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నిరసనలు కొనసాగా యి. నిజామాబాద్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి, డిచ్‌పల్లి, ధర్పల్లి, కోటగిరి, కామారెడ్డి, నిజాంసాగర్ చౌరస్తా తదితర ప్రాంతాల్లోనూ ఆందోళన చేశారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు రాజకీయ కక్షతోనే కవితను అరెస్ట్ చేశారని ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నిర్వహించిన ఆందోళనల్లో బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. నల్లగొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, తుంగతుర్తి, తిరుమలగిరి, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, భువనగిరిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా శనివారం ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. కరీంనగర్, మానకొండూర్, సైదాపూర్, రామడుగు, హుజూరాబాద్‌లో ధర్నా నిర్వహించారు. సిరిసిల్లలో మోదీ దిష్టిబొమ్మ దహనం చేసే సమయంలో బీఆర్ఎస్ కార్యకర్త సాయికి మంటలు అంటుకొని గాయాలయ్యాయి. ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా నియోజకవర్గ, మండలకేంద్రాల్లో ర్యాలీలు, రాస్తారోకోలు చేపట్టారు. పార్టీ నేతలు, కార్యకర్తలు నల్లకండువాలు ధరించి నిరసన తెలిపారు. మహబూబ్‌నగర్, జడ్చర్లలో, జోగుళాంబ గద్వాల జిల్లా, వనపర్తి, కొత్తకోట, గోపాల్‌పేట, కల్వకుర్తిలోనూ బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు.

దిక్సూచి
DIKSUCHI

నోటిఫికేషన్స్

ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌జేసీ సెట్

హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్)- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ జూనియర్ గురుకుల కళాశాలల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. సంస్థ నిర్వహించే రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఎంజేపీటీబీసీడబ్ల్యూ ఆర్‌జేసీ సెట్) 2024 ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

తెలంగాణ బీసీ గురుకులాల వివరాలు: రాష్ట్రంలోని 261 బీసీ జూనియర్ గురుకుల కళాశాలల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. వీటిలో బాలురకు కేటాయించిన 130 కళాశాలల్లో మొత్తం 11360 సీట్లు; బాలికలకు కేటాయించిన 127 కళాశాలల్లో మొత్తం 10560 సీట్లు ఉన్నాయి. నాలుగు 'కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ)' గురుకులాలు ఉన్నాయి. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూప్‌లతోపాటు ఒకేషనల్ కోర్సులు - అగ్రికల్చర్ అండ్ క్రాప్ ప్రొడక్షన్, కంప్యూటర్ గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్, ప్రీ స్కూల్ టీచర్ ట్రెయినింగ్, కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఫిజియోథెరపీ, టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కూడా అందుబాటులో ఉన్నాయి. ఆసక్తిగల అభ్యర్థులకు ఐఐటీ, నీట్, ఎంసెట్, సీఏ/సీపీటీ, క్లాట్ కోచింగ్ ఇస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. డిజిటల్ క్లాస్‌లు ఉంటాయి.

సెట్ వివరాలు: దీనిని 150 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ఒకేషనల్ కోర్సులు సహా అన్ని గ్రూప్‌ల అభ్యర్థులకు ఇంగ్లీష్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఎంపీసీ అభ్యర్థులకు మేథమెటిక్స్, ఫిజికల్ సైన్స్; బైపీసీ అభ్యర్థులకు బయలాజికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్; ఎంఈసీ, సీఈసీ, హెచ్‌ఈసీ అభ్యర్థులకు మేథమెటిక్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఒకేషనల్ కోర్సుల్లో సీజీఏ, పీఎస్‌టీటీ, సీజీటీ కోర్సులకు మేథమెటిక్స్, సోషల్ స్టడీస్ నుంచి; ఏసీపీ, టీ అండ్ హెచ్ కోర్సులకు బయలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ నుంచి; ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ, పీటీ కోర్సులకు బయలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో సబ్జెక్ట్ నుంచి 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ పదోతరగతి స్థాయిలోనే ఉంటాయి. ప్రశ్నపత్రం ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఉంటుంది. విద్యార్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. గ్రూప్ కోర్సులకు జిల్లాస్థాయి మెరిట్ ప్రకారం, ఒకేషనల్ కోర్సులకు రాష్ట్ర స్థాయి మెరిట్ ప్రకారం ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.



- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 12
- **సెట్ 2024 తేదీ:** ఏప్రిల్ 28
- **వెబ్‌సైట్:** mjptbcwreis.telangana.gov.in

ఏపీ ఈసెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(ఏపీఎస్‌సీహెచ్‌ఈ)- స్టేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీఈసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

అర్హత: స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (టీఎస్/ఏపీ) నుంచి ఇంజనీరింగ్/ టెక్నాలజీ/ఫార్మసీ విభాగాల్లో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా మూడేళ్ల బీఎస్సీ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏపీ ఈసెట్ 2024 వివరాలు: పరీక్ష సమయం మూడు గంటలు. మొత్తం మార్కులు 200.

- ఇంజనీరింగ్ డిప్లొమా అభ్యర్థులకు నిర్వహించే పరీక్షలో మేథమెటిక్స్ నుంచి 50, ఫిజిక్స్ నుంచి 25, కెమిస్ట్రీ నుంచి 25, సంబంధిత ఇంజనీరింగ్ విభాగం(సివిల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ మెకానికల్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ కంప్యూటర్ సైన్స్/ కెమికల్/ మెటలర్జికల్/మైనింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్)నుంచి 100 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- బీఎస్సీ(మేథమెటిక్స్) అభ్యర్థులకు మేథమెటిక్స్ నుంచి 100, అనలిటికల్ ఎబిలిటీ నుంచి 50, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ నుంచి 50 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.
- ఫార్మసీ అభ్యర్థులకు ఫార్మాస్యూటిక్స్, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఫార్మకాగ్నసీ, ఫార్మకాలజీ అంశాలనుంచి ఒక్కోదానిలో 50 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; బీసీ అభ్యర్థులకు రూ.550; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **ఏపీ ఈసెట్ 2024 తేదీ:** మే 8

ఏయూ ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ టెస్ట్

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ(ఏయూ)- ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏయూఈఈటీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా బీటెక్ (సెల్ఫ్ సపోర్ట్ మోడ్) డిగ్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన తరవాత మరో రెండేళ్లు చదివి ఎంటెక్ డిగ్రీ పొందే వీలుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆంధ్ర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో మొత్తం 510 సీట్లు ఉన్నాయి. వీటిలో కంప్యూటర్ సైన్స్ 360, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ 60, మెకానికల్ 30, సివిల్ 30, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అర్హులు.

ఏయూఈఈటీ 2024 వివరాలు: పరీక్షని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. మేథమెటిక్స్ నుంచి 40, ఫిజిక్స్ నుంచి 30, కెమిస్ట్రీ నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం గంటన్నర. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 24
- **ఏయూఈఈటీ 2024 తేదీ:** మే 5
- **వెబ్‌సైట్:** www.andhrauniversity.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/cza15Pvలో చదవండి.



కష్టమైనా ఇష్టంతో చేశా

నటి అనుశ్రీ

బాబీ సింహా, మకరంద్ దేశ్ పాండే, అనుశ్రీ ప్రధాన పాత్రల్లో యాట సత్యనారాయణ దర్శకత్వంలో, గూడూరు నారాయణ రెడ్డి నిర్మించిన చిత్రం 'రజాకార్'. ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రానికి మంచి స్పందన వస్తోంది. ఈ నేపథ్యంలో అనుశ్రీ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు. 'రజాకార్' ఈ నేల కథ. సినిమాకి వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ప్రేక్షకులు చాలా ఎమోషనల్ అవుతున్నారు. సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకుల కళ్ళలో దేశభక్తి కనిపించింది. వందేమాతరం, భారత్ మాతాకీ జై అనే నినాదాలు థియేటర్స్‌లో మార్మోగడం చూసి, ఇలాంటి సినిమాలో భాగమైనందుకు ఆనందంగా అనిపించింది. ఈ చిత్రంలో నిజాం భార్యగా కనిపించా. కథ చెప్పినపుడు ఈ పాత్ర పోషించడం సవాల్‌గా అనిపించింది. ఈ పాత్ర కోసం మూడు నెలలు పాటు మెథడ్ ట్రైనింగ్ కూడా తీసుకున్నా. 'రజాకార్'లో నటించడం చాలా గొప్ప అనుభవం. చాలా మంది ప్రముఖ నటులతో కలసిపని చేసే అవకాశం దక్కింది. బాబీ సింహా, రాజ్ అర్జున్‌తో పాటు మకరంద్ దేశ్ పాండే లాంటి అద్భుతమైన యాక్టర్స్ తో స్క్రీన్ పంచుకోవడం గొప్ప అనుభూతి. మోడలింగ్ నుంచి కెరీర్ మొదలుపెట్టాను. 2018లో చత్తీస్‌ఘడ్ నుంచి మిస్ ఇండియా పోటీల్లో కూడా పాల్గొన్నాను" అని చెప్పారు.

ఫ్యామిలీ స్టార్ ప్యాకప్



విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న కుటుంబ కథా చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. పరశురామ్ దర్శకుడు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బేనర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. శనివారంతో ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా దర్శకుడు, హీరో హీరోయిన్లు కలసి దిగిన ఫొటోను మేకర్స్ విడుదల చేశారు.

వేసవిలో గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి



చీకటి ప్రపంచంలో సామాన్యుడి నుంచి అసామాన్యుడిగా ఎదిగిన ఓ వ్యక్తి కథతో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. 1960ల నాటి గోదావరి జిల్లాల నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో విశ్వక్‌సేన్ హీరోగా నటించారు. నేహా శెట్టి కథానాయికగా నటించగా, అంజలి మరో కీలక పాత్ర పోషించారు. మే 17న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్‌రాజా, రచన, దర్శకత్వం: కృష్ణ చైతన్య.

అందరికీ కనెక్ట్ అవుతుంది



క్రియేటివ్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ సమర్పణలో తెరకెక్కుతోన్న చిత్రం 'తులసివనం'. అక్షయ్, ఐశ్వర్య, వెంకటేష్ కాకమాను, విష్ణు ప్రధాన పాత్రల్లో నటించారు. అనిల్ రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ న్యూ ఏజ్ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ ప్రముఖ ఓటీటీ వేదికగా మార్చి 21 నుంచి ప్రసారం కానుంది. ఈ సందర్భంగా శనివారం చిత్ర బృందం ట్రైలర్‌ను లాంచ్ చేసింది. ఈ సందర్భంగా డైరెక్టర్ తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ "సినిమా చిత్రీకరణ విషయంలో క్లారిటీ చాలా ముఖ్యం. 'తులసివనం'లో ఆ క్లారిటీ వుంటుంది" అని అన్నారు. డైరెక్టర్ అనిల్ రెడ్డి మాట్లాడుతూ "ఇది అందరూ రిలేట్ చేసుకునే కథ" అని అన్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు: స్వాగత్ రెడ్డి, నీలిత పైడిపల్లి. సంగీతం: స్మరన్.

శ్రీశాంత్ విలన్‌గా యమధీర



కన్నడ ఇండస్ట్రీలోని ప్రముఖ నటుల్లో ఒకరైన కోమల్ కుమార్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'యమధీర'. ఇండియన్ క్రికెటర్ శ్రీశాంత్ ఇందులో నెగెటివ్ రోల్ పోషిస్తున్నారు. శంకర్ ఆర్ దర్శకత్వం వహిస్తున్నారు. వేదాల శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. నాగబాబు, ఆలీ, సత్య ప్రకాష్, మధు సూధన్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను ప్రముఖ నటుడు, ప్రొడ్యూసర్ అశోక్ కుమార్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ గారు మాట్లాడుతూ "శ్రీ మందిరం ప్రొడక్షన్స్‌లో తొలి చిత్రంగా వస్తున్న 'యమధీర' చాలా బాగా ఆడాలి. అలాగే మరెన్నో చిత్రాలు శ్రీ మందిరం ప్రొడక్షన్స్‌లో రావాలి. క్రికెటర్ శ్రీశాంత్ ఫాస్ట్ బౌలర్‌గా మైదానంలో చూపే దూకుడు ప్రతినాయకుడి పాత్రలో చూపించే అవకాశం ఉంది" అని అన్నారు. ప్రొడ్యూసర్ వేదాల శ్రీనివాస్ మాట్లాడుతూ "సినిమాల మీద ప్యాషన్ తో శ్రీమందిరం ప్రొడక్షన్స్ స్టార్ట్ చేశాను. ప్రేక్షకులు ఆదరిస్తారని కోరుకుంటున్నాను" అని అన్నారు. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు:వరుణ్ ఉన్ని

హే హలో.. నమస్తే!



తొలిసారిగా పతంగుల పోటీతో వస్తున్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా ఫిల్మ్ 'పతంగ్'. ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేశ్ కొత్తింటి నిర్మిస్తున్నారు, ప్రణీత్ ప్రతిపాటి దర్శకుడు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులోని ' హే హలో నమస్తే' లిరికల్ వీడియోను విడుదల చేశారు. దీనికి మంచి స్పందన వస్తున్న సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హీరో వంశీ పూజిత్ మాట్లాడుతూ 'అందరం కొత్తవాళ్లం నటించిన సినిమా ఇది. జోస్ జిమ్మి స్వరపరిచిన ఈ పాటకు రెస్పాన్స్ బాగుంది' అన్నారు. ఈ సినిమాకు కథే హీరో అని మరో కథానాయకుడు ప్రణవ్ కౌశిక్ చెప్పారు. గీత రచయిత శ్రీమణి మాట్లాడుతూ 'అందరం కలసి చేసిన కొత్త ప్రయత్నం ఇది. మా అందరికీ పేరు తెచ్చే సినిమా అవుతుంది' అని తెలిపారు. తన ప్రతిభను నిరూపించుకోవడానికి ఈ సినిమా ఒక మంచి అవకాశం అన్నారు సంగీత దర్శకుడు జోస్ జిమ్మి.

లవ్‌గురుగా విజయ్ ఆంటోనీ

తమిళ నటుడు విజయ్ ఆంటోనీ తొలిసారిగా రొమాంటిక్ ఎంటర్‌టైనర్ జానర్‌లో నటిస్తున్న సినిమా 'లవ్‌గురు'. మృణాళిని రవి కథానాయిక. వినాయక్ వైద్యనాథన్ దర్శకుడు. రంజాన్ సందర్భంగా ఏప్రిల్ 11న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ 'అమ్మాయిలను హ్యాండిల్ చేయడం అబ్బాయిలకు పెద్ద సమస్య. ఈ సినిమాలో నేను లవ్‌గురుగా కొన్ని టిప్స్ చెబుతుంటాను. అలాగే



నేను ప్రేమించిన యువతితో ఎదుర్కొంటున్న సమస్యలను ఎలా పరిష్కరించానన్నది వినోదభరితంగా చూపించాం. రెండు తెలుగు రాష్ట్రాల్లో 500కి పైగా థియేటర్లలో సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు. 'బిచ్చగాడు' చిత్రం తర్వాత విజయ్‌కి అంత పేరు తెచ్చే సినిమా ఇదని దర్శకుడు వినాయక్ చెప్పారు. హీరోయిన్ మృణాళిని మాట్లాడుతూ 'ఈ సినిమాలో నేను లీల అనే పాత్ర పోషించాను. అందులో పర్‌ఫెక్ట్‌గా నటించడం కోసం కలైరాణి దగ్గర ట్రైనింగ్ తీసుకున్నాను' అన్నారు.

నవ్య 'దృశ్యం' పేజీలో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/31xjzs6 లో చదవండి.

రేస్ వాకర్ రామ్‌కు ఒలింపిక్ బెర్త్



న్యూఢిల్లీ: భారత రేస్ వాకర్, ఆసియా క్రీడల కాంస్య పతక విజేత రామ్ బాబు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. స్లొవేకియాలో జరుగుతున్న డుడింస్కా 50 మీట్ పురుషుల 20 కిమీ. రేస్‌లో రామ్ గంటా 20 నివిషాల (1:20:00 సె) టైమింగ్‌తో పూర్తి చేసి మూడో స్థానంతో కాంస్యం సొంతం చేసుకొన్నాడు. ఈ క్రమంలో ఒలింపిక్స్ క్వాలిఫికేషన్ మార్క్ గంటా 20.10 సెకన్లలోపే రామ్ రేస్‌ను పూర్తి చేశాడు. పారిస్ కోటా సాధించిన ఏడో భారత అథ్లెట్‌గా రామ్ నిలిచాడు.



రష్మిక జోడీకి డబుల్స్ టైటిల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐటీఎఫ్ మహిళల వరల్డ్ టెన్నిస్ టూర్ ఇండోర్ టైటిల్‌ను తెలుగమ్మాయి శ్రీవల్లి రష్మిక జోడీ కైవసం చేసుకుంది. రష్మిక కెరీర్‌లో ఇది ఐదో ఐటీఎఫ్ డబుల్స్ టైటిల్. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో శనివారం జరిగిన మహిళల డబుల్స్ ఫైనల్లో అన్‌సీడెడ్ జంట రష్మిక-వైదేహి చౌధరి 6-3, 7-5తో నాలుగో సీడ్ య హ్సువాన్ లీ (తైపీ)-సొహ్యాన్ పార్క్ (దక్షిణ కొరియా) జోడీకి షాకిచ్చి విజేతగా నిలిచింది. ఇక, రష్మిక సింగిల్స్‌లోనూ సత్తా చాటుతూ టైటిల్‌కు అడుగుదూరంలో నిలిచింది. సెమీఫైనల్లో రష్మిక 6-3, 6-4తో పొలినా లాట్సెంకో (రష్యా)పై విజయం సాధించింది.

లక్ష్యసేన్‌కు నిరాశ



● సెమీస్‌లో క్రిస్టీ చేతిలో పరాజయం
● ఆల్ ఇంగ్లండ్‌లో ముగిసిన భారత్ పోరు

బర్మింగ్‌హామ్: సహచరులంతా నిష్క్రమించినా, సెమీఫైనల్ చేరి టైటిల్‌పై ఆశలు రేపిన భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్‌కు ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో చివరకు నిరాశే ఎదురైంది. రెండేళ్ల క్రితం ఇక్కడ రన్నరప్‌గా నిలిచిన లక్ష్య.. ఈసారి ఫైనల్ చేరడంలో విఫలమయ్యాడు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీస్‌లో ప్రపంచ 18వ ర్యాంకర్ లక్ష్యసేన్ 12-21, 21-10, 15-21తో ఇండోనేసియాకు చెందిన వరల్డ్ నెంబర్ 9 జోనాథన్ క్రిస్టీ చేతిలో పోరాడి ఓడాడు. గంటకు పైగా సాగిన హోరాహోరీ ఫైట్‌లో తొలిగేమ్ ఓడినా.. రెండో గేమ్ నెగ్గి మ్యాచ్ తనవైపు తిరిగేలా చేసుకున్నాడు. కానీ, నిర్ణాయక ఆఖరిగేమ్‌లో విరామం తర్వాత పదేపదే తప్పిదాలకు పాల్పడి మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. కాగా, భారత్ తరఫున ప్రకాశ్ పదుకొనె, పుల్లెల గోపీచంద్ మాత్రమే ఈ టోర్నీలో విజేతలుగా నిలిచారు.

ఇదీ.. పంత్ ఫిట్‌నెస్ సీక్రెట్!

న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వికెట్ కీపర్ రిషబ్ పంత్.. కోలుకొని మళ్లీ క్రికెట్‌లోకి అడుగుపెట్టడం నిజంగా అద్భుతమే. ఐపీఎల్‌లో ఆడేందుకు బీసీసీఐ అతడికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వాస్తవంగా రిషబ్ కోలుకోవడానికి రెండేళ్లు పడుతుందని డాక్టర్లు అంచనా వేశారు. కానీ, 15 నెలలకే అతడు మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించి అందరినీ అబ్బురపరిచాడు. రిషబ్ ఇంత వేగంగా కోలుకోవడానికి అతడు చిన్న వయసులో జిమ్నాస్టిక్స్ ప్రాక్టీస్ చేయడం ఎంతో దోహదం చేసిందని ఎన్‌సీఏ సిబ్బందిలో ఒకరు చెప్పారు. పునరావాసంలో మానసికంగా దృఢంగా ఉండడంతోపాటు తాను కోలుకొంటాననే బలమైన నమ్మకంతో పంత్ సాధన చేశాడని తెలిపారు. 2022 డిసెంబరులో డెహ్రాడూన్ వెళ్తుండగా పంత్ ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే.



ఎవరిదో కిరీటం?

రాత్రి 7.30 నుంచి జియో సినిమా, స్పోర్ట్స్18లో

ఢిల్లీ X బెంగళూరు | **డబ్ల్యూపీఎల్ ఫైనల్ నేడు**

న్యూఢిల్లీ: వరుసగా రెండోసారి ఫైనల్ చేరిన ఢిల్లీ క్యాపిటల్స్.. ఈసారి ఎలాగైనా విజేతగా నిలవాలనే పట్టుదలతో ఉంది. ఈ క్రమంలో ఆదివారం జరిగే మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టైటిల్‌పోరులో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమైంది. గతేడాది జరిగిన తొలి సీజన్‌లో ముంబై ఇండియన్స్ చేతిలో ఢిల్లీ 7 వికెట్లతో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకొంది. కానీ, ఈసారి మాత్రం మెగ్ లానింగ్ సారథ్యంలోకి క్యాపిటల్స్ నిలకడైన ప్రదర్శన చేసింది. లీగ్ దశలో ఆడిన ఎనిమిది మ్యాచుల్లో ఆరు గెలిచి మొత్తం 12 పాయింట్లతో టేబుల్ టాపర్ హోదాలో నేరుగా ఫైనల్‌కు చేరుకుంది. లానింగ్ ముందుండి నడిపిస్తుండగా.. ఆల్‌రౌండర్లు మరిజానె కాప్, జొనాసెన్, క్యాప్సీ జట్టు విజయాల్లో కీలకంగా మారారు. ఓపెనర్ షఫాలీ వర్మ నుంచి జట్టు మరో ధనాధన్ ఇన్నింగ్స్ ఆశిస్తుండగా.. మిడిలార్డర్‌లో జెమీమా రోడ్రిగ్స్ వెన్నెముకగా నిలుస్తోంది. కోట్లా పిచ్ స్పిన్నర్లకు సహకరించే అవకాశం ఉండడంతో రాధా యాదవ్‌తోపాటు క్యాప్సీ, జొనాసెన్‌పై ఎక్కువ భారం పడనుంది.

జెయింట్ కిల్లర్‌గా..: మరోవైపు డిఫెండింగ్ చాంప్ ముంబైను ఎలిమినేట్ చేసి తొలిసారి టైటిల్ ఫైట్‌కు చేరిన బెంగళూరు.. ఇదే జోరులో కప్ కూడా సొంతం చేసుకోవాలనుకొంటోంది. చాలెంజర్స్ ఫైనల్ చేరిందంటే.. ఎలిస్ పెర్రీ ఆల్‌రౌండ్ నైపుణ్యం వల్లే అనడంలో సందేహం లేదు. ప్లేఆఫ్స్ చేరాలంటే తప్పనిసరిగా నెగ్గాల్సిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో పెర్రీ 6 వికెట్లతో ముంబై పనిబట్టింది. ఇక, ఎలిమినేటర్‌లో ఎలిస్ (66) అర్ధ శతకంతో ముంబైకి ఎదురు నిలిచింది. అయితే, ఆమెకు కెప్టెన్ స్మృతి మంధాన, సోఫీ డివైన్, రిచా, మోలినెక్స్ నుంచి ఇంకొంత సహకారం అందాల్సి ఉంది. బలమైన బ్యాటింగ్ లైనప్ కలిగిన ఢిల్లీని నిలువరించాలంటే బౌలర్లు రేణుక, శ్రేయాంక, వేర్‌హమ్ తప్పక రాణించాలి. అంతిమ సమరంలో ఢిల్లీ ఫేవరెట్‌గా కనిపిస్తున్నా.. ఎలిమినేటర్‌లో బెంగళూరు పోరాడిన తీరు చూస్తే ఫైనల్ రసవత్తరంగా సాగే అవకాశాలున్నాయి. కాగా, ఈ రెండు ఫ్రాంచైజీల పురుషుల జట్లు ఒక్కసారి కూడా ఐపీఎల్ టైటిల్ సాధించలేదు. కానీ, మహిళల లీగ్ ద్వారా ఒక జట్టు కలైతే నెరవేరనుంది.

అన్ని మ్యాచ్‌లూ భారత్‌లోనే

ఐపీఎల్ రెండో దశ యూఏఈలో అన్న వార్తలు అబద్ధం

బీసీసీఐ కార్యదర్శి జై షా



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఐపీఎల్‌పై అనేక ఊహాగానాలు వెలువడుతున్నాయి. మెగా లీగ్ రెండో దశను యూఏఈలో నిర్వహిస్తారనే ప్రచారం నెట్టింట భారీగా జరుగుతోంది. అయితే, వీటిని బీసీసీఐ కార్యదర్శి జై షా తోసిపుచ్చాడు. 'లీగ్ మొత్తం భారత్‌లోనే జరుగుతుంది. మిగతా మ్యాచ్‌ల గురించి సమాలోచన చేస్తున్నాం. త్వరలోనే పూర్తిస్థాయి షెడ్యూల్‌ను విడుదల చేస్తామ'ని షా శనివారం మీడియాకు తెలిపాడు. కాగా, టోర్నీని ఎక్కడికీ తరలించే ప్రసక్తే లేదని ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధూమల్ కూడా చెప్పాడు. రెండో దశను యూఏఈలో నిర్వహిస్తారంటూ వస్తున్న ఊహాగాలు నిరాధారమైనవన్నాడు. ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 7 వరకు జరిగే తొలి 21 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను మాత్రమే బీసీసీఐ ప్రకటించింది. రెండో దశ మ్యాచ్‌ల వివరాలను ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడ్డాక ప్రకటిస్తామని బోర్డు ఇప్పటికే తెలిపింది. కాగా.. 2019లో సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇదే పరిస్థితి తలెత్తినా ఐపీఎల్ మొత్తాన్ని ఇక్కడే నిర్వహించారు. ఇప్పుడు కూడా అదే తరహాలోనే మెగా లీగ్‌ను జరిపే ప్రయత్నాల్లో బీసీసీఐ ఉన్నట్టు కనిపిస్తోంది.

మే 26న ఫైనల్: ఐపీఎల్ ఫైనల్ మే 26 జరిగే అవకాశాలున్నాయని కోల్‌కతా నైట్‌రైడర్స్ మెంటార్ గౌతమ్ గంభీర్ మాటలను బట్టి తెలుస్తోంది. టీమ్ మీటింగ్ సందర్భంగా జట్టు ఆటగాళ్లతో మాట్లాడుతూ.. 'మే 26న, మనం అక్కడ ఉండాలి' అని గంభీర్ అన్న వీడియోను ఫ్రాంచైజీ తమ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. దీంతో గౌతీ ఫైనల్ గురించే ఆ తేదీని ప్రస్తావించాడన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

అర్ధరాత్రి అమ్మాయిల హాస్టల్‌లోకి ప్రవేశించి..

వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య సీరియస్
ఒలింపిక్స్ శిబిరం నుంచి గెంటివేత

స్టార్ లిఫ్టర్ అచింత నిర్వాకం



'పారిస్' రేసు నుంచి అవుట్!

న్యూఢిల్లీ: కామన్వెల్త్ క్రీడల స్వర్ణ పతక విజేత అచింత షూలీ అనుచితంగా ప్రవర్తించాడు. పటియాలాలోని జాతీయ క్రీడా సంస్థ (ఎన్ఐఎస్) మహిళల హాస్టల్లోకి అతడు అర్ధరాత్రి ప్రవేశించి కలకలం సృష్టించాడు. ఈ సంఘటనను తీవ్రంగా పరిగణించిన భారత వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య (ఐడబ్ల్యూఎల్ఎఫ్) అచింతపై వేటు వేసింది. పారిస్ ఒలింపిక్స్ సన్నాహక శిబిరం నుంచి అతడిని గెంటి వేసింది. 22 ఏళ్ల షూలీ గురువారం అర్ధరాత్రి మహిళల హాస్టల్లోకి ప్రవేశిస్తుండగా భద్రతా సిబ్బంది పట్టుకున్నారు. అంతేకాదు.. ఈ ఘటనను సెక్యూరిటీ సిబ్బంది వీడియో కూడా తీశారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన అచింత.. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ క్రీడల 73 కేజీల విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు. 'ఇటువంటి క్రమశిక్షణా రాహిత్యాన్ని సహించబోం. సన్నాహక శిబిరం నుంచి వెంటనే వెళ్లిపోవాలని అచింతను ఆదేశించాం' అని వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య అధికారి ఒకరు శనివారం వెల్లడించారు. అచింత సంఘటన గురించి భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) పటియాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినీత్ కుమార్‌కు అధికారులు వెంటనే తెలియజేశారు. జరిగిన ఘటనపై వీడియో సాక్ష్యం ఉన్నందున..ఎలాంటి విచారణకు సాయ్ ఆదేశించలేదు. 'వీడియోను వినీత్ కుమార్‌తో పాటు ఢిల్లీలోని సాయ్ ప్రధాన కార్యాలయానికి పంపాం. దాంతో శిబిరం నుంచి అచింతను వెంటనే తొలగించాలని లిఫ్టింగ్ సమాఖ్యను సాయ్ ఆదేశించింది' అని సాయ్ వర్గాలు తెలిపాయి. సమాఖ్య ఆదేశంతో శుక్రవారమే అతడు శిబిరాన్ని వీడాడు. పటియాలలో పురుషులు, మహిళా అథ్లెట్లకు వేర్వేరుగా హాస్టళ్లున్నాయి.

శిబిరం నుంచి గెంటివేత దరిమిలా..అచింతకు పారిస్ ఒలింపిక్స్ దారులు మూసుకుపోయాయి. విశ్వ క్రీడలకు క్వాలిఫయింగ్ టోర్నీ అయిన వరల్డ్ కప్ ఈనెలలో థాయ్‌లాండ్‌లో జరగనుంది. క్రమశిక్షణ చర్యల ఫలితంగా అతడు వరల్డ్ కప్ జట్టునుంచీ అవుటయ్యాడు. వాస్తవానికి పారిస్ ఒలింపిక్స్ అర్హత ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం 27వ స్థానంలో ఉన్న షూలీ..కాంటినెంటల్ కోటాలో పారిస్ బెర్త్ దక్కించుకొనే అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ కోటా దక్కినా, తాజా ఘటనతో అతడిని పారిస్ క్రీడలకు ఎంపిక చేయకపోవచ్చు.

సీఎస్‌కేకు ఎదురు దెబ్బ

పేసర్ పథిరన ఐదు వారాలు ఐపీఎల్‌కు దూరం!



చెన్నై: ఐపీఎల్‌లో తమ తొలి మ్యాచ్‌కు వారం కూడా లేదు. ఈ నేపథ్యంలో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)కు గట్టి దెబ్బ తగిలింది. గాయం నుంచి కోలుకోని ఆ జట్టు స్టార్ పేసర్ పథిరన నాలుగు నుంచి ఐదు వారాలు టోర్నీకి దూరంగా ఉండనున్నట్టు సమాచారం. ఈనెల ఆరున సిల్హెట్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టీ20 సందర్భంగా పథిరనకు కండర గాయం అయింది. దాంతో ఆ మ్యాచ్ మధ్యలోనే వైదొలగిన శ్రీలంక పేసర్.. దానిని నుంచి ఇంకా పూర్తిగా కోలుకోలేదు. గతసారి సీఎస్‌కే విజేతగా నిలవడంలో పథిరన కీలక భూమిక పోషించాడు. 12 మ్యాచుల్లో అతడు 19 వికెట్లు సాధించాడు. కాగా..ఈనెల 22న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టుతో చెన్నై సూపర్ కింగ్స్ తన పోరును ఆరంభించనుంది.

బిజినెస్

దక్షిణాదిలో బీమాపై పెరిగిన అవగాహన

మ్యాక్స్‌లైఫ్ ఎండీ ప్రశాంత్ త్రిపాఠి

హైదరాబాద్: దేశంలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల ప్రజల్లో బీమా ప్రయోజనాలపై అవగాహన బాగా పెరిగింది. ప్రముఖ మార్కెటింగ్ డేటా అండ్ అనలిటిక్స్ కంపెనీ కాంటార్‌తో కలిసి తాము జరిపిన ఒక సర్వేలో ఈ విషయం తేలినట్టు మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఎండీ, సీఈఓ ప్రశాంత్ త్రిపాఠి తెలిపారు. దీనికి సంబంధించి ఇండియా ప్రొటెక్షన్ కోటియంట్ సర్వే 6.0 (ఐపీక్యూ6.0) పేరుతో రూపొందించిన నివేదిక వివరాలను ఆయన వివరించారు. దేశంలోని 25 నగరాల నుంచి 4,700 మందిని ఆన్‌లైన్‌లో సర్వే చేసి ఈ నివేదిక రూపొందించారు. దేశవ్యాప్తంగా సగటున నూటికి 45 మందికి బీమా ప్రయోజనాలపై అవగాహన ఉంటే.. దక్షిణ భారత్‌లో ఇది 49గా ఉందన్నారు.

గత ఏడాది విడుదలైన ఐపీక్యూ 5.0తో పోలిస్తే అఖిల భారత స్థాయిలో మూడు శాతం, దక్షిణాదిలో రెండు శాతం పెరిగింది. బీమా ప్రయోజనాలపై దక్షిణాది రాష్ట్రాల్లో బెంగళూరు, హైదరాబాద్ ప్రజలకు ఉన్నం త అవగాహన మరెవరికీ లేదని త్రిపాఠి చెప్పారు. ఐపీక్యూ 6.0 సర్వే కోసం హైదరాబాద్ నుంచి పాల్గొన్న వారిలో 65 శాతం మంది హెల్త్ చెకప్స్ మీద, 61 శాతం మంది ఫిజికల్ ఫిట్‌నెస్ మీదా దృష్టి పెడుతున్నట్టు తేలినట్టు చెప్పారు.

జూన్ వరకు నియామకాల జోరు

నౌకరీ హైరింగ్ ఔట్‌లుక్ సర్వే

ముంబై: కంపెనీలు వైట్ కాలర్ ఉద్యోగుల నియామకాలు, రీప్లేస్‌మెంట్ల జోరు పెంచాయి. ఈ ఏడాది జూన్ నెలాఖరు వరకు ఈ జోరుకు ఢోకా ఉండదని 'నౌకరీ హైరింగ్ ఔట్‌లుక్ సర్వే' తెలిపింది. నౌకరీ డాట్‌కామ్ దేశంలోని దాదాపు 1,200 నియామక సంస్థల సీఈఓలతో మాట్లాడి ఈ సర్వే రూపొందించింది. ఈ సర్వేలో పాల్గొన్న నియామక సేవల సంస్థ సీఈఓల్లో 92 శాతం మంది ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం నియామకాల మార్కెట్ సాధారణ స్థితికి చేరి స్థిరంగా ఉందని నౌకరీ డాట్‌కామ్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ పవన్ గోయల్ చెప్పారు. ప్రస్తుతం కొన్ని సమస్యల్లో ఉన్నా ఐటీ ఉద్యోగ నియామకాలూ పెరుగుతున్నాయి. అయితే ఈ నియామకాలు ఐటీ కంపెనీల్లో కంటే ఐటీయేతర కంపెనీల ఐటీ విభాగాల్లో పెరగడం విశేషం.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ		విజయవాడ	420
హైదరాబాద్	400	విశాఖపట్నం	425
17వ తేదీ		వరంగల్	402
చిత్తూరు	463		
గోదావరి	420	డజను గుడ్లు రూ.72	


ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	104	గోదావరి	106
వరంగల్	104	విజయవాడ	106
కరీంనగర్	104	గుంటూరు	110
మహబూబ్‌నగర్	104	ఒంగోలు	110
కర్నూలు	104	చిత్తూరు	121
విశాఖపట్నం	103		

2034 నాటికి రూ.108 లక్షల కోట్లు

భారత రియల్ ఎస్టేట్ మార్కెట్‌పై క్రెడాయ్ అంచనా



న్యూఢిల్లీ: వచ్చే పదేళ్లలో (20234 నాటికి) భారత స్థిరాస్తి రంగ మార్కెట్ పరిమాణం 1.3 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.108 లక్షల కోట్లు) స్థాయికి పెరగవచ్చని ది కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) అంచనా వేసింది. 2047 నాటికి 5.17 లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ.430 లక్షల కోట్లు) ఎగబాకవచ్చని 'వికసిత భారత్ నిర్మాణం- భారత్‌లో స్థిరాస్తి రంగ పరివర్తన పాత్ర' పేరుతో శనివారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ప్రస్తుతం భారత రియల్ ఎస్టేట్ మార్కెట్ సైజు రూ.24 లక్షల కోట్ల (30,000 కోట్ల డాలర్లు) స్థాయిలో ఉంది. అందులో నివాస, వాణిజ్య ప్రాపర్టీ విభాగాల వాటా నిష్పత్తి 80:20 గా ఉందని రిపోర్టు వెల్లడించింది. మరిన్ని ముఖ్యాంశాలు..

- ముున్ముందు సంవత్సరాల్లో భారత ఆర్థిక వ్యవస్థపై స్థిరాస్తి రంగం గణనీయ ప్రభావం చూపనుంది. 2034 నాటికి భారత జీడీపీలో స్థిరాస్తి రంగ వాటా 13.8 శాతానికి చేరుకోనుంది. 2047 నాటికి 17.5 శాతానికి పుంజుకోవచ్చని అంచనా.
- గృహాల ప్రాజెక్టుల విభాగంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న 61 శాతం ఇళ్ల ధర రూ.45 లక్షల పైమాటే. సగటు గృహ విస్తీర్ణం కూడా ఏటా 11 శాతం చొప్పున పెరుగుతోంది.
- 2030 నాటికి దేశంలో 7 కోట్ల అదనపు గృహ యూనిట్ల డిమాండ్ నెలకొనవచ్చని అంచనా. అప్పటికల్లా రూ.45 లక్షలకు పైగా ఖరీదు చేసే గృహాల డిమాండ్ వాటా 87.4 శాతానికి పెరగవచ్చని అంచనా.
- భారత రియల్ ఎస్టేట్ రంగం మొత్తం ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా ఉద్యోగాల కల్పన, ప్రభుత్వం, బ్యాంకింగ్ ఆదాయాలు, తలసరి ఆదాయం వృద్ధిపై గణనీయ ప్రభావం చూపనుంది.
- 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించే దిశగా సాగుతున్న భారత ప్రయాణంతో పాటు జీడీపీ వేగవంత వృద్ధిలో స్థిరాస్తి రంగం కీలక పాత్ర పోషించనుందని క్రెడాయ్ ప్రెసిడెంట్ బొమన్ ఆర్ ఇరానీ అన్నారు.
- వికసిత్ భారత్ సాధనలో రియల్టీ రంగం వృద్ధికి కేంద్ర బిందువు కానుందని క్రెడాయ్ చైర్మన్ మనోజ్ గౌర్ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ ప్రతికూలతల్లోనూ భారత్ గణనీయ వృద్ధిని నమోదు చేస్తోందని.. మన ఆర్థిక వ్యవస్థతో పాటు ఆయా రంగాల చురుకైన పనితీరుకు ఇదే నిదర్శనమని క్రెడాయ్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ శేఖర్ జీ పటేల్ పేర్కొన్నారు.

లంచం ఆరోపణలపై అమెరికాలో అదానీపై దర్యాప్తు



అజూర్ పవర్ గ్లోబల్ పైనా కూడా..

న్యూఢిల్లీ: లంచం ఆరోపణలకు సంబంధించి భారత పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీతో పాటు అదానీ గ్రూప్‌పై అమెరికాలో దర్యాప్తు జరుగుతున్నట్లు బ్లూంబర్గ్ కథనం వెల్లడించింది. అదానీ గ్రూప్‌నకు చెందిన ఓ సంస్థ లేదా ఆ సంస్థతో సంబంధం ఉన్న వ్యక్తులు (గౌతమ్ అదానీ సహా) ఓ ఎనర్జీ ప్రాజెక్టు విషయంలో వారికి అనుకూలంగా వ్యవహరించేందుకు అధికారులకు లంచం ఇచ్చారన్న ఆరోపణలపై ఈ దర్యాప్తు జరుగుతున్నట్లు రిపోర్టు పేర్కొంది. యూఎస్ అటార్నీ ఆఫీస్ ఫర్ ది ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ ఆఫ్ న్యూయార్క్‌తో పాటు వాషింగ్టన్‌లోని జస్టిస్ డిపార్ట్‌మెంట్స్ ఫ్రాడ్ యూనిట్ ఆధ్వర్యంలో ఈ దర్యాప్తు సాగుతున్నట్లు తెలిసింది. అదానీ గ్రూప్‌తో పాటు దేశీయ పునరుత్పాదక ఇంధన సంస్థ అజూర్ పవర్ గ్లోబల్ లిమిటెడ్‌పైనా దర్యాప్తు జరుగుతోంది. అయితే, ఈ విషయంపై తమకెలాంటి సమాచారం లేదని అదానీ గ్రూప్ అంటోంది. బ్రూక్లిన్, వాషింగ్టన్ జస్టిస్ డిపార్ట్‌మెంట్ల ప్రతినిధులతో పాటు అజూర్ పవర్ కూడా ఈ విషయంపై స్పందించేందుకు నిరాకరించింది.

సాధారణంగా ఏదైనా ఆరోపణలపై జరిగే ప్రాథమిక దర్యాప్తు కోర్టులో కేసు విచారణకు దారితీయాలనేం లేదు. అదానీ గ్రూప్ చాలాకాలంగా అకౌంటింగ్ మోసాలకు పాల్పడటంతో పాటు అక్రమ విధానాల్లో కంపెనీల షేర్ల ధరను కృత్రిమంగా పెంచుకుంటూ వచ్చిందని అమెరికన్ షార్ట్ సెల్లింగ్, మార్కెట్ రీసెర్చ్ కంపెనీ హిండెన్‌బర్గ్ గత ఏడాది జనవరి 24న విడుదల చేసిన నివేదికలో ఆరోపించింది. దాంతో అదానీ గ్రూప్ షేర్లలో అమ్మకాలు పోటెత్తాయి. నివేదిక విడుదలైన నెల రోజుల్లోనే గ్రూప్ మార్కెట్ విలువ సగానికి పతనమైంది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫరింగ్ (ఎఫ్‌పీఓ)ను సైతం రద్దు చేసుకోవాల్సి వచ్చింది. అంతేకాదు, ఈ వివాదం రాజకీయంగానూ చర్చనీయాంశమైంది. దాంతో, ఈ వ్యవహారంపై దర్యాప్తు చేసేందుకు సుప్రీంకోర్టు స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేసింది. అంతేకాదు, క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీని సైతం దర్యాప్తు చేయాలని ఆదేశించింది. కానీ, అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణల్లో ఏ ఒక్కటీ ఇప్పటివరకు రుజువు కాలేదు.

నిర్మాణ హక్కుల బదిలీ అంటే..?

ఇదీ GST



రాంబాబు గొండాల

జీఎస్‌టీకి సంబంధించి క్లిష్టమైన అంశాల్లో నిర్మాణ హక్కుల బదిలీ ఒకటి. ఈ లావాదేవీ గతంలో అంటే వ్యాట్ లేదా సర్వీస్ ట్యాక్స్ పరిధిలో లేదు కాబట్టి జీఎస్‌టీలో దీనికి సంబంధించి కొంత గందరగోళం ఉంది. దీనిని సులభంగా అర్థం చేసుకోవటానికి నిర్మాణ హక్కుల బదిలీ అంటే ఏమిటి? దీని మీద ఎంత పన్ను చెల్లించాలి? పన్ను చెల్లించాల్సిన బాధ్యత ఎవరిది? వంటి విషయాలు మీకోసం.

ఏదేనీ ఒక అపార్ట్‌మెంట్ నిర్మాణం జరుగుతుందంటే.. ఆ నిర్మాణం జరిగే స్థలం బిల్డర్ స్వంత స్థలం అయ్యి ఉండవచ్చు లేదా స్థల యజమానితో బిల్డర్ అగ్రిమెంట్ కుదుర్చుకుని ఉండవచ్చు. దీన్ని సాధారణ పరిభాషలో చెప్పాలంటే జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ అంటారు. అంటే బిల్డర్, స్థల యజమానులు వేర్వేరు అయినప్పుడు.. ఆ స్థలంలో బిల్డర్ నిర్మాణం చేపట్టటానికి, నిర్మాణం జరిగిన ఫ్లాట్లు బిల్డర్ అమ్ముకోవటానికి వీలు కల్పిస్తూ స్థల యజమాని ఆ బిల్డర్‌కు తగిన హక్కులు బదిలీ చేస్తారు. దీనికి ప్రతిగా బిల్డర్ ఆ అపార్ట్‌మెంట్‌లోని కొన్ని ఫ్లాట్స్ ఆ స్థల యజమానికి బదిలీ చేసే విధంగా తీర్మానం చేసుకుంటారు. ఇలా స్థల యజమాని బిల్డర్‌కు ఇచ్చే హక్కును డెవలప్‌మెంట్ రైట్ అంటారు. ఈ డెవలప్‌మెంట్ రైట్‌ను స్థల యజమాని బదిలీ చేయటం అంటే ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్ అనేది జీఎస్‌టీ చట్టంలో పన్ను వర్తించే సేవ కిందకు వస్తుంది. అలాగే కొన్ని షరతులతో చెల్లించాల్సిన పన్ను నుంచి మినహాయింపు కూడా ఇవ్వటం జరిగింది. అంటే పన్ను మినహాయింపు కోసం ఇచ్చిన షరతులు పాటించకపోతే బదిలీ చేసిన హక్కులకు సంబంధించి పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

ముందుగా ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్ మీద పన్ను చెల్లించాల్సిన బాధ్యతను 2019 ఏప్రిల్ 1 నుంచి స్థల యజమాని నుంచి బిల్డర్‌కు బదిలీ చేశారు. అంటే బిల్డర్.. రివర్స్ చార్జ్ మెకానిజమ్ కింద స్థల యజమాని బదులు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే పైన చెప్పినట్లు దీనికి పన్ను మినహాయింపు పొందటానికి ఒక నిబంధన ఉంది. బిల్డర్ తన కింద వచ్చిన ఫ్లాట్స్ అన్నిటినీ కంప్లీషన్ సర్టిఫికెట్ రావటానికి పూర్వమే అమ్మి ఉండాలి. అలా అమ్మిన పక్షంలో బిల్డర్ డెవలప్‌మెంట్ రైట్‌కు సంబంధించి ఎలాంటి పన్ను కట్టాల్సిన అవసరం లేదు. లేదంటే కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చే నాటికి అమ్ముడుపోకుండా మిగిలి ఉన్న ఫ్లాట్స్‌ను బట్టి దామాషా పద్ధతిలో డెవలప్‌మెంట్ రైట్స్‌కు సంబంధించి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అలాగే పన్ను కట్టాల్సి వస్తే డెవలప్‌మెంట్ రైట్‌కు ఎంత విలువ లెక్కించాలి, పన్ను శాతం ఎంతో చూద్దాం.

ఉదాహరణకు ఒక బిల్డర్, స్థల యజమాని అపార్ట్‌మెంట్ నిర్మాణానికి గాను అగ్రిమెంట్ చేసుకున్నారు. మొత్తం ఒక లక్ష చదరపు అడుగుల కార్పెట్ ఏరియా వచ్చే విధంగా 100 ఫ్లాట్స్ కట్టేటట్లు, స్థల యజమాని బదిలీ చేసే డెవలప్‌మెంట్ రైట్స్‌కు ప్రతిగా బిల్డర్ 40,000 చదరపు అడుగులు లేదా 40 ఫ్లాట్స్ స్థల యజమానికి ఇచ్చేటట్లు, మిగతా 60,000 చదరపు అడుగులు లేదా 60 ఫ్లాట్స్ బిల్డర్ ఉంచుకునే విధంగా ఒప్పందం జరిగింది. అంటే దీని ప్రకారం డెవలప్‌మెంట్ రైట్స్‌కు సంబంధించిన విలువ 40 ఫ్లాట్స్ కాబట్టి, చట్ట ప్రకారం ఈ 40 ఫ్లాట్స్ విలువ మీద బిల్డర్ రివర్స్ చార్జ్‌లో పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ విలువను లెక్కించటానికి గాను అగ్రిమెంట్ జరిగిన తర్వాత ముందుగా అమ్ముడుపోయే ఫ్లాట్ విలువను ఆధారం చేసుకోవాలి. ఉదాహరణకు బిల్డర్ మొదటి ఫ్లాట్‌ను సాధారణ కొనుగోలుదారునికి చదరపు అడుగు రూ.5,000కు విక్రయించాడనుకుందాం. ఈ లెక్కన స్థల యజమాని వాటా 40 వేల చదరపు అడుగుల విలువ రూ.20 కోట్లు అవుతుంది. దీనిపై 18 శాతం చొప్పున అంటే రూ.3.6 కోట్లు పన్ను రూపేణా బిల్డర్ ప్రభుత్వానికి చెల్లించాలి. అయితే ఇందుకు మినహాయింపు పొందాలంటే.. బిల్డర్ తన వాటాలో వచ్చిన 60 వేల చదరపు అడుగుల కంప్లీషన్ సర్టిఫికెట్ రావటానికి పూర్వమే అమ్మాలి. అలాకాకుండా బిల్డర్ వాటాకు వచ్చిన 60 వేల చదరపు అడుగుల్లో 12 వేల చదరపు అడుగులు కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చే నాటికి మిగిలి ఉందని అనుకుందాం. అంటే తన వాటాలో 20 శాతం మిగిలిపోయింది కాబట్టి తాను కట్టాల్సిన రూ.3.6 కోట్లలో 20 శాతం అంటే రూ.72 లక్షలు పన్ను కింద చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ బిల్డర్‌కు మరల కొంత మినహాయింపు ఇచ్చారు. కంప్లీషన్ సర్టిఫికెట్ రావటానికి ముందు.. చివరగా అమ్మిన ఫ్లాట్ విలువ ప్రకారం మిగిలిపోయిన 12 వేల చదరపు అడుగులు లెక్కించి ఆ విలువపై 5 శాతం పన్ను లెక్కించాలి. ఈ రెండింటిలో ఏది తక్కువైతే అది చెల్లించవచ్చు.

ఉదాహరణకు కంప్లీషన్ సర్టిఫికెట్ డిసెంబరు 31న వచ్చిందనుకుందాం. దానికంటే ముందు నవంబరులో బిల్డర్ తన వాటాలోని ఒక ఫ్లాట్‌ను సాధారణ కొనుగోలుదారునికి చదరపు అడుగు రూ.7,000 చొప్పున అమ్మాడనుకుందాం. దీని ప్రకారం కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చినప్పుడు మిగిలిపోయిన 12 వేల చదరపు అడుగుల విలువను లెక్కించి దాని మీద 5 శాతాన్ని పన్ను కింద లెక్కించాలి. ఈ విధంగా చూస్తే కట్టాల్సిన పన్ను రూ.42 లక్షలు అవుతుంది. అప్పుడు బిల్డర్ పైన చెప్పిన రూ.72 లక్షలకు బదులు రూ.42 లక్షలు కడితే సరిపోతుంది. అంటే దామాషా పద్ధతిలో 18 శాతం లేదా మిగిలిన ఫ్లాట్స్ విలువలో 5 శాతం, ఏది తక్కువ అయితే అది కట్టాల్సి ఉంటుంది. అంటే డెవలప్‌మెంట్ రైట్స్‌కు సంబంధించి పన్ను చెల్లించటానికి కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చేంత వరకు సమయం ఉంటుంది. కాబట్టి సర్టిఫికెట్ వచ్చిన తర్వాత అమ్ముడుకాకుండా మిగిలిన ఫ్లాట్స్ ఏమైనా ఉంటే పైన చెప్పినట్లు పన్ను మదింపు చేసి ప్రభుత్వానికి బిల్డర్ చెల్లించాల్సి ఉంటుంది.

పైన చెప్పిన నియమ నిబంధనలు 2019 ఏప్రిల్ 1 లేదా ఆ తర్వాత జరిగే జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్స్‌కు మాత్రమే వర్తిస్తుంది. అది కూడా రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్స్‌కు మాత్రమే వర్తిస్తాయి. అలాగే దీనితో సంబంధం లేకుండా బిల్డర్, స్థల యజమానికి బదిలీ చేసే 40 ఫ్లాట్స్‌కు బిల్డర్ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. దీన్ని స్థల యజమాని కొన్ని నియమాలకు లోబడి క్రెడిట్ తీసుకోవచ్చు.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

దశ	నోటిఫికేషన్ తేదీ	నామినేషన్ స్వీకరణకు చివరి తేదీ	నామినేషన్ల పరిశీలన	ఉపసంహరణకు ఆఖరు తేదీ	పోలింగ్ తేదీ
తొలి విడత	మార్చి 20	మార్చి 27	మార్చి 28	మార్చి 30	ఏప్రిల్ 19
రెండో విడత	మార్చి 28	ఏప్రిల్ 4	ఏప్రిల్ 5	ఏప్రిల్ 8	ఏప్రిల్ 26
మూడో విడత	ఏప్రిల్ 12	ఏప్రిల్ 19	ఏప్రిల్ 20	ఏప్రిల్ 22	మే 7
నాలుగో విడత	ఏప్రిల్ 18	ఏప్రిల్ 25	ఏప్రిల్ 26	ఏప్రిల్ 29	మే 13
ఐదో విడత	ఏప్రిల్ 26	మే 3	మే 4	మే 6	మే 20
ఆరో విడత	ఏప్రిల్ 29	మే 6	మే 7	మే 9	మే 25
ఏడో విడత	మే 7	మే 14	మే 15	మే 17	జూన్ 1

ఎన్నికలు ఏయే రాష్ట్రాల్లో.. ఎన్ని దశల్లో (కేంద్ర పాలిత ప్రాంతాలు కూడా)

ఒకే దశలో: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్,అరుణాచల్ ప్రదేశ్, ఢిల్లీ, గోవా, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, హరియాణా, కేరళ, నాగాలాండ్, తమిళనాడు, పంజాబ్, ఉత్తరాఖండ్, సిక్కిం, మిజోరాం, మేఘాలయ,అండమాన్, నికోబార్ దీవులు, చండీగఢ్, దాద్రానగర్ హవేలి, లక్షద్వీప్, పుదుచ్చేరి

2 దశల్లో	3 దశల్లో	4 దశల్లో	5 దశల్లో	7 దశల్లో
కర్ణాటక, రాజస్థాన్, త్రిపుర, మణిపూర్	అసోం, ఛత్తీస్‌గఢ్	మధ్యప్రదేశ్, ఝార్ఖండ్, ఒడిశా	మహారాష్ట్ర, జమ్మూ కశ్మీర్	ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమబెంగాల్

తెలంగాణ, ఏపీ లోక్‌సభ - ఏపీ శాసనసభ ఎన్నికల షెడ్యూల్

నోటిఫికేషన్	ఏప్రిల్ 18
నామినేషన్ల గడువు	ఏప్రిల్ 25
నామినేషన్ల పరిశీలన	ఏప్రిల్ 26
ఉపసంహరణ	ఏప్రిల్ 29
పోలింగ్ తేదీ	మే13
ఓట్ల లెక్కింపు	జూన్ 4


ఎన్నికలకు మేం సిద్ధం



న్యూఢిల్లీ, మార్చి 16: సార్వత్రిక ఎన్నికలకు బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే పూర్తి సంసిద్ధంగా ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రతిపక్షాలకు ఒక విధానం, లక్ష్యం లేవని విమర్శిస్తూ మళ్లీ తామే అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే అతిపెద్ద ప్రజాస్వామ్య పండగ మొదలైందంటూ మోదీ 'ఎక్స్'లో వరుస పోస్టులు పెట్టారు. తమ పదేళ్ల హయాంలో దేశం మలుపు తిరిగిందని, సుపరిపాలనలో తమ ట్రాక్ రికార్డు ఆధారంగా ప్రజల ముందుకెళతామని పేర్కొన్నారు. మూడో విడతలో మరిన్ని పనులు చేయవలసి ఉందని, పేదరికం, అవినీతిపై పోరాటం కొనసాగుతుందని తెలిపారు. 70 ఏళ్ల పాటు దేశాన్ని పాలించినవారు సృష్టించిన అంతరాలను గత పదేళ్లలో రూపుమాపామని, భారత్ స్వయంసమృద్ధి సాధించగలదన్న విశ్వాసాన్ని నింపామని పేర్కొన్నారు. ఇక భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు, యువత కలలను నెరవేర్చేందుకు పనిచేస్తామని తెలిపారు. 'పదేళ్ల క్రితం బీజేపీ అధికారంలోకి వచ్చే వరకు దేశ ప్రజలు మోసానికి గురయ్యామనే భావనలో ఉన్నారు. కుంభకోణాలు జరగని రంగం లేదు. ప్రపంచం మనవైపు చూడటం మానేసింది. అక్కడి నుంచి అద్భుతమైన మలుపు తిరిగింది. ఇప్పుడు 140 కోట్ల మంది భారతీయుల సహకారంతో అభివృద్ధిలో దేశం దూసుకెళుతోంద'ని పేర్కొన్నారు. కాగా, ప్రధాని మోదీ దేశ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. వారిని తన కుటుంబ సభ్యులుగా సంబోధిస్తూ 140 కోట్ల మంది భారతీయుల మద్దతు తనకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, 'పీఎం-సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన' పథకం కింద సబ్సిడీపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటుకు దేశవ్యాప్తంగా కోటి దరఖాస్తులు అందినట్లు ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. శనివారం ఆయన ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు.


ఇదే చివరి అవకాశం..

ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి: ఖర్గే



న్యూఢిల్లీ, మార్చి 16: ప్రజాస్వామ్యాన్ని, మన రాజ్యాంగాన్ని నియంతృత్వం బారి నుంచి కాపాడుకునేందుకు ఇదే చివరి అవకాశమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. శనివారం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఆయన ఈమేరకు వ్యాఖ్యానించారు. 2024 లోక్‌సభ ఎన్నికలు దేశంలో 'న్యాయానికి తలుపు' తెరుస్తాయన్నారు. విద్వేషం, నిరుద్యోగం, ధరల పెరుగుదలపై కలిసి పోరాడుదామని ప్రజలకు పిలుపునిచ్చారు. 'భారత ప్రజలమైన మనం విద్వేషం, దోపిడీ, నిరుద్యోగం, ధరల పెరుగుదల, నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడుదాం. ఈ 'హస్తం' మన పరిస్థితిని మార్చబోతోంది..' అని ఎక్స్‌లో పేర్కొంటూ కాంగ్రెస్ ఎన్నికల గుర్తును పోస్టు చేశారు. 'ఎలక్టోరల్ బాండ్లు, విపక్ష నేతలను జైల్లో వేయడం, సస్పెండ్ చేయడం, దాడులు చేయించడం, ప్రధాన ప్రతిపక్ష పార్టీకి నిధులను స్తంభింపజేయడం వంటి కమ్ముకున్న స్కామ్‌ల మేఘాల కింద మైలురాయిగా నిలిచే ఈ ఎన్నికలు జరగబోతున్నాయి' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా వ్యాఖ్యానించారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'ఈ ఎన్నికలు చాలా కీలకమైనవి.. ఎందుకంటే ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని మనమే రక్షించుకోవాలి లేదా ఓ వ్యక్తి కోరికలు, అభిరుచులు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయి.. రాహుల్ చేపట్టిన యాత్రల ద్వారా రైతులు, యువత, మహిళలు, ముఖ్యంగా నిరుద్యోగులకు చేరువై వారి సమస్యలను లేవనెత్తాం. యువత గురించి ఆలోచించే పార్టీని ప్రజలు ఎన్నుకోవాలి' అని కోరారు.

మోగింది భేరి



(మొదటి పేజీ తరువాయి)

స్థానాలకు పోలింగ్ జరగనుంది. తొలివిడత పోలింగ్ ఏప్రిల్ 19న జరగనుంది. కీలకమైన ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలు, ఆంధ్రప్రదేశ్‌లోని 25 లోక్‌సభ నియోజకవర్గాలకు మే 13న(సోమవారం) నాలుగో దశలో ఎన్నికలు జరగనున్నాయి. అదే రోజు తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు కూడా పోలింగ్ జరగనుంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక కూడా నాలుగో దశ పోలింగ్‌లో భాగంగానే జరుగుతుంది. జూన్ 1న తుది ఏడో విడత పోలింగ్ జరుగుతుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు. జూన్ 16న ప్రస్తుత లోక్‌సభ కాలం పూర్తవుతున్నందువల్ల ఆ లోపే కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు వీలుగా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంది. మణిపూర్‌లో కల్లోలం దృష్ట్యా వివిధ శరణార్థుల శిబిరాల్లో ఉన్న వారికి కూడా ఓటు సౌకర్యం కల్పించాలని కమిషన్ నిర్ణయించింది. ఇక్కడ రెండు లోక్‌సభ స్థానాలకు రెండు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కశ్మీర్ నుంచి వలస వెళ్లిన వారికి కూడా వారు ఎక్కడున్నా అక్కడి నుంచే ఓటు సౌకర్యం కల్పిస్తారు. శనివారం మధ్యాహ్నం నుంచే దేశ వ్యాప్తంగా ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుందని ఎన్నికల కమిషన్ తెలిపింది. విలేకరుల సమావేశంలో కొద్ది రోజుల క్రితం నియమితులైన నూతన కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

22 రాష్ట్రాల్లో ఒకే దశ

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కలిపి 22 చోట్ల ఒకే దశలో పోలింగ్ జరగనుంది. అవి... ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అరుణాచల్ ప్రదేశ్, అండమాన్, చండీగఢ్, దాద్రానగర్ హవేలీ, ఢిల్లీ, గోవా, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, హరియాణా, కేరళ, లక్షద్వీప్, లద్దాఖ్, మిజోరం, మేఘాలయ, నాగాలాండ్, పుదుచ్చేరి, సిక్కిం, తమిళనాడు, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు. కర్ణాటక, రాజస్థాన్, త్రిపుర, మణిపూర్ రాష్ట్రాల్లో రెండు దశల్లో, ఛత్తీస్‌గఢ్, అసోంలలో మూడు దశల్లో, ఒడిసా, మధ్యప్రదేశ్, జార్ఖండ్‌లలో నాలుగు దశల్లో, మహారాష్ట్ర, జమ్ము కశ్మీర్ లలో అయిదు దశల్లో, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఏడు దశ ల్లో వేర్వేరు తేదీల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. ఒడిసా శాసనసభ ఎన్నికలు మే 13, 20, 25, జూన్ 1వ తేదీల్లో నాలుగు దశల్లో జరగనున్నాయి. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం శాసనసభ ఎన్నికలు ఏప్రిల్ 19న జరగనున్నాయి.

ఇంట్లోనే ఓటేయొచ్చు

85 ఏళ్ల వయసు దాటిన వాళ్లందరికీ, 40 శాతానికి మించి అంగ వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఇంతకు ముందే పలు రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టామని, ఈసారి దేశమంతటా అమలు చేస్తున్నామని ప్రకటించారు. అయితే, వృద్ధులు, వికలాంగులు బూత్‌కు వచ్చి ఓటేసేందుకే ఎక్కువగా ఇష్టపడుతున్నారని, అలాంటి వారందరికీ పోలింగ్ కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. 85 లక్షల మంది వృద్ధులు, 88 లక్షల మంది వికలాంగులు ఇంటి నుంచి ఓటుకు అర్హులుగా ఉన్నారని అంచనా వేశారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత వెంటనే జమ్ము కశ్మీర్ శాసనసభ ఎన్నికలు నిర్వహిస్తామని రాజీవ్ కుమార్ ప్రకటించారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌లో జమ్మూ కశ్మీరు కూడా ఉంది. 2014లో చివరిసారిగా జమ్మూ కశ్మీరు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ప్రతీ అభ్యర్థికి భద్రత కల్పించాల్సిన పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా ఎన్నికలు జరుగుతున్న వేళ జమ్మూకశ్మీరు శాసనసభ ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదనే ఉద్దేశంతో ఇప్పుడు నిర్వహించడంలేదని రాజీవ్ కుమార్ చెప్పారు.

ఓటర్లు 97 కోట్ల మంది

ఈ సారి ఎన్నికలకు 97.89 కోట్ల మంది ఓటర్లు నమోదయ్యారని ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ చెప్పారు. వారిలో 47.1 కోట్ల మంది మహిళలు ఉన్నారన్నారు. 12 రాష్ట్రాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే ఎక్కువ మంది ఉన్నారని తెలిపారు. 48 వేల మంది ట్రాన్స్‌జెండర్లుగా ఓటు నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు.

పారదర్శకత మంచిదే

రాజకీయ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చే పద్ధతిని సుప్రీంకోర్టు కొట్టేయడాన్ని ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ స్వాగతించారు. ప్రజాస్వామ్యంలో దాపరికాలకు తావుండరాదని చెప్పారు. సుప్రీంకోర్టులో తమ వాదనలు వినిపించినపుడు కూడా పారదర్శకతకు మద్దతు పలికామన్నారు. వ్యక్తిగత కారణాలతోనే అరుణ్ గోయల్ ఎన్నికల కమిషనర్ బాధ్యతల నుంచి తప్పుకున్నారని, ఆయన ప్రైవసీని గౌరవించాలని సూచించారు.

44 రోజుల సుదీర్ఘ ప్రక్రియ

ఈ సారి లోక్‌సభ ఎన్నికల 'ఓటింగ్ కాలం' 44 రోజుల పాటు కొనసాగనుంది. తొలి పార్లమెంటు ఎన్నికల (1951-52) తర్వాత ఇదే సుదీర్ఘ కాలావధి! నాటి ఎన్నికలలో ఈ గడువు నాలుగు నెలలకు పైనే! ఈ సారి మొదటి దశ పోలింగ్ ఏప్రిల్ 19న, చివరిది జూన్ 1న జరగనున్నాయి. ఈ మొత్తం కాలం 44 రోజులు. అదే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన శనివారం నుంచి ఓట్ల లెక్కింపు జరిగే జూన్ 4 వరకు లెక్కిస్తే 82 రోజులు! ఎన్నికల క్రతువు ఇన్ని రోజుల పాటు కొనసాగడానికి కారణం ఏమిటన్న విలేకరుల ప్రశ్నకు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ బదులిస్తూ ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, సెలవులు, పండుగలు, పరీక్షల వంటి ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ తేదీలను నిర్ణయించడమేనని తెలిపారు. 1980లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ అతి తక్కువగా నాలుగు రోజుల్లోనే పూర్తయింది.

10.5 లక్షలు	పోలింగ్ జరగనున్న బూతులు
55 లక్షలు	ఈ సార్వత్రిక ఎన్నికల కోసం ఉపయోగించే ఈవీఎంల సంఖ్య
1.5 కోట్లు	ఎన్నికల విధుల్లో పాల్గొననున్న సిబ్బంది
3.4 లక్షలు	ఎన్నికల నిర్వహణకు భద్రతా విధుల్లో ఉండే కేంద్ర బలగాలు

కోడ్ ఉల్లంఘిస్తే సీరియస్

ఈసారి ఎన్నికల్లో డబ్బు, కండబలం, తప్పుడు సమాచారం, ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణించనున్నట్లు రాజీవ్ కుమార్ చెప్పారు. రాజకీయ పార్టీలు సోషల్ మీడియా ప్రచారంలో బాధ్యతయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. విద్వేష ప్రసంగాలు, తప్పుడు వార్తలు ప్రచారం చేసే వారి పట్ల కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో నగదు బదిలీపై గట్టి నిఘా ఉంటుందని చెప్పారు. కుల, మత పరమైన విజ్ఞప్తులు కుదరవని స్పష్టం చేశారు. వ్యక్తిగత జీవితం మీద విమర్శలు చేయరాదన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ, మధ్యప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్, గుజరాత్‌లలో భారీ ఎత్తున అక్రమ నగదును స్వాధీనం చేసుకున్నామని గుర్తు చేశారు. మతపరంగా, కుల పరంగా ప్రచారాన్ని, విద్వేష ప్రసంగాల్ని ఉపేక్షించబోమని రాజీవ్‌కుమార్ స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు దాటిన 1.8 కోట్ల మంది కొత్తగా ఓటర్లుగా నమోదయ్యారని, వచ్చే ఏప్రిల్ ఒకటో తేదీకి 18 ఏళ్ల నిండే వారికి కూడా ఇప్పుడే ఓటర్లుగా నమోదయ్యేందుకు అవకాశం ఇచ్చామని వెల్లడించారు. అలా 13.5 లక్షల మంది భావి ఓటర్లు నమోదై, సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

ఏ దశలో.. ఏయే రాష్ట్రాల్లో

తొలి దశలో దేశంలోని 21 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని 102 స్థానాలకు ఏప్రిల్ 19న పోలింగ్ జరగనుంది. ఇందులో అరుణాచల్ ప్రదేశ్(2 స్థానాలకు), అసోం(5), బిహార్(4), ఛత్తీస్‌గఢ్(1), మధ్యప్రదేశ్(6), మహారాష్ట్ర(5), మణిపూర్(2), మేఘాలయ(2), మిజోరం(1), నాగాలాండ్(1), రాజస్థాన్(12), సిక్కిం(1), తమిళనాడు(39), త్రిపుర(1), ఉత్తరప్రదేశ్(8), ఉత్తరాఖండ్(5), పశ్చిమ బెంగాల్ (3), అండమాన్ నికోబార్(1), జమ్మూకశ్మీర్(1), లక్షద్వీప్(1), పుదుచ్చేరి(1) ఉన్నాయి.

రెండో దశలో దేశంలోని 13 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని 89 స్థానాలకు ఏప్రిల్ 26న పోలింగ్ జరగనుంది. ఇందులో అసోం(5), బిహార్(5), ఛత్తీస్‌గఢ్(3), కర్ణాటక(14), కేరళ(20), మధ్యప్రదేశ్(7), మహారాష్ట్ర(8), మణిపూర్(1), రాజస్థాన్(13), త్రిపుర(1), ఉత్తరప్రదేశ్(8), పశ్చిమ బెంగాల్(3), జమ్మూకశ్మీర్(1) ఉన్నాయి.

మూడో దశలో దేశంలోని 12 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని 94 స్థానాలకు మే 7వ తేదీన పోలింగ్ జరుగుతుంది. ఇందులో అసోం(4), బిహార్(5), ఛత్తీస్‌గఢ్(7), గోవా(2), గుజరాత్(26), కర్ణాటక(14), మధ్యప్రదేశ్(8), మహారాష్ట్ర(11), యూపీ(10), పశ్చిమ బెంగాల్(4), దాద్రానగర్ హవేలి, దమన్ దీవ్(2), జమ్మూకశ్మీర్(1) ఉన్నాయి.

నాలుగో దశలో దేశంలోని 10 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని 96 స్థానాలకు మే 13న పోలింగ్ జరుగుతుంది. ఇందులో ఏపీ(25), బిహార్(5), ఝార్ఖండ్(4), మధ్యప్రదేశ్(8), మహారాష్ట్ర(11), ఒడిసా(4), తెలంగాణ(17), యూపీ(13), బెంగాల్(8), జమ్మూకశ్మీర్(1) ఉన్నాయి.

ఐదో దశలో దేశంలోని 8 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని 49 స్థానాలకు మే 20న పోలింగ్ జరుగుతుంది. ఇందులో బిహార్(5), ఝార్ఖండ్(3), మహారాష్ట్ర(13), ఒడిసా(5), ఉత్తరప్రదేశ్(14), పశ్చిమ బెంగాల్(7), జమ్మూకశ్మీర్(1), లద్దాఖ్(1) ఉన్నాయి.

ఆరో దశలో దేశంలోని 7 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని 57 స్థానాలకు మే 25న పోలింగ్ జరుగుతుంది. ఇందులో బిహార్(8), హరియాణా(10), ఝార్ఖండ్(4), ఒడిసా(6), ఉత్తరప్రదేశ్(14), పశ్చిమబెంగాల్(8), ఢిల్లీ(7) ఉన్నాయి.

ఏడో దశలో దేశంలోని 8 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని 57 స్థానాలకు జూన్ 1న పోలింగ్ జరుగుతుంది. బిహార్(8), హిమాచల్(4), ఝార్ఖండ్(3), ఒడిసా(6), పంజాబ్(13), యూపీ(13), బెంగాల్(9), చండీగఢ్(1) ఉన్నాయి.

మండే ఎండల్లో తెలంగాణ పోలింగ్

ఈసారి ఉభయ రాష్ట్రాల్లో పోలింగ్ మండే ఎండల్లో జరగనుంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నీటి సమస్య మొదలైంది. ఎన్నికల ప్రచారం, పోలింగ్ నాటికి ఎండల తీవ్రత పెరుగుతుందని భావిస్తున్నారు. 2019 ఎన్నికల్లో ఇరు రాష్ట్రాలకు ఒకేసారి తొలిదశలోనే పోలింగ్ పెట్టడంతో ఎండల బాధ తక్కువగా ఉంది. 2014లో కూడా ఏప్రిల్ చివరివారంలో తెలంగాణ, మే మొదటివారంలో ఏపీ ఎన్నికలు పూర్తయ్యాయి. ఈ సారి ఏడు దశల్లో ఎన్నికలు పెడుతున్నారు. తెలంగాణ, ఏపీలు కలిపి నాలుగో దశలో మే 13న ఎన్నికలు జరుగుతున్నాయి. జూన్ 4న ఫలితాలు వస్తున్నాయి.

ప్రసార భారతి చైర్మన్‌గా నవనీత్ కుమార్ సెహగల్



న్యూఢిల్లీ, మార్చి 16 : రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నవనీత్ కుమార్ సెహగల్.. ప్రసార భారతి చైర్మన్‌గా నియమితులయ్యారు. ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ.. నూతన చైర్మన్‌గా నవనీత్ కుమార్ సెహగల్‌ను ప్రతిపాదిస్తూ చేసిన సిఫారసుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ప్రసార భారతి చైర్మన్ పదవి నాలుగేళ్లుగా ఖాళీగా ఉంది. చివరిగా ఏ.సూర్యప్రకాశ్ ఈ పదవిలో ఉన్నారు. 2020 ఫిబ్రవరిలో ఆయన రిటైర్ అయ్యారు.

జేకేఎల్‌ఎఫ్‌పై మరో ఐదేళ్ల నిషేధం

న్యూఢిల్లీ, మార్చి 16: తీవ్రవాదం, వేర్పాటువాదాన్ని ప్రేరేపిస్తున్న పలు ఉగ్రవాద సంస్థలపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఉగ్రవాది మొహమ్మద్ యాసిన్ మాలిక్ నేతృత్వంలోని జమ్మూకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్‌ను(జేకేఎల్‌ఎఫ్) ప్రభుత్వం మరో ఐదేళ్లపాటు నిషేధించినట్టు హోంమంత్రి అమిత్ షా 'ఎక్స్' వేదికగా శనివారం ప్రకటించారు. జమ్మూకశ్మీర్ పీపుల్స్ ఫ్రీడమ్ లీగ్‌పై ఐదేళ్ల నిషేధం విధించారు. జేకేపీఎల్(ముక్తార్ అహ్మద్ వాజ్రా), జేకేపీఎల్ (బషీర్ అహ్మద్ టోట), జేకేపీఎల్ (గులామ్ మొహమ్మద్ ఖాన్), జేకేపీఎల్ (అజీజ్ షేక్)లను కూడా నిషేధించినట్టు కేంద్ర హోం శాఖ పేర్కొంది.

పుదుచ్చేరి బీజేపీ సీటుకు 50కోట్లు

చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ఎంపికకు ఆ పార్టీ రాష్ట్ర శాఖ రూ.50 కోట్ల వరకు బేరమాడుతోందని స్వతంత్ర శాసన సభ్యుడు శివశంకరన్ ఆరోపించారు. పుదుచ్చేరిలో ఎన్డీయే తరఫున బీజేపీ బరిలోకి దిగనుంది. బీజేపీ తరఫు అభ్యర్థిని ఖరారు చేసేందుకు ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి నిర్మల్‌కుమార్ స్థానిక నాయకులు, శాసన సభ్యులతో చర్చలు జరిపారు. ఈ చర్చల్లో కారైక్కాల్‌కు చెందిన పారిశ్రామికవేత్త రాజశేఖరన్‌ను బీజేపీ అభ్యర్థిగా సిఫారసు చేస్తూ పార్టీ అధిష్ఠానవర్గానికి ప్రతిపాదన పంపాలని నిర్ణయించారు. అయితే, స్థానిక నాయకులు రాజశేఖరన్‌ను వ్యతిరేకించినప్పటికీ నిర్మల్‌కుమార్ టికెట్ అమ్ముతున్నారని శివశంకరన్ ఆరోపించారు.

ఇదొక దోపిడీ రాకెట్!

ఎలక్టోరల్ బాండ్లపై రాహుల్ ఫైర్



థానే, మార్చి 16: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎలక్టోరల్ బాండ్స్ పథకంపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ నిప్పులు చెరిగారు. దీనిని దోపిడీ రాకెట్‌గా అభివర్ణించారు. ఈ బాండ్స్ ద్వారా అందిన నిధులను ప్రభుత్వాలను కూల్చేసేందుకు, పార్టీలను విచ్ఛిన్నం చేసేందుకు వినియోగించారని మండిపడ్డారు. భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా మహారాష్ట్రలోని జంబాలీనాకా ప్రాంతంలో యాత్ర చేసిన రాహుల్ గాంధీ ఈ సందర్భంగా ఎలక్టోరల్ బాండ్స్‌పై మాట్లాడారు. "ఎలక్టోరల్ బాండ్స్ పథకం.. అంతర్జాతీయ స్థాయి దోపిడీ రాకెట్. ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కూల్చేసేందుకు, రాజకీయ పార్టీలను విచ్ఛిన్నం చేసేందుకు ఈ రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. ప్రభుత్వాన్ని విమర్శించే వారిని ఈడీ, సీబీఐ, ఐటీలు వెంటాడుతున్నాయి" అని దుయ్యబట్టారు. "మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీ ఎమ్మెల్యేలు ఉచితార్థంగా ఆయా పార్టీలను వీడి వెళ్లిపోయారనుకుంటున్నారా?" అని నర్మగర్భంగా ప్రశ్నించారు. వారంతా డబ్బు ఎరజూపితేనే ఏక్‌నాథ్ శిందే, అజిత్ పవార్‌ల వెంట వెళ్లిపోయారని పరోక్షంగా వ్యాఖ్యానించారు. కాగా, ఎన్నికల బాండ్ల విషయంలో బీజేపీని విమర్శిస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ.. తమ పార్టీ తీసుకున్న ఎన్నికల బాండ్లను తిరిగిచ్చేస్తారా? అని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ నిలదీశారు. కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో వినియోగించుకునేందుకు నల్ల ధనం ద్వారా నిధులు సమకూరేవని ఫడణవీస్ ఆరోపించారు. ఆ నల్లధనానికి ఎన్నికల బాండ్ల పథకం అడ్డుకట్టవేయడం వల్లే ఆ పథకాన్ని రాహుల్ విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు.

ఎన్నికల బాండ్ల రద్దు కంటే మెరుగుపరిస్తే బాగుండేది

» కేంద్ర హోం మంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ, మార్చి 16 : రాజకీయాల్లో నల్లధనాన్ని అంతమొందించడానికి తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని పూర్తిగా రద్దు చేయడం కంటే పథకాన్ని మెరుగుపరిస్తే బాగుండేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అభిప్రాయపడ్డారు. ఎలక్టోరల్ బాండ్ల అంశంలో బీజేపీని విమర్శిస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదం అన్నారు. అసలు రాహుల్‌కు అలాంటి మాటలు ఎవరు రాసిస్తారో ? అంటూ ఎద్దేవా చేశారు. ఎలక్టోరల్ బాండ్లు రద్దు వల్ల రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాల్లో మళ్లీ నల్లధనం వచ్చే ముప్పు ఉందన్నారు. "బీజేపీ సహా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.20,000 కోట్లు వచ్చాయి. ఇందులో బీజేపీకి రూ.6వేల కోట్లు వచ్చాయి. మిగిలిన రూ.14వేల కోట్ల మాటేంటి? బీజేపీని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలు బదులివ్వాలి" అని షా నిలదీశారు. అలాగే, నగదు రూపంలో విరాళాలు సేకరించే సమయంలో కాంగ్రెస్‌కు రూ.1100 విరాళామిస్తే అందులో రూ.100నే పార్టీ ఖాతాలో జమ చేసేవారిని ఆరోపించారు. మిగిలిన రూ.1000 కాంగ్రెస్ నేత జేబులోకి వెళ్లేవని పేర్కొన్నారు. ప్రజాధనం వృథాను అరికట్టడానికే తాము జమిలి ఎన్నికలు కోరుకుంటున్నామని అమిత్ షా స్పష్టం చేశారు.



రాందాస్‌కు నివాళులర్పిస్తున్న 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్

నేవీ మాజీ చీఫ్ రాందాస్‌కు సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు

సికింద్రాబాద్, తిరుమలగిరి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): భారత నౌకాదళ మాజీ అధిపతి అడ్మిరల్(రిటైర్డ్) లక్ష్మీనారాయణ్ రాందాస్ అంత్యక్రియలు శనివారం ముగిశాయి. సికింద్రాబాద్, తిరుమలగిరి ఆర్టీసీ కాలనీలోని స్వర్గ వాటికలో సైనిక లాంఛనాల మధ్య కుటుంబసభ్యులు, త్రివిధ దళాలకు చెందిన అధికారులు ఆయనకు అంతిమ వీడ్కోలు పలికారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాందాస్.. సికింద్రాబాద్ మిలటరీ ఆస్పత్రిలో శుక్రవారం తుది శ్వాస విడిచారు. శనివారం ఉదయం అంతిమ సంస్కారాలు నిర్వహించారు. సైనిక లాంఛనాలలో భాగంగా సైనికులు ఆయన మృతదేహాన్ని అంతిమ సంస్కారాలకు తీసుకువచ్చారు. తుపాకీతో గాలిలోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. సర్వమత ప్రార్థనలు నిర్వహించి.. అమర్ రహే.. అమర్ రహే.. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినదించారు. త్రివిధ దళాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు రాందాస్ పార్థివదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. అలాగే, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, సామాజికవేత్త రమా మేల్కొటే, మీరా సంఘమిత్ర, రచయిత దివి కుమార్, మానవ హక్కుల వేదిక నుంచి జీవన్‌కుమార్ తదితర ప్రముఖులు రాందాస్‌కు అంతిమ వీడ్కోలు పలికారు. కాగా, 1933 సెప్టెంబరు5న ముంబైలో జన్మించిన రాందాస్.. 1953 నుంచి 1993 వరకు భారత నౌకా దళంలో వివిధ హోదాల్లో విశిష్ట సేవలందించారు. 1971లో భారత్-పాక్ యుద్ధంలోనూ నౌకాదళ అధికారిగా కీలక పాత్ర పోషించారు. అందుకుగాను భారత ప్రభుత్వం ఆయన్ను వీర్ చక్ర అవార్డుతో సత్కరించింది. 1990 జనవరి 30న 13వ భారత నౌకాదళ అధిపతిగా బాధ్యతలు చేపట్టిన రాందాస్ నేవీలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు.


సీఏఏపై స్టే విధించండి.. సుప్రీంలో ఒవైసీ పిటిషన్

హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)-2019 అమలుపై స్టే విధించాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. ఇప్పటికే ఈ విషయంలో తాను వేసిన పిటిషన్ పరిశీలనలో ఉండగానే కేంద్రం సీఏఏ అమలుచేయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. పిటిషన్ల తుది తీర్పు వచ్చే వరకు సీఏఏ చట్టం- 2024 నిబంధనల అమలుపై స్టే విధించాలని సుప్రీంకోర్టును కోరినట్లు ఆయన తెలిపారు. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో పోటీ చేస్తుందని అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు.

కర్ణాటకను ఏటీఎం చేసుకున్నారు

కలబురగి బహిరంగ సభలో ప్రధాని వ్యాఖ్యలు

బెంగళూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకను కాంగ్రెస్ కుటుంబం ఏటీఎంగా మార్చుకుందని ప్రధాని మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బీజేపీని గెలిపించి, కర్ణాటకను కాంగ్రెస్ లూటీ నుంచి కాపాడాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కర్ణాటక రాష్ట్రంలోని కలబురగి నగరంలోని ఎన్‌వీ క్రీడామైదానంలో శనివారం మధ్యాహ్నం జరిగిన భారీ బహిరంగసభలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ఈసారి కర్ణాటక నుంచి కాంగ్రెస్‌కు ఖాతా తెరిచే అవకాశం ఇవ్వబోమని తనకు హామీ ఇవ్వాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'ఇండియా కూటమి' నేతలు కూడా 'అబ్ ఏక్‌బార్ మోదీ సర్కారు' అని చెబుతున్నారని మోదీ సరదాగా వ్యాఖ్యానించారు. కేంద్రప్రభుత్వం కర్ణాటక సమగ్ర అభివృద్ధికి ఎంతగానో సహకారం అందించిందని పేర్కొన్నారు. రెండు రోజులుగా దక్షిణభారత రాష్ట్రాల్లో పర్యటిస్తున్నానని, అన్నిచోట్లా ప్రజాభిమానం బీజేపీ పట్ల వెల్లువెత్తుతోందన్నారు. ఇదిలా ఉండగా, ఎన్నికల షెడ్యూల్‌కు కొన్ని గంటల ముందు 'నేను మోదీ పరివారం' అనే సంగీత ప్రధాన ప్రచార వీడియోను మోదీ తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. పదేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పొందిన లబ్ధిదారులపై ఈ వీడియో తయారైంది.



రష్యా అధ్యక్ష ఎన్నికల మొదటి రోజు పోలింగ్ సందర్భంగా శనివారం పుతిన్ ఎలక్ట్రానిక్ పద్ధతిలో తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల్లో ఆయన స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నారు. పోలింగ్ 3 రోజుల పాటు జరగనుంది.



కరీంనగర్‌లోని ప్రతిమ మల్టీప్లెక్స్; మల్టీప్లెక్స్‌లో సీజ్ చేసిన నగదు

కరీంనగర్ ప్రతిమ మల్టీప్లెక్స్‌లో 6.67 కోట్ల నగదు పట్టివేత

» బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ బంధువుల మల్టీప్లెక్స్

» ఎన్నికల్లో పంపిణీ చేసేందుకే దాచారన్న ప్రత్యర్థి పార్టీలు

కరీంనగర్ క్రైం, మార్చి 16: కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ సమీప బంధువులకు చెందిన ప్రతిమ మల్టీప్లెక్స్‌లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం దాకా జరిపిన ఈ తనిఖీల్లో.. మల్టీప్లెక్స్ సెల్లార్‌లోని అకౌంట్స్ ఆఫీస్ గదిలో రూ.6.67 కోట్ల నగదును గుర్తించి సీజ్ చేశారు. ఈ నగదుకు సంబంధించి మల్టీప్లెక్స్ జనరల్ మేనేజర్ పి.రాఘవేంద్రబాబును వివరణ కోరగా సరైన సమాధానం ఇవ్వలేదని కరీంనగర్ టౌన్ ఏసీపీ జి.నరేందర్ తెలిపారు. దీంతో నగదును సీజ్ చేసి ఆదాయపు పన్నుశాఖ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. కాగా, వినోద్‌కుమార్ సమీప బంధువులకు చెందిన మల్టీప్లెక్స్‌లో నగదును పట్టివేయడం రాజకీయ వర్గాల్లో చర్చకు తెరలేపింది. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లకు పంపిణీ చేసేందుకు వినోద్‌కుమారే డబ్బును అక్కడ దాచిపెట్టారని అధికార కాంగ్రెస్‌తోపాటు ఇతర పక్షాలు ఆరోపిస్తున్నాయి.

రైతన్న దేవుడి కంటే ఎక్కువ

అన్నదాతను కాపాడుకోవాలి: తుమ్మల

ఖమ్మం/హైదరాబాద్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): దేవుడు మనిషిని సృష్టిస్తే రైతు అన్నం పెడుతున్నాడని, అలాంటి రైతు దేవుడి కంటే ఎక్కువని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. అన్నదాతను కాపాడుకోకపోతే కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదముందన్నారు. రైతులు బాగుండాలని ప్రతి ఒక్కరూ కోరుకోవాలని, హమాలీ నుంచి ప్రధాని వరకు రైతు సంక్షేమం కోసమే పనిచేయాలని సూచించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం మార్కెట్ రూ.55 లక్షలతో 2,760 మంది కార్మికులకు కార్మిక సంక్షేమం కింద యూనిఫాంలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. రైతులు ఎన్నో కష్టనష్టాలకు, ప్రకృతి వైపరీత్యాలకు ఓర్చి అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి పంటలు పండిస్తారని, అటువంటి అన్నదాతను రక్షించుకోవడం అందరి బాధ్యత అన్నారు. రైతులు విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడటంతో నేల ఆరోగ్యం దెబ్బతింటున్నదని, నాణ్యమైన దిగుబడులు రావడంలేదని మంత్రి తుమ్మల ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్రాన్ హోఫర్ హేనిరిచ్ హెర్ట్జ్ ఇనిస్టిట్యూట్ కు చెందిన పరిశోధన బృందం ప్రతినిధులు డాక్టర్ సెబాస్టియన్ బాసి, డాక్టర్ రఘు చిలగంటిలు శనివారం మంత్రిని సచివాలయంలో కలిశారు. వీరు రూపొందించిన 'ఏసీఆర్ ఏటీ'(యాక్సిలరేటింగ్ క్లైమేట్ రీ సైలెంట్ అగ్రికల్చర్ ఇన్ తెలంగాణ) ప్రాజెక్టును, దాని ద్వారా రైతాంగానికి, జీవావరణానికి కలిగే ప్రయోజనాలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మన పూర్వీకులు ఆచరించిన పద్ధతులు, నవీన సాంకేతికతను వాడుకుంటూ ముందుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు.

ధరణి స్పెషల్ డ్రైవ్ నిలిపివేత

» లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో నిర్ణయం

హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ధరణి సమస్యల పరిష్కారానికి చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌ను ప్రభుత్వం నిలిపివేసింది. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ధరణి స్పెషల్ డ్రైవ్‌ను నిలిపివేస్తూ భూ పరిపాలన ముఖ్య కమిషనర్ (సీసీఎల్ఏ) నవీన్ మిత్తల్ శనివారం కలెక్టర్లకు మెమో జారీ చేశారు. ధరణిలో సాధారణ సేవలు కొనసాగించాలని ఆదేశించారు.

బీసీలకు అన్ని రంగాల్లో న్యాయం: పొన్నం

హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కులగణన నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వ కట్టుబడి ఉందని, బీసీలకు అన్ని రంగాల్లో న్యాయం జరిగేలా చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో 40 బీసీ కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులు మంత్రి పొన్నం ప్రభాకర్‌తో భేటీ అయ్యారు. సమగ్ర కులగణన చేపట్టడానికి ప్రభుత్వం జీవో జారీ చేయడం పట్ల బీసీ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఆయా సంఘాల ఆధ్వర్యంలో సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంను సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. గతంలో ఉన్న 11కులాల ఫెడరేషన్లను యథావిధిగా కొనసాగిస్తామని, వాటిని కార్పొరేషన్లుగా మార్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. నూతనంగా 8 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని, ఇంకా బీసీ కులాల్లో కార్పొరేషన్ లేని కులాలకు పార్లమెంట్ ఎన్నికల తర్వాత కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ఆనాడే కవితను ఎందుకు అరెస్టు చేయలేదు?

» బీఆర్ఎస్, బీజేపీ కలిసి డ్రామాలు: పొంగులేటి

మహబూబాబాద్/హైదరాబాద్/మోత్కూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి కోసమే బీఆర్ఎస్, బీజేపీ డ్రామాలు ఆడుతున్నాయని.. అందులో భాగంగానే ఎమ్మెల్సీ కవిత అరెస్టు జరిగిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 'నేను కొట్టినట్లు చేస్తా.. నువ్వు ఏడ్చినట్లు చేయ్' అన్న చందంగా ఇరు పార్టీల వైఖరి ఉందని విమర్శించారు. శనివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన పొంగులేటి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కవితను ఏడాది క్రితమే ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌కు ఒక్కరోజు ముందు అరెస్టు చేయడమంటే.. ఎన్నికల్లో పరస్పర లబ్ధి పొందడానికేనని స్పష్టమవుతుందన్నారు. రాహుల్‌గాంధీని ప్రధాని చేయాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. లిక్కర్ కేసులో కవితను అరెస్టు చేసేటప్పుడు ఆమె ముఖంలో కనీసం పశ్చాత్తాపమే కనిపించలేదని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. ఏదో దేశం కోసం, ప్రజల కోసం త్యాగం చేసినట్లుగా కవిత హావభావాలు ఉన్నాయని విమర్శించారు. ఆమె అరెస్టుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఆందోళనలకు పిలుపునివ్వడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు ఫోన్ కాల్స్‌ను పరిశీలిస్తే ఆయన బీజేపీ, అమిత్‌షాలతో టచ్‌లో ఉన్నారో.. లేదో తెలుస్తుందన్నారు. లిక్కర్ స్కాంలో దోచుకుతిన్నందుకు కవితను అరెస్టు చేస్తే గగ్గోలు పెట్టడం ఎందుకని ఎమ్మెల్యే మందుల సామేలు ప్రశ్నించారు. లిక్కర్ దందాలో చేరి కవిత తెలంగాణ ఇజ్జత్ తీసిందని విమర్శించారు.

జూపార్కులో 125 ఏళ్ల తాబేలు మృతి

మదీన, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నిజాం హయాంలో ఏర్పాటు చేసిన నెహ్రూ జూలాజికల్ పార్కులోని 125 ఏళ్ల వయసు గల అతి పురాతన తాబేలు శనివారం మృతి చెందింది. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఈ తాబేలు పది రోజులు సరిగా ఆహారం తీసుకోకపోవడంతో వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎ హకీమ్ ఆధ్వర్యంలో చికిత్సలు అందజేస్తున్నారు. పలు అవయవాలు చెడిపోవడం కారణంగానే ఈ తాబేలు చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు.

గవర్నర్ కార్యదర్శి సురేంద్ర మోహన్ బదిలీ

హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజోతి): గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ముఖ్య కార్యదర్శి కె. సురేంద్ర మోహన్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా కొనసాగుతున్న బుర్ర వెంకటేశంకు అదనపు బాధ్యతలు అప్పగించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సురేంద్ర మోహన్‌ను జీఏడీలో రిపోర్ట్ చేయాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

కవితే కీలక కుట్రదారు



ఢిల్లీలో సీబీఐ కోర్టు నుంచి వెలుపలకు వస్తున్న ఎమ్మెల్సీ కవిత

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వాలో వివరిస్తూ పదిహేను పేజీల నివేదికను సమర్పించింది. శరత్‌రెడ్డి, రాఘవ మాగుంట, మాగుంట శ్రీనివాసులురెడ్డితోపాటు సౌత్ గ్రూప్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న కవిత.. ఆమ్ ఆద్మీ పార్టీ అగ్రనేతలతో కుమ్మక్కయారని ఈడీ ఆరోపించింది. మద్యం కుంభకోణంలో భారీ ఎత్తున అక్రమార్జన సాగించేందుకు వీలుగా రూ.100 కోట్ల మేర ముడుపులు చెల్లించారని తెలిపింది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, అప్పటి ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్ మంత్రి మనీశ్ సిసోడియాలతో కవిత ఒక ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపింది. ఆ ఒప్పందంలో భాగంగానే సౌత్ గ్రూప్ సభ్యులతో కలిసి దళారుల ద్వారా ఆమ్ ఆద్మీ పార్టీ నేతలకు ముడుపులు చెల్లించారని పేర్కొంది. ముడుపులు అందిన కారణంగానే ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు కవితకు ఢిల్లీ రాష్ట్ర మద్యం పాలసీ వివరాలను అధికారికంగా నిర్ణయం తీసుకోవడానికి ముందే వెల్లడించారని ఆరోపించింది. ఎలాంటి పెట్టుబడులు పెట్టకుండానే తన డమ్మీ అరుణ్ పిళ్లై ద్వారా కవిత ఇండో స్పిరిట్‌లో భాగస్వామ్యం పొందారని, దేశంలోనే అతిపెద్ద ఉత్పత్తిదారుల్లోనే ఒకటైన పెర్నార్డ్ రికార్డ్ ఇండియా పంపిణీ వ్యాపారంలో కూడా వాటాదారు అయ్యారని పేర్కొంది. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీలో ఇండో స్పిరిట్‌కు అత్యధిక లాభాలు వచ్చేలా కవిత చూశారని, అందులో లాభాల రూపంలో భారీ ఎత్తున ఆర్జించారని వివరించింది. హోల్‌సేల్ వ్యాపారి లాభాల మార్జిన్‌ను 12 శాతానికి పెంచి, అందులో కొంత భాగం ముడుపులుగా స్వీకరించేందుకు వీలుగా ఎక్సైజ్ విధానాన్ని రూపొందించారని తెలిపింది. ఈ విధంగా లభించే నిరంతర ముడుపులతో మొదట సౌత్ గ్రూప్ చెల్లించిన వంద కోట్ల ముడుపులను తిరిగి రాబట్టుకోవడమే కాకుండా భారీ ఎత్తున అక్రమ లాభాలు గడించిందని పేర్కొంది.

ఇచ్చిన అవకాశాలు వాడుకోలేదు

కవిత వివిధ మార్గాల ద్వారా పంపించిన వంద కోట్లను ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నికల ప్రచారానికి మళ్లించినట్లు ఈడీ పేర్కొంది. పైన పేర్కొన్న సాక్ష్యాలన్నీ కవిత ఢిల్లీ ప్రభుత్వ ముఖ్యులకు వంద కోట్ల రూపాయల ముడుపులు ఇచ్చినట్లు ధ్రువీకరిస్తున్నాయని చెప్పింది. మొత్తం వ్యవహారంలో అభిషేక్ బోయిన్‌పల్లి, బుచ్చిబాబు ఆమెకు సహకరించారని పేర్కొంది. ఇండో స్పిరిట్‌లో కవితకు బినామీగా అరుణ్ పిళ్లై వ్యవహరించారని నిర్ధారించింది. దర్యాప్తులో సహకరించడానికి కవితకు ఎన్నో అవకాశాలు కల్పించామని, వాటిని వినియోగించుకోలేదని ఈడీ తెలిపింది. 2023 సెప్టెంబరు 4న, 2024 జనవరి 3న ఇచ్చిన సమన్లను తిరస్కరించిందని చెప్పింది. నాలుగు సార్లు స్టేట్‌మెంట్లు ఇచ్చినప్పటికీ పూర్తి వివరాలు వెల్లడించలేదని, దర్యాప్తునకు సహకరించలేదని చెప్పింది. మార్చి 15న హైదారాబాద్‌లోని ఆమె నివాసంలో మనీలాండరింగ్ చట్టం కింద సోదాలు చేస్తుంటే కుటుంబ సభ్యులు, గుర్తు తెలియని కొందరు వ్యక్తులు గలాభా సృష్టించారని ఈడీ ప్రస్తావించింది. ఈ గందరగోళంలో పాల్గొన్న వ్యక్తుల గురించి ఈడీ ప్రత్యేకంగా పంచానామాలో నమోదు చేసింది.

మొదటి నుంచీ బుకాయింపే



"మనీలాండరింగ్ చట్టం సెక్షన్ 50 కింద కవిత ఇచ్చిన స్టేట్‌మెంట్లలో అడిగిన వాటన్నింటికీ అడ్డంగా బుకాయించారు. ఇండో స్పిరిట్‌లో తనకు వాటాయే లేదన్నారు. బుచ్చిబాబు మాగుంట రాఘవల మధ్య వాట్సాప్ చాట్‌ను తాను చూడలేదని చెప్పారు. దర్యాప్తును ఆలస్యం చేసేందుకు దురుద్దేశంతో కేసులు పెట్టారు. తప్పుడు సమాచారంతో సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. తన ఫోన్లను బలవంతంగా లాక్కొన్నారని ఆరోపించారు. నిజానికి 2023 మార్చి 21న కవిత తానే స్వయంగా 9 మొబైళ్లను తీసుకొచ్చి రాజకీయ ప్రచారం చేసుకున్నారు. 2023 మార్చి 11న మేం ఆమె దగ్గర ఒక ఫోన్‌ను స్వాధీన పరుచుకున్నప్పుడు ఏ నిబంధనల ప్రకారం ఆ ఫోన్‌లోని వివరాలను రాబట్టవచ్చో వివరించాం. అయినప్పటికీ ఆమె మాపై తప్పుడు ఆరోపణలు చేశారు. నిర్దిష్టమైన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా రాజకీయ ప్రకటనలు చేశారు. తనకు, సీఏకు మధ్య జరిగిన చాట్‌ను గుర్తించేందుకు కూడా ఆమె నిరాకరించారు. బుచ్చిబాబుతో చాట్‌లో ఒక చోట 'నేను, అభిషేక్ నిన్న గౌతంను కలిశాం. 30శాతానికి బదులు 45శాతం ఇవ్వమని గౌతంకు చెప్పాను. మళ్లీ శుక్రవారం కలుస్తున్నాం' అని కవిత పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఒక్క ప్రశ్నకు కూడా కవిత సమాధానం ఇవ్వలేదు" అని ఈడీ పేర్కొంది. ఈ మేరకు శనివారం కోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. ఆమె జవాబు ఇవ్వడానికి నిరాకరించినా ఇండో స్పిరిట్ నుంచి చాట్‌లో పేర్కొన్న ముత్తా గౌతం(ఇండియా అహెడ్, ఆంధ్రప్రభ యజమాని)కు రూ.1.70కోట్లు ముట్టినట్లు తమ దగ్గర ఆధారాలు ఉన్నట్లు ఈడీ పేర్కొంది. కవిత తన ఫోన్ నెంబరు 8008666666లోని సాక్ష్యాలను ధ్వంసం చేశారని, ఆమె ఇచ్చిన ఒక ఫోన్‌లో ఎలాంటి డేటా లేదని ఈడీ తెలిపింది. మరో తొమ్మిది ఫోన్లను కూడా పూర్తిగా ఫార్మాట్ చేసి సమర్పించారని, వాటిలో సమాచారాన్ని ఎవరు తొలగించారో అడిగితే చెప్పలేదని ప్రస్తావించింది. 2023 మార్చి 11న సమన్లను జారీ చేసిన తర్వాతే ఇందులో నాలుగు ఫోన్లను ఫార్మాట్ చేసినట్లు ఫోరెన్సిక్ పరీక్షలో తేలిందని ఈడీ పేర్కొంది. తాము సంపాదించిన సాక్ష్యాల మేరకు మనీలాండరింగ్ చట్టం ప్రకారం కవిత నేరానికి పాల్పడినట్లు తేలిందని ఈడీ చెప్పింది. సెక్షన్ 19 ప్రకారం కవితను అరెస్టు చేసే అధికారం తమకు ఉందని స్పష్టం చేసింది. ఆ అధికారంతోనే శుక్రవారం ఆమెను అరెస్టు చేశామని చెప్పింది. అరెస్టు కారణాలను కవితకు, ఆమె భర్తకు వివరించామని పేర్కొంది.



కవితకు వ్యతిరేకంగా 13 సాక్ష్యాలు

వంద కోట్ల ముడుపులను మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాఘవ మాగుంట, గోపి కుమరన్, శరత్‌రెడ్డి, సమీర్ మహేంద్రు, దినేష్ ఆరోరా, అరుణ్ పిళ్లై, వి.శ్రీనివాస్, బుచ్చిబాబు ధ్రువీకరించాని ఈడీ పేర్కొంది. వీరు తమ ముందు ఇచ్చిన స్టేట్‌మెంట్లే కవితకు వ్యతిరేకంగా లభించిన 13 సాక్ష్యాలని పేర్కొంది. ఈడీ చెప్పిన ప్రకారం అప్రూవర్‌గా మారిన వారి స్టేట్‌మెంట్లు ఇలా ఉన్నాయి.

1) మాగుంట శ్రీనివాసులురెడ్డి: ఢిల్లీలో మద్యం వ్యాపారం చేయడానికి కవిత తనను సంప్రదించారని, రూ.100 కోట్లు ఆమ్‌ఆద్మీ పార్టీకి ఇచ్చేందుకు అంగీకరించారని కేజ్రీవాల్ 2021 మార్చి 16న ఆయన కార్యాలయంలోనే స్వయంగా నాతో చెప్పారు. కవితను కలుసుకోవాలని కేజ్రీవాల్ నాకు సలహా ఇచ్చారు. తర్వాత 2021 మార్చి 19న కవితే నాకు స్వయంగా ఫోన్ చేసి హైదరాబాద్ రమ్మన్నారు. హైదరాబాద్‌లో కలిసినపుడు రూ.100 కోట్ల ముడుపుల్లో రూ.50 కోట్లు తన సీఏ బుచ్చిబాబుకు ఇవ్వాలని కవిత చెప్పారు. మర్నాడే బుచ్చిబాబు నన్ను, మా అబ్బాయి రాఘవ మాగుంటను కలిశారు. కవిత సూచనల మేరకు అభిషేక్ బోయిన్‌పల్లి, బుచ్చిబాబులకు రూ.25 కోట్లు చెల్లించాం. (గతేడాది జూలై 14, 17 స్టేట్‌మెంట్లు)

2) మాగుంట రాఘవ: 2021 మార్చి 28న మా ఉద్యోగి గోపి కుమరన్ చైన్నెలో బుచ్చిబాబు ఇచ్చిన ఒక చిరునామాకు రూ.10 కోట్లు పంపించారు. మరో రూ.15 కోట్లు అభిషేక్ బోయిన్‌పల్లి ఇచ్చిన చిరునామాకు పంపించారు. (2023 జూలై 27)

3) గోపీ కుమరన్: అవును ఆ సొమ్మును నేనే రాఘవ చెప్పిన విధంగా ఇచ్చాను.(2023 ఆగస్టు 8)

4) శరత్‌రెడ్డి: ఢిల్లీ మద్యం కుంభకోణంలో కవిత నిర్వహిస్తున్న పాత్ర గురించి అరుణ్ పిళ్లై నాకు చెప్పారు. కేజ్రీవాల్, సిసోడియాలను కవిత డీల్ చేస్తున్నారని, విజయ్ నాయర్ ద్వారా రూ.100 కోట్లు చెల్లించేందుకు సిద్ధమయ్యారని అరుణ్ పిళ్లై చెప్పారు. అరుణ్ పిళ్లైతో హైదరాబాద్‌లో కవితను కలిశాను. మాగుంట శ్రీనివాసులురెడ్డితో కూడా మాట్లాడుతున్నానని చెప్పింది. ఢిల్లీ మద్యం వ్యాపారంలో వాటా కావాలంటే రూ.100 కోట్లు ముడుపులు చెల్లించాల్సి ఉంటుందని కవిత చెప్పారు. వ్యాపారం ప్రారంభమైన తర్వాత కొంత చెల్లిస్తానని చెప్పా. **(2023 ఏప్రిల్ 25, 29 స్టేట్‌మెంట్లు)**

5) సమీర్ మహేంద్రు(ఇండో స్పిరిట్స్): కవిత, మాగుంట, శరత్‌రెడ్డిలే మొత్తం పెట్టుబడి పెడుతున్నారని అరుణ్ పిళ్లై నాకు చెప్పారు. పెర్నార్డ్ రికార్డ్ తన వ్యాపారాన్ని ఇండో స్పిరిట్స్‌కు ఇచ్చేందుకు ఒప్పుకున్న తర్వాత అరుణ్ పిళ్లై నన్ను కవితతో ఫేస్‌టైంలో మాట్లాడించారు. మధ్యలో లైసెన్స్ ప్రక్రియ ఇబ్బందుల్లో పడ్డాక కూడా కవిత నాతో ఫోన్లో మాట్లాడారు. హైదరాబాద్‌లో కవితను ఆమె నివాసంలో కూడా కలుసుకున్నా. ఆ సమయంలో శరత్‌రెడ్డి, అరుణ్‌పిళ్లై, అభిషేక్ బోయిన్‌పల్లి, ఆమె భర్త అనిల్ కూడా అక్కడే ఉన్నారు. ఇండో స్పిరిట్ ఎదుర్కొంటున్న సమస్యల గురించి కవిత నన్ను అడిగారు. (2022 నవంబరు 12 స్టేట్‌మెంట్)

6) దినేష్ ఆరోరా: కవిత, అరుణ్ పిళ్లై, విజయ్‌నాయర్‌లను 2022 అక్టోబరు 3న ఢిల్లీలోని లీ మెరిడియన్‌లో కలుసుకున్నా. అక్కడే ముడుపుల గురించి చర్చించాం.

7) అరుణ్ పిళ్లై: మిగతా వాళ్లు చెప్పినవన్నీ నిజమే. **(2022 నవంబరు 11, 2023 మార్చి 16 స్టేట్‌మెంట్లు)**

8) దినేష్ ఆరోరా లీమెరిడియన్ హోటల్ రూమ్ బుక్ చేశారు.

9) కవిత బంధువైన వి.శ్రీనివాస్ తాను కవిత ఆదేశాల మేరకు రూ.కోటి అరుణ్‌పిళ్లైకు చెల్లించినట్లు చెప్పాడు.

10) కవిత సీఏ బుచ్చిబాబు: కవితకు కేజ్రీవాల్ మనిష్ సిసోడియాలతో రాజకీయ అవగాహన ఉంది. విజయ్ నాయర్ కవితను 2021 మార్చి 19, 20 తేదీలలో కలిశారు. ఆమెను సంప్రదించిన తర్వాతే ఢిల్లీ మద్యం విధానాన్ని రూపొందించారు. ఆప్‌కు ముందుగా కొంత డబ్బు చెల్లించడం, తర్వాత అరుణ్ పిళ్లై పేరుతో ఇండో స్పిరిట్‌లో భాగస్వామ్యం సంపాదించడం, ఇండో స్పిరిట్‌కు పెర్నార్డ్ రికార్డ్ పంపిణీ వ్యాపారం లభించేలా చూడడం మొదలైనవన్నీ ముందుగానే నిర్ణయించుకున్నారు. రాఘవ మాగుంటతో నేను చేసిన చాట్ కూడా ఉంది. అందులో కవిత పేరుకు బదులు మేడం అని ఉంటుంది. (2023 ఫిబ్రవరి 28)

11) రాఘవ మాగుంట: బుచ్చిబాబుతో చాట్ నిజమే(2023 ఫిబ్రవరి 17 స్టేట్‌మెంట్)

12) మద్యం విధానంపై మంత్రుల బృందం నివేదిక, ఎక్సైజ్ శాఖ అధికారుల నివేదికలో కొన్ని భాగాలు విజయ్ నాయర్ బుచ్చిబాబుకు పంపించారు. బుచ్చిబాబు ఫోన్లో అవి ఈడీకి లభించాయి.

13) కవిత సిబ్బందిలో ఒకరు: రెండు పెద్ద బ్యాగులలో నగదును దినేష్ ఆరోరా కార్యాలయం నుంచి తీసుకుని వినోద్ చౌహాన్ అనే వ్యక్తికి అందజేశాను.



ఢిల్లీలో కవిత భర్త అనిల్

ఢిల్లీ లిక్కర్ స్కామ్.. కవిత భర్త అనిల్‌పై ఈడీ ఫోకస్

» మరో ముగ్గురు వ్యక్తిగత సిబ్బందిపై కూడా

» విచారణకు రావాలంటూ నోటీసులు

హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఎమ్మెల్సీ కవిత భర్త అనిల్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దృష్టి సారించింది. శుక్రవారం కవితను అరెస్టు చేసిన ఈడీ.. ఆమెను ఢిల్లీకి తరలించిన విషయం తెలిసిందే.! ఇప్పుడు అనిల్‌తోపాటు.. కవిత వద్ద పనిచేస్తున్న ముగ్గురు వ్యక్తిగత సిబ్బందిని కూడా విచారించేందుకు ఈడీ సిద్ధమైంది. శుక్రవారం కవిత అరెస్టు సందర్భంగా ఈడీ ఐదు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. వాటిల్లో అనిల్‌తోపాటు.. ముగ్గురు సిబ్బంది ఫోన్లు ఉన్నాయి. విచారణ సమయంలో వారి ముందే ఆ ఫోన్లను అన్‌లాక్ చేసి, సమాచారాన్ని పరిశీలించేందుకు ఈడీ సిద్ధమవుతోంది. ముఖ్యం గా ఈ కేసుకు సంబంధించిన సమాచారాన్ని అనిల్ నుంచి రాబట్టనున్నట్లు సమాచారం. ఈ స్కామ్‌లో హైదరాబాద్ నందినగర్‌లోని కవిత నివాసంలో పలు సమావేశాలు జరిగినట్లు ఈడీ ఇప్పటికే గుర్తించింది. గతంలో ఈడీ ఢిల్లీలోని రౌజ్‌అవెన్యూ కోర్టుకు ఇచ్చిన పలు రిమాండ్ రిపోర్టుల్లోనూ ఈ అంశాన్ని ప్రస్తావించింది. 2020 ఆరంభంలో కవిత ఇంట్లో జరిగిన భేటీలో ఈ కేసులో సహనిందితులుగా ఉన్న సమీర్ మహేంద్రు, శరత్‌రెడ్డి, అరుణ్ పిళ్లై, అభిషేక్ బోయిన్‌పల్లి పాల్గొన్నారు. వీరితోపాటు.. అనిల్ కూడా పాల్గొన్నట్లు కోర్టుకు ఇచ్చిన రిపోర్టులో పేర్కొంది. ఈ నేపథ్యంలో అసలు ఆ రోజు సమావేశంలో ఏం మాట్లాడారు? అనే అంశంపై అనిల్‌ను విచారించనున్నట్లు స్పష్టమవుతోంది. మనీలాండరింగ్ కింద రూ.కోట్లు చేతులు మారినట్లు ఇప్పటికే ఈడీ నిర్ధారించింది. ఆ నగదు హవాలాకు సంబంధించిన అంశాలపైనా అనిల్‌ను విచారించే అవకాశాలున్నాయి.

ఈడీ కస్టడీకి ఎమ్మెల్సీ కవిత

7 రోజులపాటు కస్టడీకి ఢిల్లీ కోర్టు అనుమతి.. రోజూ కుటుంబ సభ్యులు, న్యాయవాదులు కవితను కలవొచ్చు

న్యూఢిల్లీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు.. ఏడు రోజులపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీకి అప్పగించింది. శనివారం సుదీర్ఘంగా జరిగిన వాదనల అనంతరం ఈ నెల 23వ తేదీ వరకు ఈడీ కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు అనుమతి ఇచ్చింది. అయితే ప్రతి రోజూ కుటుంబ సభ్యులు, న్యాయవాదులు ఆమెను కలవొచ్చని, ఇంటి నుంచి భోజనం తెప్పించుకోవచ్చని తెలిపింది. కవితను శుక్రవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో అరెస్ట్ చేసి ఢిల్లీకి తీసుకొచ్చిన ఈడీ అధికారులు.. రాత్రంతా ఈడీ కార్యాలయంలోనే ప్రత్యేక సెల్‌లో ఉంచారు. శనివారం ఉదయం వైద్య పరీక్షల అనంతరం ఢిల్లీలోని రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టులో న్యాయమూర్తి నాగ్‌పాల్ ఎదుట హాజరుపరిచారు. కవిత తరఫున సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు వినిపించగా, ఈడీ తరఫున న్యాయవాదులు, స్పెషల్ పీపీ ఎన్‌కే మట్టా, ఈడీ స్పెషల్ కౌన్సిల్ జోహెబ్ హుస్సేన్ వాదనలు వినిపించారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఈడీ సమన్లు పంపితే కవిత హాజరు కావడం లేదని న్యాయవాది జోహెబ్ హుస్సేన్ తెలిపారు. గతంలోనే 10 ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, అందులో నాలుగు ఫోన్లను ఆమె ముందే ఫార్మట్ చేశారని పేర్కొన్నారు. ఇక శుక్రవారం అరెస్టు చేసిన సందర్భంలో ఐదు ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కవితతోపాటు ఆమె భర్త ఫోన్, సిబ్బందికి చెందిన మరో మూడు ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణంలో కవితది కీలక పాత్ర అని, ఆమె నుంచి మరింత సమాచారం సేకరించాల్సి ఉందని తెలిపారు. అందుకే కవితను 10 రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని న్యాయస్థానాన్ని ఈడీ కోరింది. సుదీర్ఘ వాదనల తర్వాత ఈ నెల 23వ తేదీ వరకు ఈడీ కస్టడీకి అనుమతి ఇస్తున్నట్టు కోర్టు తెలిపింది.

19న సుప్రీంలో విచారణ..అప్పటిదాకా ఆపండి

దేశ సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో ఇచ్చిన హామీని దర్యాప్తు సంస్థ ఈడీ ఉల్లంఘించిందని కవిత తరఫు న్యాయవాది విక్రమ్ చౌదరి తెలిపారు. ఈడీ సమన్లు ఇచ్చినప్పుడు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశామని చెప్పారు. కవితకు సమన్లు ఇవ్వబోమని, అరెస్టు చేయబోమని గతేడాది సెప్టెంబరు 15న ఈడీ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు చెప్పారని గుర్తు చేశారు. సెప్టెంబరు 26న మరోసారి వాదనలు జరిగాయని చెప్పారు. సుప్రీంకోర్టులో ఈడీ చెప్పిన అన్ని విషయాలతో పిటిషన్ సమర్పిస్తామన్నారు. శుక్రవారం మధ్యాహ్నం సుప్రీంకోర్టులో వాదనలు పూర్తయ్యాయని, కేసు విచారణ వాయిదా పడిందని, ఆ తర్వాత కొద్దిసేపటికే కవిత ఇంట్లో తనిఖీలు ప్రారంభించారని చెప్పారు. ముందస్తు ప్రణాళికలో భాగంగానే కవిత ఇంటికి చేరారని తెలిపారు. ముందు సోదాలని చెప్పి, ఆ తర్వాత అరెస్ట్ చేశారన్నారు. ఈనెల 19న మరోసారి కవిత పిటిషన్‌పై విచారణ ఉందని, అప్పటి వరకు అరెస్టు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. దర్యాప్తు సంస్థ సుప్రీంకోర్టుకు అబద్ధాలు చెబుతోందని, ఈడీ తన అధికారాన్ని దుర్వినియోగం చేసిందనడానికి ఈ కేసు ఉదాహరణ అని పేర్కొన్నారు. కవిత ఇంటి బయట హంగామా చేశారని ఈడీ చెబుతోందని, కానీ.. ఈడీ అధికారులే వాళ్లను లోపలికి రమ్మని అనుమతించారని కోర్టుకు తెలిపారు. గతంలో కవితను సీబీఐ అధికారులు 8 గంటలు విచారించారని విక్రమ్ చౌదరి గుర్తు చేశారు. అప్పుడు కవిత విచారణకు పూర్తిగా సహకరించారని తెలిపారు. మహిళల విచారణపై మరో కేసుకు కవిత కేసును జత చేశారని, ఇది సరికాదని అన్నారు. ఒక మహిళను అరెస్టు చేసి 30 కిలోమీటర్లకు పైగా తీసుకెళ్తే ట్రాన్సిట్ రిమాండ్ తీసుకోవాలని, కవితను ఢిల్లీకి తరలించినా ఎందుకు తీసుకోలేదో ఈడీ చెప్పాలని అన్నారు. ఈడీకి ఇది డిఫెన్స్ లెస్ కేసు అని తెలిపారు. మూడు సార్లు ఈడీ విచారణకు కవిత హాజరయ్యారని చెప్పారు. ఆమెను సీబీఐ సాక్షి అంటోందని, ఈడీ నిందితురాలు అంటోందని చెప్పారు. పీఎంఎల్ఏ చట్టం ప్రకారం సీఆర్పీసీ సెక్షన్లు వర్తిస్తాయని, ఈడీ అధికారులు మాత్రం వర్తించవంటున్నారని కోర్టుకు వివరించారు. కవిత విషయంలో ఈడీ వ్యవహరించిన తీరు సరికాదని, ఇది ముమ్మాటికీ దేశ చరిత్రలో ఒక చీకటి రోజుగా మిగిలిపోతుందని తెలిపారు.

మధ్యంతర ఉత్తర్వులేమీ లేవు: ఈడీ

కవిత కేసులో సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులేమీ లేవని ఈడీ తరఫున జోహెబ్ హుస్సేన్ తెలిపారు. తీవ్రమైన చర్యలు తీసుకోవద్దని కూడా ఉత్తర్వులేమీ ఇవ్వలేదని చెప్పారు. మీడియాలో వచ్చిన విషయాలను పరిగణనలోకి తీసుకోవద్దని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. గతేడాది సెప్టెంబరు 15న పది రోజుల్లో సమన్లు ఇవ్వబోమని మాత్రమే చెప్పామని గుర్తు చేశారు. శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా మినహాయింపులేమీ ఇవ్వలేదని ఏఎస్జీ చెప్పారని పేర్కొన్నారు. వేరే వారికి ఎవరికో ఇచ్చిన ఉత్తర్వులు తమకే ఇచ్చినట్లు అన్వయించుకుంటే ఎలా? అని అన్నారు. కవిత సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి మాత్రమే చేశారని, సుప్రీంకోర్టులో ఏఎస్జీ చెప్పిన 10 రోజుల గడువు ఎప్పుడో తీరిందని తెలిపారు. గడువు తీరాక ఎన్నోసార్లు కోర్టులో విచారణ జరిగిందని, అయినా.. సెప్టెంబరు 15న ఇచ్చిన అండర్ టేకింగ్‌నే ఇంకా ప్రస్తావిస్తున్నారని చెప్పారు. కవిత దాఖలు చేసిన పిటిషన్‌లో మధ్యంతర ఉత్తర్వులు లేవని, నళినీ చిదంబరం పిటిషన్‌లో ఇచ్చిన ఉత్తర్వులనే వీళ్లు అన్వయించుకుంటున్నారని వివరించారు. ఈ వ్యవహారంలో సీఆర్పీసీ సెక్షన్లు ఇప్పుడు వర్తించవని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇక కవితను విచారించడం, అరెస్టు చేయడం సహా అన్నింటా పకడ్బందీగా నిబంధనలు పాటించామని జోహెబ్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా కవిత రిమాండ్ అప్లికేషన్‌ను కోర్టుకు సమర్పించారు. శుక్రవారం సాయంత్రం 5:43కి అరెస్టు చేసినట్లు లిఖితపూర్వకంగా చెప్పారని పేర్కొన్నారు. సూర్యాస్తమయం తర్వాత కవితను అరెస్టు చేశారనడం అవాస్తవమని, శుక్రవారం తెలంగాణలో సూర్యాస్తమయం 6:26 గంటలకు జరిగిందని వివరించారు.

చర్యలు ఉండవని ఈడీ ఎప్పుడూ చెప్పలేదు..

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కవితపై చర్యలు తీసుకోబోమని ఈడీ ఎప్పుడూ, ఎక్కడా చెప్పలేదని, అండర్ టేకింగ్ ఇవ్వలేదని జోహెబ్ హుస్సేన్ న్యాయస్థానానికి తెలిపారు. పది రోజులు మాత్రమే సమన్లు ఇవ్వబోమని కోర్టులో చెప్పి చాలా కాలమైందని, ఆ గడువు ఎప్పుడో ముగిసిపోయిందని అన్నారు. గతేడాది సెప్టెంబరులో కోర్టులో అండర్ టేకింగ్ ఇచ్చామని, ఆ తర్వాత ఈ ఏడాది జనవరి 3న మళ్లీ సమన్లు జారీ చేశామన్నారు. "సమన్లను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశామన్నారు. వారు(కవిత) వేసిన పిటిషన్ ఎక్కడుందో చెప్పమనండి. ఈడీ సమన్లను సుప్రీంకోర్టులో సవాలు చేశారా? సమన్లను ధిక్కరిస్తూ పిటిషన్ వేశారా? 24గంటల్లోపు వ్యక్తిని కోర్టులో హాజరుపరచకపోతేనే ట్రాన్సిట్ రిమాండ్ తీసుకోవాలి. కవితను అరెస్టు చేసేటప్పుడు ఆథరైజ్డ్ అధికారి లేరనడం అర్థరహితం. ఈడీ జాయింట్ డైరెక్టర్ జోగీందర్ ఉన్నారు. ఆయనకు అరెస్టు చేసే అధికారం ఉంది" అని జోహెబ్ హుస్సేన్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. "నన్ను అక్రమంగా అరెస్టు చేశారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తా" అని కవిత కోర్టులోపలికి వెళ్లేటప్పుడు చెప్పారు.

జెండా ఎత్తినవారికి జై!

- 37 మందికి కార్పొరేషన్ల చైర్మన్ పదవులు
- పర్యాటక కార్పొరేషన్ చైర్మన్‌గా రమేశ్‌రెడ్డి


పటేల్ రమేశ్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తమ వంతు ప్రయత్నం చేసిన నాయకులను పదవులు వరించాయి. రాష్ట్రంలో ఏకంగా 37 కార్పొరేషన్లకు చైర్మన్‌లను నియమిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. రెండు రోజుల కిందటే ఈ ఉత్తర్వులు జారీ చేశారు. పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా పటేల్ రమేశ్ రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద నియమితులయ్యారు. పదవులు లభించిన వారికి ఏఐసీసీ కార్యాలయం నుంచే ఫోన్లు చేసి, సమాచారం అందించినట్లు తెలిసింది. ఒకరిద్దరు ఈ కార్పొరేషన్ చైర్మన్ పదవులను తీసుకునేందుకు సుముఖంగా లేరని తెలిసింది. ఈ విషయాన్ని తమకు సమాచారం అందించిన ఏఐసీసీ పెద్దలకే తెలియజేసినట్టు సమాచారం.

పేరు	కార్పొరేషన్
పటేల్ రమేశ్ రెడ్డి	పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్
కే శివసేనా రెడ్డి	తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ
ఎన్ ప్రీతమ్	ఎస్సీ కార్పొరేషన్
నూతి శ్రీకాంత్	బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్
ఎస్ అన్వేష్ రెడ్డి	విత్తనాభివృద్ధి సంస్థ
అనిల్ ఈరవత్రి	ఖనిజాభివృద్ధి సంస్థ
ఎం విజయబాబు	హౌసింగ్ కార్పొరేషన్
రాయల నాగేశ్వరరావు	గిడ్డంగుల సంస్థ
కాసుల బాలరాజు	ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్
నేరెళ్ల శారద	తెలంగాణ మహిళా కమిషన్
బంద్రు శోభారాణి	మహిళా సహకార అభివృద్ధి సంస్థ
సీహెచ్ జగదీశ్వర్ రావు	నీటి అభివృద్ధి సంస్థ
జంగా రాఘవ రెడ్డి	ఆయిల్ సీడ్స్ గ్రోయర్స్ ఫెడరేషన్
మానాల మోహన్ రెడ్డి	కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్
బెల్లయ్య నాయక్	గిరిజన సహకార ఆర్థిక సంస్థ
ఆర్.గురునాథ్ రెడ్డి	పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్
జ్ఞానేశ్వర్ ముదిరాజ్	డెయిరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్
చల్లా నరసింహా రెడ్డి	పట్టణ మౌలిక సదుపాయాల ఆర్థిక సంస్థ
మెట్టు సాయికుమార్	ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్
కె.నాగు	ఎస్టీ సహకార ఆర్థికాభివృద్ధి సంస్థ
జనక్ ప్రసాద్	కనీస వేతనాల సలహా మండలి
ఎండీ రియాజ్	గ్రంథాలయ సంస్థ
ఎం.వీరయ్య	వికలాంగుల కార్పొరేషన్
నాయుడు సత్యనారాయణ	చేతివృత్తుల కార్పొరేషన్
ఎం జబ్బర్	వైస్ చైర్మన్, మైనారిటీ కార్పొరేషన్
నిర్మలా జగ్గారెడ్డి	పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ
రాంరెడ్డి మల్లారెడ్డి	రోడ్ల అభివృద్ధి సంస్థ
కాల్వ సుజాత	వైశ్య కార్పొరేషన్
పొదెం వీరయ్య	అటవీ అభివృద్ధి సంస్థ
అయిత ప్రకాశ్ రెడ్డి	ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్
కే నరేందర్ రెడ్డి	శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ
అలేఖ్య పుంజాల	సంగీత, నాటక అకాడమీ
ఎన్.గిరిధర్ రెడ్డి	తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్
మన్నె సతీష్	స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్
జెరిపెటి జైపాల్	అత్యంత వెనుకబడిన కులాల అభివృద్ధి సంస్థ
ఈ.వెంకట్రామిరెడ్డి	కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ
ఎంఏ ఫహీమ్	తెలంగాణ ఫుడ్స్

జూపార్కులో 125 ఏళ్ల తాబేలు మృతి

- నిజాం హయాంలో జూకి తరలింపు

మదీన, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నిజాం హయాంలో ఏర్పాటు చేసిన జవహర్ లాల్ నెహ్రూ జూలాజికల్ పార్కులోని 125 ఏళ్ల వయసు గల అతి పురాతన తాబేలు శనివారం మృతి చెందింది. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఈ తాబేలు పది రోజులు సరిగా ఆహారం తీసుకోకపోవడంతో వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎ హకీమ్ ఆధ్వర్యంలో చికిత్సలు అందజేస్తున్నారు. పలు అవయవాలు చెడిపోవడం కారణంగానే ఈ తాబేలు చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇప్పటి జూపార్కు గతంలో నిజాం నవాబు హయాంలో ప్రస్తుత పబ్లిక్ గార్డెన్‌లో ఉండేది. అనంతరం 1963లో ప్రస్తుతమున్న బహదూర్‌పురాకు మార్చారు. ఆ సమయంలో తరలించిన జంతువుల్లో ఈ మగ తాబేలు ఇప్పుడు మరణించగా, 95 ఏళ్ల మరో తాబేలు ఇక్కడే ఉంది.

గవర్నర్ కార్యదర్శి సురేంద్ర మోహన్ బదిలీ

హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజోతి): గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ముఖ్య కార్యదర్శి కె. సురేంద్ర మోహన్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా కొనసాగుతున్న బుర్రా వెంకటేశంకు అదనపు బాధ్యతలు అప్పగించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సురేంద్ర మోహన్‌ను జీఏడీలో రిపోర్ట్ చేయాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

సైబర్ నేరాల బారిన పడ్డ బాధితులకు రూ.2.20 కోట్లు తిరిగి చెల్లింపు

హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బులు కోల్పోయిన బాధితులకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో తిరిగి డబ్బులు అందించింది. రాష్ట్ర వ్యాప్తంగా 546 మంది బాధితులకు సుమారు రూ.2.20 కోట్లు అప్పగించినట్లు బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ తెలిపారు. సైబర్ నేరాల బారిన పడ్డ బాధితులు హెల్ప్‌లైన్ నెంబరు 1930కు సమాచారం ఇస్తే నేరగాళ్ల బ్యాంకు ఖాతాల్ని ఫ్రీజ్ చేసి డబ్బులు తిరిగి రాబడుతున్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శిఖా గోయల్ సూచించారు.

కవిత అరెస్టుతో మాకు సంబంధం లేదు: లక్ష్మణ్

హైదరాబాద్/ఆర్మూర్‌టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టుతో బీజేపీకి సంబంధం లేదని పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ స్పష్టం చేశారు. తమకు సంబంధం లేని విషయాన్ని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు బీజేపీకి అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. నిష్పక్షపాతంగా దర్యాప్తు సంస్థలు పనిచేస్తుంటే, దానిని రాజకీయాలతో ముడిపెట్టడం భావ్యం కాదన్నారు. "బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, నదులకే నడక నేర్పారంటూ పొగిడారు.. నదులకు నడక సంగతి దేవుడెరుగు.. మద్యాన్ని మాత్రం ఢిల్లీకి తరలించారు" అని లక్ష్మణ్ ఒక ప్రకటనలో విమర్శించారు. మద్యం కుంభకోణంలో చట్టప్రకారమే ఈడీ చర్యలు చేపట్టిందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఓడిస్తానన్న ఎమ్మెల్సీ కవిత.. ఇప్పుడు జైలులో నుంచి నామినేషన్ వేస్తుందా..? అని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ప్రశ్నించారు.

మండుటెండల్లో పోలింగ్!

2019లో మొదటి ఫేజ్‌లోనే పూర్తి.. ఈ సారి 4వ ఫేజ్ దాకా ఆగాల్సిన పరిస్థితి

- ఖర్చు మోపెడవుతుందని అభ్యర్థుల ఆందోళన
- వ్యూహ, ప్రతివ్యూహాలు రచిస్తున్న ప్రధాన పార్టీలు
- అలస్యం..అమృతం అవుతుందని బీజేపీ అంచనాలు
- వంద రోజుల పాలనే.. గట్టెక్కిస్తుందంటున్న కాంగ్రెస్
- నాయకుల వలసలతో బీఆర్‌ఎస్‌లో అయోమయం



హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ సారి మండుటెండల్లో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరగనుంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో మార్చి 10న షెడ్యూల్ వెలువడితే.. ఏప్రిల్ 11న పోలింగ్ జరిగింది. మొత్తం 33 రోజుల వ్యవధిలోనే మొత్తం తతంగం పూర్తయింది. అప్పటి మాదిరిగానే 2024 ఎన్నికలూ తొలి ఫేస్‌లోనే జరిగి పోతాయని అందరూ భావించారు. అటు, ఇటుగా ఏప్రిల్ 15 కల్లా పోలింగ్ పూర్తయిపోతుందని అంచనా వేశారు. కానీ, ఎన్నికల కమిషన్ శనివారం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం మే 13న (నాలుగో ఫేజ్‌లో) పోలింగ్ జరగనుంది. అంటే షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి 59రోజుల పాటు ఎన్నికల హడావుడి కొనసాగనుంది. ఇదే ఇప్పుడు అన్ని పార్టీల అభ్యర్థులను కలవరపాటుకు గురి చేస్తోంది. అన్ని రోజుల పాటు ప్రచారం చేయడానికి ఖర్చు తడిసి మోపెడయ్యే అవకాశం ఉందని టెన్షన్ పడుతున్నారు. అసలే మండుటెండలు, గ్రామాల్లో పెద్దగా పనులు ఉండని రోజులు కావడంతో ఖర్చు మరింతగా పెరిగేందుకూ ఆస్కారం ఉంది. అప్పటి దాకా ఎన్నికల ప్రచారం, కార్యకర్తల ఖర్చులు ఎలా భరించాలన్న ఆందోళనా టిక్కెట్లు దక్కించుకున్న అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది. మరో వైపు.. మండుటెండల్లో పోలింగ్ జరగనుండడం ఏ పార్టీకి ఎంతవరకు కలిసొస్తుందన్న చర్చ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో జోరుగా జరుగుతోంది. అయితే, ఈ ఆలస్యం తమకు కలిసొస్తుందని బీజేపీ భావిస్తుండగా, వందరోజుల పాలనే తమను గట్టెక్కిస్తుందని కాంగ్రెస్ భావిస్తున్నాయి. నేతల వలసలు, కవిత అరెస్టు వంటి పరిణామాలత సతమతమవుతున్న బీఆర్‌ఎస్‌కు కూడా ఈ ఆలస్యం కొంత ఊరటనిస్తుందన్న అంచనాలు ఉన్నాయి.

కాంగ్రెస్ జోరు కొనసాగేనా?

అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి.. జోష్ మీద ఉన్న కాంగ్రెస్ పార్టీ.. లోక్‌సభ ఎన్నికల్లో 14 సీట్లలో గెలుపు లక్ష్యంగా పని చేస్తోంది. పార్టీ అధికారంలో ఉండడం, గ్యారెంటీల అమలుతో మహిళలు, రాహుల్ చరిష్మాతో మైనార్టీల ఓట్లు తమకే పడుతాయని అంచనా వేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల మ్యాజిక్ రిపీట్ అయినా కనీసం 12 సీట్లలో గెలుస్తామన్న నమ్మకంతో ఉంది. అయితే, పోలింగ్ తేదీ ఆలస్యం కావడమే ఆ పార్టీని కొంత ఇబ్బందికి గురి చేస్తున్నట్లు చెబుతున్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో ప్రస్తుతం అక్కడక్కడా పంటలు ఎండుతున్నాయి. పోలింగ్ తేదీ నాటికి ఇది మరింత తీవ్ర రూపం దాలిస్తే.. రైతుల్లో ఎంతో కొంత అసంతృప్తి చోటు చేసుకుంటుందేమోనన్న ఆందోళనలో ఆ పార్టీ ఉంది. అయితే. కాంగ్రెస్ వంద రోజుల పాలన.. వీటన్నింటినీ అధిగమిస్తుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు.

మోదీపైనే బీజేపీ ఆశలు!

దేశ వ్యాప్తంగా మోదీ వేవ్ ఉందన్న అంచనాలో ఉన్న బీజేపీ నేతలు.. రాష్ట్రంలో పోలింగ్ ఆలస్యం కావడం కలిసొస్తుందని అంచనా వేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ఊపు మీద ఉన్న కాంగ్రెస్‌ను దెబ్బతీయడానికి ఇదే అదును అని భావిస్తున్నారు. ముఖ్యంగా ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయక పోవడం, వర్షాభావ పరిస్థితులు.. ప్రభుత్వంపై వ్యతిరేకతను పెంచుతాయని అంచనా వేస్తున్నారు. బీఆర్‌ఎస్ భవితవ్యం కూడా అప్పటిలోగా తేలిపోతుందని చెబుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ మధ్యే ముఖాముఖి పోటీ నెలకొంటే.. మెజారిటీ సీట్లు దక్కించుకుంటామని ఆ పార్టీ అంచనా వేస్తుంది. మరో వైపు.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, నేతల వలసలు, కవిత అరెస్టు తదితర కష్టాలతో కొట్టుమిట్టాడుతున్న బీఆర్‌ఎస్‌కు.. పోలింగ్ ఆలస్యంగా జరగడం కొంత ఊరటేనన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. బీఆర్‌ఎస్‌పై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత ఇంకా తగ్గలేదని, ప్రస్తుతం ఆ పార్టీ చుట్టూ ముసురుకున్న సమస్యలకు.. ప్రజల్లో చల్లారని అసంతృప్తి తోడైతే భారీ నష్టం జరుగుతుందన్న అంచనాలూ ఉన్నాయి. ఈ తరుణంలో షెడ్యూల్ ఆలస్యం కావడం ఆ పార్టీకి కొంత ఊరటేనంటున్నారు. అప్పటికల్లా కోలుకుని చాలా స్థానాల్లో గట్టి పోటీ ఇస్తామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. అయితే, ఈ గ్యాప్‌లో పార్టీ నుంచి వలసలు మరింత పెరిగి, కాంగ్రెస్-బీజేపీ మధ్యే ముఖాముఖీ పోటీ ఏర్పడితే.. జరిగే నష్టం అంచనాలను తలకిందులు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఆధ్యాత్మికత భారత్‌కు అద్భుత వరం

- దేశ ఐక్యతలో భక్తి, విశ్వాసాల పాత్ర కీలకం
- ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్
- యోగాతో దేశానికి గుర్తింపు: తమిళి సై
- ప్రపంచ ఆధ్యాత్మిక నిలయంగా భారత్: కిషన్‌రెడ్డి

షాద్‌నగర్/నందిగామ, మార్చి 16: భారత దేశానికి ఆధ్యాత్మికత అద్భుతమైన వరమని.. మనకు ఆధ్యాత్మికతతో ఉండే అనుబంధమే ప్రపంచ శాంతికి మార్గాన్ని సూచిస్తుందని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతివనంలో జరిగిన ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవంలో ఆయన మాట్లాడారు. నేటి సమాజంలో వ్యక్తిగత ద్వేషాలు, అస్థిరత మానవ జీవితాన్ని ఆందోళనకర స్థితికి నెట్టివేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రపంచ శాంతికి ముప్పు పొంచి ఉన్న ప్రస్తుత తరుణంలో ప్రజలను చైతన్యపరిచే ఆధ్యాత్మిక కార్యక్రమాల ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. భిన్న సంస్కృతులున్న మన దేశంలో మత విశ్వాసాలను నిలబెడుతూ, ప్రజల్లో జ్ఞానాన్ని నింపి, ధర్మం వైపు నడిపిస్తున్న శక్తి.. భక్తి మాత్రమేనని పేర్కొన్నారు. భారత్‌ను రక్షించడంలో వసుధైక కుటుంబంగా నిలబెట్టడంలో ఆధ్యాత్మికత, భక్తి, విశ్వాసాల పాత్ర ఎంతో ఉందన్నారు. ప్రపంచ దేశాలు తమ దేశ సమస్యల పరిష్కారం కోసం భారత్ వైపు చూస్తున్నాయని గవర్నర్ తమిళిసై అన్నారు. ప్రధాని మోదీ.. యోగా, ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా భారతదేశానికి మంచి గుర్తింపు లభించిందని తెలిపారు. మన దేశ యువత పాశ్చాత్య సంస్కృతుల వైపు దృష్టి సారిస్తోందని.. ఇలాంటి తరుణంలో కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్యాత్మిక మహోత్సవాలను నిర్వహించడం హర్షణీయమన్నారు. ప్రపంచ దేశాలకు ఆధ్యాత్మిక నిలయంగా భారత దేశం నిలిచిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మన దేశం ప్రపంచ శాంతిని కోరుకుంటూ అన్ని దేశాలతో సన్నిహితంగా ఉంటోందని చెప్పారు. ఆరోగ్యం, యోగాను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో రామచంద్ర మిషన్ కృషి అభినందనీయమని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రపంచ దేశాల్లోని అన్ని మతాల గురూజీలను రప్పించి ఈ ఆధ్యాత్మిక మహోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రపంచంలో అన్ని కాలుష్యాలతో పాటు మానసిక కాలుష్యం కూడా పెరుగుతోందని హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ గురూజీ కమలేశ్ పటేల్ అన్నారు. ప్రజలంతా ధర్మాన్ని పాటిస్తే ప్రపంచం శాంతియుతంగా ఉంటుందని చెప్పారు. కాగా, ఉప రాష్ట్రపతి దంపతులకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో గవర్నర్ తమిళి సై, కిషన్‌రెడ్డి.. మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు స్వాగతం పలికారు.

వారం రోజుల పోలీసు కస్టడీకి ప్రణీత్‌రావు

హైదరాబాద్ సిటీ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఎస్ఐబీలో హార్డ్‌డిస్కులు, కంప్యూటర్ల ధ్వంసం, ఫోన్‌ట్యాపింగ్ కేసులో అరెస్టయిన మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును ఏడు రోజుల పాటు పోలీసు కస్టడీకి అనుమతినిస్తూ నాంపల్లి కోర్టు శనివారం ఆదేశాలు జారీ చేసింది. ప్రణీత్‌రావు ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉండగా.. పంజాగుట్ట పోలీసులు ఆదివారం ఉదయం అతణ్ని కస్టడీకి తీసుకునే అవకాశాలున్నాయి. ఇప్పటికే ఈ కేసులో వరంగల్‌కు చెందిన ఓ బీఆర్‌ఎస్ నేత, విజిలెన్స్ విభాగానికి చెందిన ఓ ఎస్పీ స్థాయి అధికారి ప్రమేయం బయటపడిన విషయం తెలిసిందే. సిద్దిపేట, కరీంనగర్ తదితర ప్రాంతాల్లో ప్రత్యర్థి పార్టీల నేతలు, వారికి సహకరిస్తున్న వ్యాపారవేత్తల ఫోన్ ట్యాపింగ్‌కు వార్‌రూమ్‌లను ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ నేతలు, ఇతర పోలీసు అధికారులకు సంబంధించిన సమాచారాన్ని దర్యాప్తు అధికారులు రాబట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు దర్యాప్తునకు జూబ్లీహిల్స్ ఏసీపీ పి.వెంకటగిరి నేతృత్వం వహిస్తుండగా.. పశ్చిమ మండలం డీసీపీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే తాను ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు, ఆధారాలను ధ్వంసం చేసినట్లు ప్రణీత్‌రావు వాంగ్మూలం ఇచ్చిన నేపథ్యంలో.. వారం రోజుల కస్టడీలో తెరవెనక సూత్రధారులు, పోలీసు శాఖలో మరికొందరు పాత్రధారుల వివరాలను రాబట్టనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పర్వతగిరి వార్‌రూమ్‌కు ఓ ఇన్‌స్పెక్టర్(ప్రణీత్‌రావు బ్యాచ్‌మెట్) నేతృత్వం వహించినట్లు గుర్తించిన దర్యాప్తు అధికారులు.. మిగతా వార్‌రూమ్‌ల వెనక ఉన్నవారి వివరాలను సేకరించనున్నారు.

న్యాయ సేవలను ప్రజలకు చేరువ చేయాలి

లఘు చిత్రాలతో సమాజంలో అవగాహన.. హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే

హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): లీగల్ సర్వీసెస్ అథారిటీ అందించే సేవలను, న్యాయసాయాన్ని సమాజంలోని అట్టడుగు వర్గాలకు తీసుకెళ్లాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే పేర్కొన్నారు. లఘు చిత్రాల ద్వారా ప్రజల్లో అథారిటీ అందజేసే సేవలు, న్యాయ సహాయం గురించి అవగాహన పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. శనివారం ఆయన హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో డి.సాయిప్రసాద్ దర్శకత్వంలో రూపొందించిన లఘు చిత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లీగల్ సర్వీసెస్ అథారిటీ, రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో లఘుచిత్రాలను రూపొందించడం అభినందనీయమన్నారు. సీనియర్ న్యాయమూర్తి, అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ శ్యాంకోషీ మాట్లాడుతూ న్యాయ సేవలపై రూపొందించిన లఘు చిత్రాలను.. సినిమా థియేటర్లలో విరామ సమయంలో ప్రదర్శించనున్నట్లు వివరించారు. జువెనైల్ జస్టిస్, డ్రగ్స్, మానవ అక్రమ రవాణా, కార్మిక చట్టాలు, సైబర్ నేరాలు, హక్కులకు సంబంధించి అనేక సేవలను లీగల్ సర్వీసెస్ అథారిటీ అందిస్తోందని.. రాష్ట్రంలోని 700 సినిమా థియేటర్ల ద్వారా ప్రజలకు ఈ అంశాలకు అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. డైరెక్టర్ సాయిప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతివ్యక్తికి లీగల్ సర్వీసెస్ అథారిటీ సేవలు అందేలా లఘు చిత్రాలను రూపొందించినట్లు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శి ఎస్.గోవర్ధన్ రెడ్డి, హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొన్నారు.


రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సేవలపై ప్రసంగిస్తున్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే

వరంగల్‌లో కోర్టుల ప్రారంభం

వరంగల్ లీగల్: ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే శనివారం వరంగల్, హనుమకొండ కోర్టుల సముదాయంలో ఏర్పాటు చేసిన ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు, హనుమకొండ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఈ-సేవాకేంద్రం, డిజిటలైజేషన్ కేంద్రాన్ని ప్రారంభించారు.

1.08 కోట్ల కేసుల పరిష్కారం

తెలంగాణలోని అన్ని స్థాయుల కోర్టుల్లో నిర్వహించిన జాతీయలోక్ అదాలత్‌కు భారీ స్పందన లభించిందని, 1.08 కోట్ల కేసులను పరిష్కరించినట్లు రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. వీటిల్లో 1.02 కోట్ల కేసులు ప్రీలిటిగేషన్ కేటగిరీకి చెందినవని, మరో 5.30 లక్షల పెండింగ్ కేసులున్నట్లు తెలిపారు. పరిష్కృతమైన కేసుల్లో రూ.412 కోట్ల మేర పరిహారాన్ని అందజేసినట్లు చెప్పారు. ఒక్క హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో 302 కేసులు పరిష్కారం కాగా.. పరిహారం విలువ రూ.34 కోట్లుగా ఉన్నట్లు పేర్కొన్నారు.

పదేళ్లకు పూర్తయిన పంపకం

- ఉమ్మడి ఏపీ భవన్ ఆస్తుల విభజన పూర్తి
- 19.781 ఎకరాలలో ఏపీకి 11.536, తెలంగాణకు 8.245 ఎకరాలు
- కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు

న్యూఢిల్లీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని న్యూఢిల్లీలో ఇరు తెలుగు రాష్ట్రాల ఆధీనంలో ఉన్న ఉమ్మడి ఏపీ భవన్ ఆస్తుల పంపకం ఎట్టకేలకు పూర్తైంది. వాటాల విషయంలో తెలంగాణ చేసిన ప్రతిపాదనకు ఏపీ అంగీకరించింది. అలాగే, ఏపీకి కేటాయించిన భూముల్లో ఆక్రమణలో ఉన్న ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకునే విషయంలో పరస్పరం సహకరించుకోవాలని ఇరురాష్ట్రాలు అభిప్రాయానికి వచ్చాయి. మొత్తం 19.781 ఎకరాలలో ఉన్న భవన్ ఆస్తుల్లో ఏపీకి 11.536 (58.32%) ఎకరాలు, తెలంగాణకు 8.245(41.68%) ఎకరాల చొప్పున వాటాల పంపిణీ జరిగింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను కేంద్ర హోంశాఖ శుక్రవారం జారీ చేసింది. దీంతో పదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఏపీ భవన్ విభజన పూర్తైంది. ఢిల్లీలోని ఉమ్మడి ఏపీ భవన్‌కు గోదావరి బ్లాక్, శబరి బ్లాక్, నర్సింగ్ హాస్టల్, పటౌడీ హౌజ్ అనే విభాగాలుగా భూములు, భవనాలు ఉన్నాయి. వీటి విలువ సుమారు రూ.9913 కోట్లు వరకు ఉంటుంది. పంపకాలలో మొత్తం 19.781 ఎకరాల్లో ఏపీ భవన్ కింద ఉన్న గోదావరి బ్లాక్ 4.315 ఎకరాలు, శబరి బ్లాక్‌లో 0.954 ఎకరాలు, ఆంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణకు గురైన ప్రాంతం) ఉన్న 0.512 ఎకరాలు, నర్సింగ్ హాస్టల్ 3.359 ఎకరాలు, పటౌడీ హౌజ్‌లో 2.396 ఎకరాలు ఏపీకి దక్కనున్నాయి. అలాగే, శబరి బ్లాక్ కింద ఉన్న 3 ఎకరాలు, పటౌడీ హౌజ్‌లో ఉన్న 5.245ఎకరాలు తెలంగాణకు రానున్నాయి. నిజానికి, ఏపీ భవన్ ఆస్తుల విభజన అంశంపై కేంద్ర హోం శాఖ తెలుగు రాష్ట్రాల అధికారులతో గత సోమవారం సమావేశమైంది. భవన్ ఆస్తులకు సంబంధించి గతంలో తెలంగాణ చేసిన ప్రతిపాదనపై ఈ భేటీలో చర్చించారు. దీని ప్రకారం ఏపీకి వచ్చే భూమిలో వివాదాస్పదమైన(ఆక్రమణకు గురైన ప్రాంతం) 0.512 ఎకరాలను స్వాధీనం చేసుకోలేకపోతే అందుకు సమానమైన భూమిని శబరి బ్లాక్, పటౌడీ హౌజ్‌లో కేటాయించాలని గతంలో ఏపీ పెట్టిన షరతుపై సమీక్షించారు. ఆక్రమణల వైపు భవన్ గేటును(అశోక రోడ్ వైపున ఉన్న) మూసివేస్తే అన్యాక్రాంతమైన భూమి 0.512 నుంచి 0.112 ఎకరాలకు తగ్గిపోతుందని, అప్పుడు ఇరు ప్రభుత్వాలు కలిసి ఆక్రమణలను తొలిగించాలనే అభిప్రాయానికి వచ్చారు. ఆయా అంశాలపై ఏపీ ప్రభుత్వం తన సమ్మతిని తెలియజేసింది. భవన్(అశోక రోడ్ వైపు) గేటును మూసివేయాలని, వివాదాస్పద భూమి (0.112 ఎకరాలు)ని స్వాధీనం చేసుకోవడంలో దామాషా ప్రకారం ఏపీ 0.069, తెలంగాణ 0.043 ఎకరాలలో ఆక్రమణలను తొలగించాలని తెలిపింది. ఈ క్రమంలో ఏదైనా నష్టంవస్తే ఇరు రాష్ట్రాలు దామాషా ప్రకారం భరించాలని కేంద్రానికి తెలియజేసింది. తెలంగాణ కూడా ఏపీ ప్రతిపాదనకు సమ్మతించడంతో ఇరురాష్ట్రాల మధ్య ఉమ్మడి భవన్ విభజన పూర్తయినట్లు కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: **K. Srinivas.** Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.



ఒక్కటైన ప్రేమ జంట

సినిమా సెట్స్‌లో ప్రేమలో పడి.. ఆ అనుబంధాన్ని మూడు ముళ్ల బంధంగా మార్చుకుంటున్న జంటల సంఖ్య ఈ మధ్య ఎక్కువైంది. తాజాగా బాలీవుడ్ ప్రేమజంట కృతి కర్బందా, పులకిత్ సమ్రాట్ ఒక్కటయ్యారు. శుక్రవారం గుర్‌గావ్‌లో సన్నిహితుల సమక్షంలో వీరిద్దరూ పెళ్లిపీటలెక్కారు. ఈ పెళ్లి వేడుకలకు సంబంధించిన ఫొటోలను ఈ జంట ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఈ ప్రేమ జంటకు సెలబ్రిటీల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. రకుల్ ప్రీత్ సింగ్, రిచా చద్దా, బాబీ డియోల్, కృతి సనన్, అర్మాన్ మాలిక్, మౌనీ రాయ్ ఈ జంటకు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. కాగా, కృతి కర్బందా 'తీన్‌మార్, మిస్టర్ నూకయ్య, ఒంగోలు గిత్త, బ్రూస్లీ' వంటి తెలుగు చిత్రాల్లో నటించారు. బాలీవుడ్‌లోనూ అనేక సినిమాల్లో తళుక్కుమన్నారు. మరోవైపు పులకిత్ సమ్రాట్ 'ఫక్రే' సిరీస్, సనమ్ రే వంటి సినిమాలు చేశారు. 2019లో వచ్చిన 'పాగల్‌పంతి' చిత్రంలో ఈ జంట కలసి నటించింది. దాదాపు ఆరేళ్లుగా ప్రేమలో ఉన్న వీరిద్దరూ, పెద్దల అంగీకారంతో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు.

ఖుషీ ఖుషీగా...





జగదేకసుందరి శ్రీదేవి కుమార్తె, జాన్వీ కపూర్ సోదరి, ఖుషీ కపూర్ మరో నూతన చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాలో ప్రముఖ నటుడు సైఫ్ అలీ ఖాన్ తనయుడు ఇబ్రహిం అలీ కథానాయకుడుగా నటిస్తుండటం విశేషం. 'నాదనియాన్' అనే టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి నూతన దర్శకుడు శౌనా గౌతమ్ దర్శకత్వం వహిస్తున్నారు. ధర్మా ప్రొడక్షన్స్ సమర్పణలో కరణ్ జోహార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రొమాంటిక్ ఎంటర్టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందని చిత్ర బృందం ధీమాగా ఉంది. తాజాగా, ఈ చిత్ర షూటింగ్ సమయంలో లీకైన ఓ పిక్ ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతోంది. పూణేలోని ప్రైవేట్ యూనివర్సిటీలో హీరోహీరోయిన్లపై ఓ సన్నివేశాన్ని చిత్రీకరిస్తోన్న సందర్భంలో ఎవరో ఈ ఫొటోని తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేశారు.

పరిశ్రమ ఏదైనా, అగ్రహీరోల సినిమాలపైనే ప్రేక్షకులు ఎక్కువ ఆసక్తి చూపిస్తారు. తమ అభిమాన హీరో చేయబోయే కొత్త సినిమా విశేషాల కోసం ప్రేక్షకలోకం ఎదురుచూడడం సహజమే. ఇక బాలీవుడ్ హీరోల సినిమాలంటే ఆ క్రేజే వేరు. త్వరలోనే హిందీ హీరోలు కొత్త ప్రాజెక్ట్‌లతో అభిమానులను ఖుషీ చేయబోతున్నారంటూ బాలీవుడ్ పరిశ్రమలో వినిపిస్తున్న సినిమాలు ఇవే.

బాలీవుడ్ టాక్... హీరోల ట్రాక్?







అంతకు మించిన హిట్ కోసం

గతేడాది మూడు చిత్రాలతో అభిమానుల ముందుకొచ్చారు షారూఖ్‌ఖాన్. 'పఠాన్', 'జవాన్' చిత్రాలతో బాక్సాఫీసు దగ్గర సందడి చేశారాయన. ఆ రెండు చిత్రాలు రూ. వెయ్యికోట్ల పైబడి వసూళ్లను సాధించాయి. అలాగే షారూఖ్ ముఖ్య భూమిక పోషించిన 'డంకీ' చిత్రం కూడా పర్వాలేదనిపించుకుంది. అయితే ఆయన నటించబోయే కొత్త సినిమా ఇప్పటివరకూ ఖరారు కాలేదు. తర్వాత ప్రాజెక్ట్ కూడా గొప్ప స్థాయిలో ఉండాలనే ఆలోచనతో కథల ఎంపికలో షారూఖ్ జాగ్రత్తగా ఉన్నారట. ప్రస్తుతం రెండు మూడు స్క్రిప్ట్‌లపైన ఆయన దృష్టి సారించారని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. వసూళ్లలో రికార్డులు సృష్టించిన 'పఠాన్' చిత్రానికి కొనసాగింపు సిద్ధమవుతోందని తెలుస్తోంది. ఆదిత్య చోప్రా ఇప్పటికే కథను సిద్ధం చేసే పనిలో ఉన్నారట. స్పై యాక్షన్ జానర్‌లో ఈ చిత్రం రానుంది. ఈ ఏడాదే ఈ చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లే అవకాశముందని బాలీవుడ్ వర్గాల సమాచారం.

అలాగే 'కేజీఎఫ్' సిరీస్‌తో దేశవ్యాప్తంగా అభిమానగణాన్ని సంపాదించుకున్న యశ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్'లోనూ షారూఖ్ కీలకపాత్ర పోషించనున్నారని సమాచారం. ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాను గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్నారు. ఇందులో ఓ పవర్‌ఫుల్ రోల్ కోసం చిత్రబృందం షారూఖ్‌ను సంప్రదించారట. ఆయనకు కూడా కథ నచ్చడంతో ఈ సినిమా చేసేందుకు అంగీకరించారట. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన రావొచ్చని భావిస్తున్నారు. అలాగే ప్రముఖ దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ 'ఇన్షా అల్లా' చిత్రం కోసం షారూఖ్‌ను సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఎలాంటి కదలికా రాలేదు.

కొత్త తరహా పాత్రలో రణ్‌బీర్..

దర్శకుడు నితీశ్ తివారి రామాయణం ఆధారంగా ఓ చిత్రాన్ని ప్రకటించారు. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ చిత్రంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, హీరోయిన్‌గా సాయిపల్లవి నటిస్తున్నారు. కొన్నాళ్లుగా ప్రచారంలో ఉంది. శ్రీరామ నవమి సందర్భంగా వచ్చే నెల 17న ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశముంది. అయితే ఈ చిత్రం తర్వాత రణ్‌బీర్‌కపూర్ ఓ క్రీడా నేపథ్య చిత్రం చేయబోతున్నట్లు టాక్.




కబడ్డీ ఆట నేపథ్యంలో సాగే కథతో కొత్త దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారని తెలుస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



ఛత్రపతిగా షాహిద్?

చత్రపతి శివాజీ జీవిత కథ ఆధారంగా దర్శకుడు అమిత్‌రాయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో షాహిద్‌కపూర్ భాగమవనున్నారని బాలీవుడ్ టాక్. ప్రస్తుతం 'దేవా' చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు షాహిద్ కపూర్. శివాజీ మహారాజ్ పాత్రను పోషించేందుకు ఆయన ఉత్సాహం చూపుతున్నారట. త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది.



ఈసారి హీరోగా

కొన్నాళ్లుగా తన పంథా మార్చి విలన్ పాత్రలతో అలరిస్తున్నారు సైఫ్ అలీఖాన్. త్వరలోనే ఆయన హీరోగా ఓ చిత్రం తెరకెక్కనుందని బాలీవుడ్ సమాచారం. ఓ బిడ్డకు తండ్రి అయిన గ్యాంగ్‌స్టర్ జీవితంలో జరిగిన సంఘటనల నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. 'ఉడ్తా పంజాబ్' లాంటి హిట్ చిత్రాన్ని అందించిన అభిషేక్ చౌబే ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారని తెలుస్తోంది.

గూఢచారిగా రణ్‌వీర్

ప్రస్తుతం అజయ్ దేవ్‌గణ్ 'సింగమ్ ఎగైన్' చిత్రంలో కీలకపాత్ర పోషిస్తున్నారు రణ్‌వీర్‌సింగ్. ఆ తర్వాత ఆయన 'డాన్ 3', 'శక్తిమాన్' చిత్రాలను మొదలుపెట్టాల్సి ఉంది. వీటితో పాటు మరో కొత్త ప్రాజెక్ట్‌కు రణ్‌వీర్ 'ఎస్' చెప్పినట్లు తెలుస్తోంది. స్పై యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో ఆదిత్యాధార్ దర్శకత్వం వహించనున్నారు. 'యురి' లాంటి సూపర్‌హిట్ చిత్రం ఆయన ఖాతాలో ఉంది. ఈ చిత్రంలో రణ్‌వీర్ గూఢచారి పాత్రలో కనిపించనున్నారు. వేసవిలో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అలాగే సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో 'బైజు బర్వా' అనే చిత్రాన్ని రణ్‌వీర్ ఓకే చేసినట్లు తెలుస్తోంది.

బాలీవుడ్‌లో ప్రేమకథా చిత్రాలను గ్రాండ్‌గా తెరకెక్కించడంలో దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ సిద్ధహస్తుడు. ఇప్పుడాయన మరో ప్రణయగాథను వెండితెరపైకి తెచ్చేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ చిత్రంలో రణ్‌బీర్‌కపూర్, విక్కీ కౌశల్‌ను హీరోలుగా అనుకుంటున్నారట. ఈ ముక్కోణపు ప్రేమకథలో ఆలియాభట్ హీరోయిన్



గా నటించనున్నారట. నవంబర్‌లో ఈ చిత్రం సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు భన్సాలీ సన్నాహాలు చేస్తున్నట్లు టాక్.

మాజీ క్రికెటర్ సౌరవ్ గంగూలీ జీవితం ఆధారంగా ప్రముఖ నిర్మాత సాజిద్ నడియాడ్‌వాలా ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారని సమాచారం. అయితే ఇందులో గంగూలీ పాత్రను పోషించే హీరో ఎవరనేది ఇంకా ఖాయం కాలేదు. ఈ పాత్ర కోసం రణ్‌బీర్‌కపూర్, హృతిక్ రోషన్, ఆయుష్మాన్ ఖురానా పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. సాజిద్ ఇటీవలే రజనీకాంత్‌తో ఓ సినిమా చేయబోతున్నట్లు ప్రకటించారు. ఆయన నటించబోయేది గంగూలీ బయోపిక్‌లోనే అనే టాక్ పరిశ్రమలో వినిపిస్తోంది. అదే నిజమైతే మరి రజనీకాంత్ ఈ బయోపిక్‌లో ఏ పాత్రలో కనిపిస్తారనేది తెలియాల్సి ఉంది. అలాగే గంగూలీ బయోపిక్‌కు రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య దర్శకత్వం వహించనున్నారని కోలీవుడ్ వర్గాల సమాచారం.

అక్కినేని బంగారు కుటుంబం ప్రత్యేకత అదే



మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు, దర్శకరత్న దాసరి నారాయణరావు కాంబినేషన్‌లో రూపుదిద్దుకున్న చిత్రాల్లో అధిక శాతం విజయవంతమైనవే. వాటిల్లో నటుడు కైకాల సత్యనారాయణ, ఆయన సోదరుడు నాగేశ్వరరావు కలసి నిర్మించిన 'బంగారు కుటుంబం' చిత్రం కూడా ఒకటి. ఏ తరహా చిత్రాలు తీస్తే ప్రేక్షకులు ఆదరిస్తారో తెలియని అయోమయ పరిస్థితి సినీ పరిశ్రమలో నెలకొన్న సమయంలో విడుదలైన 'బంగారు కుటుంబం' సూపర్ హిట్ అయి, పరిశ్రమకు దిక్సూచిగా నిలిచింది. రూ. 85 లక్షల వ్యయంతో తయారై 30 ఏళ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం ఆ రోజుల్లో రూ. 3 కోట్లకు పైగా వసూలు చేసింది. కంటెంట్ ఉన్న చిత్రాలకు ప్రేక్షకుల ఆదరణ తప్పకుండా ఉంటుందని మరోసారి 'బంగారు కుటుంబం' నిరూపించింది. 1993 సెప్టెంబర్ 20న హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో 'బంగారు కుటుంబం' చిత్రం ప్రారంభమైంది. ఆ డేట్‌కు ఓ ప్రత్యేకత ఉంది. అదేమిటంటే.. 'సీతా రామ జననం' చిత్రంతో అక్కినేని హీరోగా పరిచయమై 50 ఏళ్లు, 'హరిశ్చంద్ర' నాటకంలో చంద్రమతి పాత్రతో రంగస్థలంపై అడుగుపెట్టి 60 ఏళ్లు, నిజ జీవితంలో 70 ఏళ్లు అయిన సందర్భంగా, సెప్టెంబర్ 20 ప్రత్యేకమైన రోజు కావడంతో 'బంగారు కుటుంబం' చిత్రం షూటింగ్ ప్రారంభించారు. అక్కినేని, జయసుధపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు దర్శకుడు రాఘవేంద్రరావు కెమెరా స్విచ్ఆన్ చేయగా, మెగాస్టార్ చిరంజీవి తొలి క్లాప్ ఇచ్చారు. సూపర్ స్టార్ కృష్ణ గౌరవ దర్శకత్వం వహించారు.

ఈ చిత్రంలో మొదలియార్ పాత్ర దాసరి పోషించారు. అరవ యాసతో తెలుగు సంభాషణలు పలికి, కథలో కీలకమైన ఆ పాత్రకు ప్రత్యేకత చేకూర్చారు. ఇందులో అక్కినేని కుమారుడిగా తమిళ చిత్ర రంగంలో అగ్ర హీరోగా ఉన్న విక్రమ్ నటించారు. మరో ఇద్దరు కొడుకులుగా రాజ్‌కుమార్, హరీశ్ నటించగా, కోడళ్ల పాత్రలను యమున, రాజీవి, రంభ పోషించారు. చిత్ర సమర్పకుడు కైకాల సత్యనారాయణ కామెడీ, విలనీ కలగలసిన పాత్ర పోషించారు. 1994 ఫిబ్రవరి 18న విడుదలైన 'బంగారు కుటుంబం' చిత్రం ఉత్తమ కథా చిత్రంగా బంగారు నందిని పొందింది. అలాగే ఉత్తమ నటుడిగా అక్కినేని అవార్డ్ అందుకొన్నారు.



బీజేపీలోకి అనూరాధ పొడ్వాల్

ప్రముఖ గాయని, 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత అనూరాధ పొడ్వాల్ బీజేపీలో చేరారు. శనివారం బీజేపీ నాయకులు ఆమెను సాదరంగా పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "ప్లేబ్యాక్ సింగర్‌గా కెరీర్ మొదలుపెట్టిన నేను, 35 ఏళ్లుగా కేవలం భక్తి గీతాలనే ఆలపిస్తున్నాను. సనాతన ధర్మంతో వేళ్లూనుకుపోయిన బీజేపీలో చేరడం ఆనందంగా ఉంది. మోదీ దేశాన్ని సుస్థిర ప్రగతి వైపు నడిపిస్తున్నారు. అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవంలో రాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా నాకు పాడే అవకాశం ఇవ్వడంతో నా జీవిత కల సాకారమైంది" అని అన్నారు.




ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
3 బాడీ ప్రాబ్లమ్	వెబ్‌సిరీస్	మార్చి 21
ఫైటర్	హిందీ చిత్రం	మార్చి 21
లాల్‌సలామ్	తమిళ చిత్రం	మార్చి 22
అమెజాన్ ప్రైమ్		
ప్లే గ్రౌండ్	హిందీ సిరీస్	మార్చి 17
మరక్కుమ నెంజాం	తమిళ చిత్రం	మార్చి 19
ఏ వతన్ మేరే వతన్	హిందీ చిత్రం	మార్చి 21
రోడ్ హౌస్	హాలీవుడ్ మూవీ	మార్చి 21
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
అబ్రహం ఓజ్లర్	మలయాళ చిత్రం	మార్చి 20
లూటేరా	హిందీ సిరీస్	మార్చి 22
ఆహా...		
భూతద్దం భాస్కర్ నారాయణ	తెలుగు చిత్రం	మార్చి 22
బుక్ మై షో		
ఫ్రాయిడ్స్ లాస్ట్ సెషన్	హాలీవుడ్ మూవీ	మార్చి 19
జియో సినిమా		
ఓపెన్ హైమర్	హాలీవుడ్ మూవీ	మార్చి 21
ఈటీవీ విన్		
సుందరం మాస్టర్	తెలుగు చిత్రం	మార్చి 22









హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్)- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ జూనియర్ గురుకుల కళాశాలల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. సంస్థ నిర్వహించే రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌జేసీ సెట్) 2024 ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌జేసీ సెట్

తెలంగాణ బీసీ గురుకులాల వివరాలు

రాష్ట్రంలోని 261 బీసీ జూనియర్ గురుకుల కళాశాలల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. వీటిలో బాలురకు కేటాయించిన 130 కళాశాలల్లో మొత్తం 11360 సీట్లు; బాలికలకు కేటాయించిన 127 కళాశాలల్లో మొత్తం 10560 సీట్లు ఉన్నాయి. నాలుగు 'కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ)' గురుకులాలు ఉన్నాయి. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూప్‌లతోపాటు ఒకేషనల్ కోర్సులు - అగ్రికల్చర్ అండ్ క్రాప్ ప్రొడక్షన్, కంప్యూటర్ గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్, ప్రీ స్కూల్ టీచర్ ట్రెయినింగ్, కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఫిజియోథెరపీ, టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కూడా అందుబాటులో ఉన్నాయి. ఆసక్తిగల అభ్యర్థులకు ఐఐటీ, నీట్, ఎంసెట్, సీఏ/సీపీటీ, క్లాట్ కోచింగ్ ఇస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. డిజిటల్ క్లాస్‌లు ఉంటాయి. లోకో పేరెంట్ సిస్టమ్‌ను అనుసరిస్తారు. క్రీడలు, కో కరిక్యులర్ యాక్టివిటీస్‌కు ప్రాధాన్యమిస్తారు. బెడ్డింగ్ మెటీరియల్, యూనిఫాం, నోట్ బుక్స్, క్లాస్ బుక్స్ ఇస్తారు. ఆధునిక ప్రమాణాలతో ల్యాబొరేటరీలు, లైబ్రరీలు, రీడింగ్ రూమ్స్, ప్లే గ్రౌండ్స్ ఉంటాయి. బోధన, వసతి ఉచితం. కాస్మొటిక్ ఛార్జీలు ఇస్తారు. కాషన్ డిపాజిట్ కింద రూ.1000; మెయింటెనెన్స్ ఛార్జీల కింద రూ.1000లు చెల్లించాల్సి ఉంటుంది. పరీక్ష ఫీజులను సొసైటీ భరిస్తుంది ఎంజేపీటీబీసీడబ్ల్యూ గురుకుల పాఠశాలల్లో చదివిన విద్యార్థులు, ప్రభుత్వ బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఉన్నవారి కోసం 25 శాతం సీట్లు ప్రత్యేకించారు. ప్రతి గురుకులంలో స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేసి 'సూపర్-100 సెంటర్ క్యాంపస్'లను నిర్వహిస్తారు.

అర్హత

ప్రస్తుతం పదోతరగతి/తత్సమాన పరీక్షలు రాసే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటికే పదోతరగతి పూర్తిచేసినవారు, సప్లిమెంటరీ/అడ్వాన్స్ సప్లిమెంటరీ అభ్యర్థులు అనర్హులు. కుటుంబ వార్షికా దాయం నగరాల్లో రూ.2,00,000లు; గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000లు మించ కూడదు.

సెట్ వివరాలు

దీనిని 150 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ఒకేషనల్ కోర్సులు సహా అన్ని గ్రూప్‌ల అభ్యర్థులకు ఇంగ్లీష్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఎంపీసీ అభ్యర్థులకు మేథమెటిక్స్, ఫిజికల్ సైన్స్; బైపీసీ అభ్యర్థులకు బయలాజికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్; ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ అభ్యర్థులకు మేథమెటిక్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఒకేషనల్ కోర్సుల్లో సీజీఏ, పీఎస్‌టీటీ, సీజీటీ కోర్సులకు మేథమెటిక్స్, సోషల్ స్టడీస్ నుంచి; ఏసీపీ, టీ అండ్ హెచ్ కోర్సులకు బయలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ నుంచి; ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ, పీటీ కోర్సులకు బయలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో సబ్జెక్ట్ నుంచి 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ పదోతరగతి స్థాయిలోనే ఉంటాయి. ప్రశ్నపత్రం ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఉంటుంది. విద్యార్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. గ్రూప్ కోర్సులకు జిల్లాస్థాయి మెరిట్ ప్రకారం, ఒకేషనల్ కోర్సులకు రాష్ట్ర స్థాయి మెరిట్ ప్రకారం ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 12
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 21 నుంచి
- **ఎంజేపీటీబీసీడబ్ల్యూ ఆర్‌జేసీ సెట్ 2024 తేదీ:** ఏప్రిల్ 28
- **వెబ్‌సైట్:** mjptbcwreis.telangana.gov.in

నోటిఫికేషన్స్

ఏపీ ఈసెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(ఏపీఎస్‌సీహెచ్ఈ)- స్టేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీఈసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షని అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూఏ) నిర్వహిస్తోంది. దీని ద్వారా బీఈ, బీటెక్, బీఫార్మసీ కోర్సులకు సంబంధించి రెండో సంవత్సరంలో (లేటరల్ ఎంట్రీ) ప్రవేశాలు కల్పిస్తారు. ఈసెట్‌లో సాధించిన ర్యాంక్ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, మైనారిటీ, నాన్ మైనారిటీ ప్రొఫెషనల్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష సిలబస్, మాక్ టెస్ట్‌ల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

విభాగాలు: అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, సిరామిక్ టెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ఫార్మసీ.

అర్హత వివరాలు: స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్(టీఎస్/ఏపీ) నుంచి ఇంజనీరింగ్/ టెక్నాలజీ/ఫార్మసీ విభాగాల్లో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా మూడేళ్ల బీఎస్సీ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా/డిగ్రీ స్థాయిలో కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు.

ఏపీ ఈసెట్ 2024 వివరాలు

- పరీక్ష సమయం మూడు గంటలు. మొత్తం మార్కులు 200. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఉంటుంది. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 25 శాతం మార్కులు రావాలి.
- ఇంజనీరింగ్ డిప్లొమా అభ్యర్థులకు నిర్వహించే పరీక్షలో మేథమెటిక్స్ నుంచి 50, ఫిజిక్స్ నుంచి 25, కెమిస్ట్రీ నుంచి 25, సంబంధిత ఇంజనీరింగ్ విభాగం(సివిల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ మెకానికల్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ కంప్యూటర్ సైన్స్/ కెమికల్/ మెటలర్జికల్/మైనింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్)నుంచి 100 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- బీఎస్సీ(మేథమెటిక్స్) అభ్యర్థులకు మేథమెటిక్స్ నుంచి 100, అనలిటికల్ ఎబిలిటీ నుంచి 50, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ నుంచి 50 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.
- ఫార్మసీ అభ్యర్థులకు ఫార్మాస్యూటిక్స్, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఫార్మకాగ్నసీ, ఫార్మకాలజీ అంశాలనుంచి ఒక్కోదానిలో 50 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; బీసీ అభ్యర్థులకు రూ.550; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **కరక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 25 నుంచి 27 వరకు
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 1 నుంచి
- **ఏపీ ఈసెట్ 2024 తేదీ:** మే 8
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in/ECET

ఏయూ ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ టెస్ట్

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ(ఏయూ)- ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏయూఈఈటీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా బీటెక్ (సెల్ఫ్ సపోర్ట్ మోడ్) డిగ్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన తరవాత మరో రెండేళ్లు చదివి ఎంటెక్ డిగ్రీ పొందే వీలుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



విభాగాలు-సీట్లు: ఆంధ్ర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో మొత్తం 510 సీట్లు ఉన్నాయి. వీటిలో కంప్యూటర్ సైన్స్ 360, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ 60, మెకానికల్ 30, సివిల్ 30, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైనవారు అర్హులు. ఇంటర్ స్థాయిలో కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు.


ఏయూఈఈటీ 2024 వివరాలు: పరీక్షని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. మేథమెటిక్స్ నుంచి 40, ఫిజిక్స్ నుంచి 30, కెమిస్ట్రీ నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఇంటర్/పన్నెండో తరగతి స్థాయిలోనే ఉంటాయి. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం గంటన్నర. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 24
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 3 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కడప.
- **ఏయూఈఈటీ 2024 తేదీ:** మే 5
- **ఫలితాలు విడుదల:** మే 7
- **వెబ్‌సైట్:** www.andhrauniversity.edu.in

ఎన్ఐఏఎంటీలో అడ్వాన్స్‌డ్ డిప్లొమా

రాంచీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ(ఎన్ఐఏఎంటీ)- అడ్వాన్స్‌డ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫౌండ్రీ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లో 58 సీట్లు, ఫోర్జ్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లో 57 సీట్లు ఉన్నాయి. కోర్సు వ్యవధి 18 నెలలు. ఇందులో మూడు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లకు ఒక్కోదానికి 26 క్రెడిట్స్ మూడో సెమిస్టర్‌కు 18 క్రెడిట్స్ నిర్దేశించారు. ప్రోగ్రామ్‌లో భాగంగా లెక్చర్స్, సెమినార్స్ ల్యాబొరేటరీ సెషన్స్, వర్క్‌షాప్స్, టెక్నికల్ వీడియో సెషన్స్, ఇన్‌ప్లాంట్ ట్రెయినింగ్ తదితరాలు ఉంటాయి. అభ్యర్థులందరికీ మొదటి రెండు సెమిస్టర్లు కామన్‌గా ఉంటాయి. చివరి సెమిస్టర్‌లో స్పెషలైజేషన్‌కు సంబంధించిన ప్రాజెక్ట్ వర్క్‌లు, ఇండస్ట్రియల్ ట్రెయినింగ్‌లు ఉంటాయి. అభ్యర్థులను రిటెన్ టెస్ట్, కౌన్సెలింగ్‌ల ద్వారా ఎంపిక చేస్తారు. అడ్మిషన్ పొందిన వారికి నెలకు రూ.3,000 స్టయిపెండ్ ఇస్తారు. ఫౌండ్రీ, ఫోర్జ్ టెక్నాలజీ విభాగాల్లో కేంద్ర ప్రభుత్వ సర్వీసులు, ఉద్యోగాల భర్తీకి ఈ కోర్సును అర్హతగా నిర్దేశించారు.



అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో మెటలర్జికల్/మెకానికల్/ప్రొడక్షన్/మాన్యుఫాక్చరింగ్/ఆటోమొబైల్/ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ విభాగాల్లో డిప్లొమా/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; బీఎస్సీ(ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/ కంప్యూటర్ అప్లికేషన్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు అడ్మిషన్ పొందిన 60 రోజులలోపు ప్రొవిజనల్ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి.

రిటెన్ టెస్ట్: ఇందులో అనలిటికల్ ఎబిలిటీ, జనరల్ ఇంగ్లీష్, జనరల్ అవేర్‌నెస్, మేథమెటికల్ స్కిల్స్, బేసిక్ సైన్సెస్, ఇంజనీరింగ్ ఆప్టిట్యూడ్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ బేసిక్ లెవెల్ నుంచి డిగ్రీ స్థాయి వరకు ఉంటాయి.

- అభ్యర్థులు గూగుల్ లింక్ ద్వారా దరఖాస్తు ఫారాన్ని అప్‌లోడ్ చేయాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** జూన్ 9
- **రిటెన్ టెస్ట్ తేదీ:** జూన్ 30
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కోల్‌కతా, న్యూఢిల్లీ, పుణె
- **ఫలితాలు విడుదల:** జూలై 12
- **అడ్మిషన్స్:** జూలై 23 నుంచి 26 వరకు
- **తరగతులు ప్రారంభం:** జూలై 29 నుంచి
- **చిరునామా:** అసిస్టెంట్ రిజిస్ట్రార్, రూమ్ నెం 206, అకడమిక్స్ సెక్షన్, లెక్చర్ హాల్ కాంప్లెక్స్, ఎన్ఐఏఎంటీ, హతియా, రాంచీ-834003
- **వెబ్‌సైట్:** www.niamt.ac.in

నవోదయ విద్యాలయాల్లో నాన్ టీచింగ్ పోస్టులు

నోయిడాలోని నవోదయ విద్యాలయ సమితి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఎన్‌వీఎస్ ప్రధాన కార్యాలయంతోపాటు దేశవ్యాప్తంగా నెలకొన్న ఎన్‌వీఎస్ ప్రాంతీయ కార్యాలయాలు, ఎన్ఎల్ఐలు, జవహర్ నవోదయ విద్యాలయాల్లో నాన్ టీచింగ్ స్టాఫ్ **1,377** పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

పోస్టులు

1. ఫిమేల్ స్టాఫ్ నర్స్: **121**
2. అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్: **5**
3. ఆడిట్ అసిస్టెంట్: **12**
4. జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్: **4**
5. లీగల్ అసిస్టెంట్: **1**
6. స్టెనోగ్రాఫర్: **23**
7. కంప్యూటర్ ఆపరేటర్: **2**
8. క్యాటరింగ్ సూపర్‌వైజర్: **78**
9. జూనియర్ సెక్రటేరియల్ అసిస్టెంట్: **381**
10. ఎలక్ట్రీషియన్ కం ప్లంబర్: **128**
11. ల్యాబ్ అటెండెంట్: **161**
12. మెస్ హెల్పర్: **442**
13. మల్టీ టాస్కింగ్ స్టాఫ్: **19**



అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, పన్నెండో తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్స్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక: రాతపరీక్ష, ట్రేడ్/ స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, కాకినాడ, నెల్లూరు, గుంటూరు, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్.

దరఖాస్తు విధానం: కేంద్రీయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు రుసుము: జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1,500(ఫిమేల్ స్టాఫ్ నర్స్ పోస్టులకు), రూ.1000(ఇతర పోస్టులకు), ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు రూ.500. (ఆన్‌లైన్ దరఖాస్తు, పరీక్ష తేదీలు తదితరాలకు వెబ్‌సైట్ పరిశీలిస్తూ ఉండండి.)

వెబ్‌సైట్: navodaya.gov.in/nvs/en/Home1

జాబ్ కార్నర్

లఖ్‌నవూలోని సీఎస్ఐఆర్‌కు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టాక్సికాలజీ రీసెర్చ్(ఐఐటీఆర్)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఐఐటీఆర్‌లో టెక్నీషియన్ ఖాళీలు

మొత్తం ఖాళీలు: 19

1. టెక్నికల్ అసిస్టెంట్: **8 పోస్టులు**
2. టెక్నీషియన్: **11 పోస్టులు**

విభాగాలు: కెమికల్ సైన్సెస్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/సివిల్ ఇంజనీరింగ్/యానిమల్ హౌజ్ అండ్ జీఎల్‌పీ ఫ్యాకల్టీ/బయలాజికల్ సైన్సెస్/ఎన్విరాన్‌మెంటల్ మానిటరింగ్/ఎపిడెమియాలజీ/ఇండస్ట్రియల్ రీసెర్చ్/సెన్సర్ అండ్ డివైజ్ డెవలప్‌మెంట్/ప్లంబర్/ఎలక్ట్రీషియన్/రిఫ్రిజిరేషన్-ఏసీ టెక్నీషియన్, కంప్యూటర్ సైన్స్.

అర్హత: పోస్టును అనుసరించి ఎస్ఎస్‌సీ, సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఎస్సీ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 28 ఏళ్లు మించకూడదు

జీతం: టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుకు రూ.63,312. టెక్నీషియన్ పోస్టుకు రూ.34,625.

ఎంపిక: రాత పరీక్ష, స్కిల్/ట్రేడ్ టెస్ట్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 31

వెబ్‌సైట్: https://www.csir.res.in/

కపుర్తలా(పంజాబ్)లోని రైల్ కోచ్ ఫ్యాక్టరీ(ఆర్‌సీఎఫ్)...కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీ భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

రైల్ కోచ్ ఫ్యాక్టరీలో అప్రెంటిస్‌లు

ఖాళీలు: 550

ట్రేడులు: ఫిట్టర్, వెల్డర్, మెషినిస్ట్, పెయింటర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ అండ్ రిఫ్రిజిరేటర్ మెకానిక్.

అర్హత: మెట్రిక్యులేషన్, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 మార్చి 31 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి

ఎంపిక ప్రక్రియ: అకడమిక్ స్కోర్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 9

వెబ్‌సైట్: https://rcf.indianrailways.gov.in/

లిటిల్స్



మీకు తెలుసా?

- ఖడ్గంలాంటి ఒంటి కొమ్మును కలిగి ఉండటం వల్లనే దీన్ని ఖడ్గమృగము అని పిలుస్తారు. ప్రపంచంలో కేవలం ఇవి ఐదు జాతులు మాత్రమే ఉన్నాయి. ఒకటి ఆఫ్రికాలో తెలుపు, నలుపు ఖడ్గమృగాలు. మూడోది ఆసియన్ రినో. వీటికి కేవలం ఒకే ఒక్క కొమ్ము ఉంటుంది. ఇవి మన దగ్గర ఉంటాయి. వీటితో పాటు సుమత్రా, జావన్ రినో.
- మనకు జుట్టు, గోర్లు పెరిగినట్లే వీటికి కొమ్ము పెరుగుతుంది. ఇది కెరోటిన్ నిర్మితమే. కాకపోతే చాలా గట్టిగా ఉంటుంది. ఇది తలచుకుంటే కారును కూడా కొమ్ముతో బోల్తా కొట్టించగలదు.
- తెలుపు ఖడ్గమృగాలు అతి పెద్దవి. వీటి బరువు సుమారు 3500 కేజీలు ఉంటుంది. అతి చిన్నవి సుమత్రా రినోస్. వీటి బరువు 600 కేజీలు ఉంటాయి.




- మగ జంతువులను 'బుల్స్' అని.. ఆడ జంతువును 'కౌ' అని పిలుస్తారు.
- వీటి చూపు తక్కువ. కేవలం 30 మీటర్ల దూరంలో ఉండేవి కనిపించవు. అయితే ఇవి వాసన పట్టడంలో గ్రేట్. తన దగ్గరకు ఏవి వస్తున్నాయో అంచనా వేయగలవు.
- ఆఫ్రికన్ రినోలతో పోలిస్తే ఆసియన్ రినోలు వేగంగా ఈదగలవు. నదిని సైతం సునాయసంగా ఈదగలవు. ముఖ్యంగా ఏ రినో అయినా బురదలో ఉండటానికి ఇష్టపడుతుంది. బురదను కోటింగ్‌లా వేసుకోవటం వల్ల దోమలు, ఇతర కీటకాల బారినుంచి రక్షించుకోగలుగుతాయి.
- వియత్నాంలో రినో కొమ్ము స్టేటస్ సింబల్. దీంతో పాటు కొన్నిచోట్ల క్యాన్సర్, ఇతర వ్యాధులను అంతమొందించటానికి వీటిని వాడతారట. దీంతో పాటు ఇతర భాగాలు కొన్ని ఔషధాల్లో విలువైనవట. అందుకే వీటిని వేటాడటానికి ప్రత్యేకమైన గ్యాంగ్స్ ఉన్నాయి. గత పదేళ్ల కాలంలో 7,100 రినోలను వేటగాళ్లు అంతమొందించారు. దీన్ని బట్టి వీటి సంఖ్య నానాటికీ ఎంత దిగజారిపోతుందో అర్థం చేసుకోవచ్చు. వీటిని వేటాడటానికి హెలికాప్టర్లలో వచ్చి కేవలం పది నిముషాల్లోనే ఎత్తుకెళ్లే ముఠాలున్నాయి.
- వీటి మెదడు చిన్నది. గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో పరిగెత్తుతాయి.
- సుమత్రా రినో మాత్రం మనుషులకు దగ్గరగా ఉంటుంది.
- రినోల పిల్లలు చిన్నప్పుడే పులుల బారిన పడుతుంటాయి.

సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



జతలేని బొమ్మ ఏది?



డైలీ సుడోకు - 257

2					3		7	
	3		4		9			8
					6	2		
			7			8	1	5
		8				3		
1	7	3			5			
		4	2					
6			3		7		4	
	2		6					3

సుడోకు - 256 సమాధానం

9	2	6	7	3	1	4	8	5
3	4	7	5	8	2	9	6	1
5	8	1	6	4	9	3	2	7
4	1	8	9	5	7	2	3	6
7	3	9	2	6	8	1	5	4
2	6	5	3	1	4	7	9	8
1	9	2	8	7	5	6	4	3
8	7	3	4	2	6	5	1	9
6	5	4	1	9	3	8	7	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.